ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-2-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 21 పేజీలు: 10+4 వెల: 6.50


భారత్‌కు వీసా సేవలు పునరుద్ధరించిన బంగ్లా

'సర్' విధులకు న్యాయాధికారులు

5లో




# ట్రంప్‌కు షాక్!

## ప్రతీకార సుంకాలను కొట్టివేసిన అమెరికా సుప్రీంకోర్టు

### భారత్‌పై విధించిన 18% కూడా అనధికారికమే

### నా దగ్గర ప్లాన్-బి ఉంది: ట్రంప్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కి సుంకాల విషయంలో ఎదురుదెబ్బ తగిలింది. ట్రంప్ ప్రతీకార సుంకాలను ఆ దేశ సుప్రీంకోర్టు కొట్టివేసింది. టారీఫ్‌లను విధించే అధికారం అధ్యక్షుడికి లేదని కోర్టు తేల్చిచెప్పింది. ఆర్థిక విధానానికి కేంద్రబిందువుగా, ప్రధాన విదేశాంగ విధాన సాధనంగా సుంకాలను వాడుకోవడాన్ని వ్యతిరేకించింది అధ్యక్షుడి నిర్ణయం >>2



శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో సిఎం చంద్రబాబు సమక్షంలో నైపుణ్య శిక్షణ, మౌలిక సదుపాయాల కల్పనపై ఎంఒయుల దృశ్యం

## ఎఐ డేటా హబ్‌గా మారనున్న విశాఖ

డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకు..

రాష్ట్రంలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ తదితర క్లస్టర్లు

ఢిల్లీ ఎఐ ఇంపాక్ట్ సదస్సులో సిఎం చంద్రబాబు

నైపుణ్యశిక్షణ, మౌలిక సదుపాయాల కల్పనపై 7ఎంఒయులు

# భవిష్యత్తు అమరావతి క్వాంటందే

**విజయవాడ,ఫిబ్రవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి క్వాంటం వ్యాలీపై సమీప భవిష్యత్‌లో ప్రపంచమంతా మాట్లాడే రోజు వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.గూగుల్ లాంటి సంస్థల రాకతో ఏపీలోని విశాఖ, ఏఐ డేటా హబ్‌గా మారుతుంది. ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్ పరికరాల తయారీకి క్వాంటం ఎకో సిస్టం రూపకల్పన అయ్యింది. దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలన్న ఆకాంక్షతో ప్రధాని మోడీ పనిచేస్తున్నారు. ప్రధాని మోడీ ఆకాంక్షను దేశం సాధించి తీరుతుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతాలను సాధిస్తుందన్న విశ్వాసం ఉంది. పౌరులందరికీ ప్రయోజనం కలిగేలా సావరిన్ ఏఐ వినియోగానికి ప్రయత్నిస్తున్నాం. డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా ఏపీ దృష్టి సారిస్తోంది. ఏపీలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ పార్క్ లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయి. పెద్దఎత్తున పెట్టుబడుల ఆకర్షణతో పాటు క్వాంటం ఎకోసిస్టం తీర్చిదిద్దుతున్నాం. ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాలను కూడా తయారు చేసేలా క్వాంటం ఎకో సిస్టానికి రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు.ఇందులో భాగంగా ఏఐ యాక్సిలరేటర్స్ ఫ్యూయలింగ్ ఇండియాస్ ఎకనామిక్ గ్రోత్ అనే అంశంపై జరిగే సెషన్‌లో అసోం సిఎం హిమంత బిశ్వశర్మ, కేంద్రమంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ ప్రతినిధులతో కలిసి సీఎం >>2

# కల్తీ నెయ్యిపై రగడ..రగడ




దేవుడి ఫొటోలతో కౌన్సిల్‌లో వైసిపి సభ్యుల నిరసన

## చెప్పులు వేసుకుని దేవుడి ఫొటోలతో మనోభావాలను దెబ్బతీసారు: టిడిపి

వరుసగా మళ్లీ శాసనమండలి వాయిదా

### రిటైర్డ్ ఐఎఎస్ అధికారి దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏక సభ్య కమిటీ



**తిరుమల, ఫిబ్రవరి 20ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర అసెంబ్లీలో ,శాసనమండలిలో పెద్ద దుమారం రేపిన కల్తీనెయ్యి వ్యవహారంలో అసలు సూత్రదారులెవరనే నిగ్గుతేల్చేందుకు ఎట్టకేలకు ప్రభుత్వం విశ్రాంత ఐఎఎస్ అధికారి దినేష్‌కుమార్‌తో ఏకసభ్యకమిటీ ఏర్పాటుచేసింది. ఆయన త్వరలోనే బాధ్యతలు చేపట్టి గతంలో సిబిఐ సిట్ ఇచ్చిన నివేదికపై పూర్తిస్థాయిలో >>2

**అమరావతి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఎపి శాసనమండలి మరోసారి నిరసనలకు వేదికగా మారింది. అధికార, ప్రతిపక్షాల పరస్పర ఆరోపణలు దూషణలతో గందరగళ వాతావరణం నెలకొంది. తిరుమలలో కల్తీ నెయ్యి వినియోగంపై ఒకరిపై మరొకరు నిందారోపణలు చేసుకున్నారు. ముఖ్యంగా వైసీపీ ఎమ్మెల్సీలు తిరుమల వెంకటేశ్వరుడి ఫోటోలతో నిరసన తెలపడం నిప్పు రాజేసినట్లు అయ్యింది. శాసనసభావ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ నిరసన తెలుపుతున్న వైఖరి సరికాదని పదేపదే హెచ్చరించినా వైసీపీ సభ్యులు పట్టించుకోలేదు. సభ ప్రారంభం అయినప్పటి నుంచి గందరగోళ వాతావరణం కొనసాగింది. హెరిటేజ్ సంస్థకు అనుబంధంగా ఉన్న ఇంద్రాపూర్ నెయ్యి పూర్తిగా కల్తీతో కూడుకున్నాయని, వాటిని తిరుమలతో ఉపయోగించినందుకు సభముఖ్యంగా క్షమాపణలు చెప్పాలని వైసీపీ సభ్యులు పట్టు పట్టారు. అయితే చెప్పులు వేసుకుని దేవుడి బొమ్మలు పట్టుకుని తమ మనోభావాలను దెబ్బతీసారని టిడిపి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలిలో నిరసన వ్యక్తం చేయడానికి చేయడానికి తీసుకువచ్చిన దేవుడి ఫోటోలను వైసీపీ సభ్యులు విసిరేసి వెళ్లిపోవడం సరికాదని వారు ఆరోపించారు. హెరిటేజ్ సంస్థకు అనుబంధంగా ఉన్న ఇందాపూర్ డెయిరీ ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానానికి నెయ్యి సరఫరాపై చర్చించాలని వైసీపీ సభ్యులు రవిబాబు, తూమాటి మాధవరావు, మంగమ్మలు ఇచ్చిన వాయిదా తీర్మానాలను మండలి చైర్మన్ కొయ్యె మోషేను రాజు తిరస్కరించారు. దీనితో ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు, వెంకటేశ్వరస్వామి ఫోటోలను చేతపట్టుకుని, ప్లకార్డులతో పోడియంను చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. తమకు సమాధానం ఇవ్వాలని, ఈ అంశంపై చర్చకు అనుమతి ఇవ్వాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. వైసీపీ సభ్యుల ఆందోళనతో సభ వాయిదా పడింది. తిరిగి కొద్దిసేపటికి సభ మొదలైనా మరోమారు కూటమి సభ్యులు ఆందోళనకు దిగారు. >>2



## డిజిపి, డిఎస్పీలు ఏం చేస్తున్నారు?

అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో సుప్రీంకోర్టు ఆగ్రహం

మీరు దర్యాప్తు చేయలేకపోతే కేసు సిబిఐకి అప్పగిస్తామని హెచ్చరిక

నవంబరు 18లోపు ట్రయల్ కోర్టు విచారణ పూర్తికావాలని ఆదేశం

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన వైసీపీ నేత అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. అప్పట్లో పోలీసులు ఈ కేసు విషయంలో వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దర్యాప్తు సంస్థలు, నిందితుడు ఒక్కటయ్యారు అనే రీతిలో వ్యవహరించారని మండిపడింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును >>2

# ప్రేమిస్తే.. చంపేస్తారా!

## రైల్వే ట్రాక్‌పై శవమై తేలిన ప్రేమికుడు

అమ్మాయి బంధువులే చంపారంటున్న తల్లిదండ్రులు

కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం చేసిందని ఆరోపణ

కర్నూలు నగరంలో ప్రేమ జంటపై పెద్దల దుర్మార్గం



హుస్సేన్ పీరా(ఫైల్)

**కర్నూలు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** వయసులో ఉన్న పిల్లలు ప్రేమించుకుంటే.. చంపేస్తారా.. ఇదేనా న్యాయం.. ఇదెక్కడి దుర్మార్గం అంటూ ఓ అబ్బాయి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతూ ప్రశ్నిస్తున్నారు. ఇన్ని చట్టాలు.. ఇంత అభివృద్ధి జరిగినా ఇలాంటి ఆటవిక చర్యలు ఆగవా అంటూ దుమ్మెత్తి పోస్తున్నారు. గతంలో తమ కళ్ళెదుటే దారుణంగా కొట్టారు.. మళ్ళీ కర్నూలులో కనిపిస్తే చంపేస్తామంటూ.. వార్నింగ్ ఇచ్చారు. ప్రేమ మోహంలో కర్నూలుకు వచ్చిన అబ్బాయిని చంపి రైల్వే ట్రాక్ పై పడవేశారంటూ రోదిస్తున్నారు. తమ బిడ్డను చంపిన వారికి కఠిన శిక్షలు వేసి న్యాయాన్ని బతికించాలని ఆ తల్లిదండ్రులు ప్రాధేయ పడుతున్నారు. మరి ఆ బడా బాబులను చట్టం శిక్షిస్తుందా..లేక..కర్నూలు నగర శివారులలోని సాయి కృష్ణ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హుస్సేన్ పీరా అనే అబ్బాయి గురువారం ఉదయం రైల్వే ట్రాక్ పై శవమై కనిపించాడు. మొదట రైల్వే పోలీసులు గుర్తుతెలియని శవంగా తేల్చి మీడియాకు వివరాల అందించారు. మీడియా కథనాలతో విషయం తల్లిదండ్రులకు తెలిసింది. నంద్యాల జిల్లా వెలుగోడు మండలం మంచాలకట్ట గ్రామానికి చెందిన హుస్సేన్ వల్లి, రమీజాభి దంపతుల కుమారుడు హుస్సేన్ పీరా కర్నూలు నగర శివారులోని సాయి కృష్ణ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. అదే కళాశాలలోని ఒక అమ్మాయితో ప్రేమలో పడ్డట్టు తెలుస్తోందని హుస్సేన్ తల్లిదండ్రులు చెబుతున్నారు. గతంలో అమ్మాయి బంధువులు కళాశాలకు వచ్చి కళాశాలలో విచారించి అబ్బాయిని వారి స్టైల్ లో మందలించారు. అప్పుడే అబ్బాయి తల్లిదండ్రులు తమ కుమారుడుని కళాశాల నుంచి తీసుకెళ్తామని సర్టిఫికెట్లు ఇవ్వమని అడిగారు. అయితే కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వ కుండా ఇక్కడేఉండి చదవాలని >>2

# శ్రీశైలంలోను కల్తీ నెయ్యి!



సమగ్ర విచారణ జరపాలన్న చైర్మన్ రమేష్‌నాయుడు

జగన్ హయాంలోని ఓ మంత్రి, ఎమ్మెల్యే, అధికారి హస్తం ఉందని ఆరోపణ

మరికొన్ని పుణ్యక్షేత్రాలకూ అదే కల్తీ నెయ్యి?

**శ్రీశైలంప్రాజెక్టు,ఫిబ్రవరి20,ప్రభాతవార్త:** వైసిపి ప్రభుత్వ హాయంలో శ్రీశైలదేవస్థానంకు కల్తి నెయ్యి సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని శ్రీశైలందేవస్థానం దర్మకర్తల మండలి ఆధ్యక్షులు పి.రమేష్‌నాయుడు డిమాండు చేసారు.శుక్రవారం చైర్మన్ రమేష్ నాయుడు విలేఖర్లతో మాట్లాడుతూ విజయడైరి నుండి తప్పించి రాజేష్ కార్పోరేషన్‌కి ఎలాంటి అనుభవం లేకపోయిన విష్ణు దగ్గర నుండి నెయ్యి తీసుకోని బోలేబాబా నుండి సరఫరా చేయించడం జరిగిందని చెప్పారు.కల్తి నెయ్యిని సరఫరా చెయించడం వెనుక ఆనాడు జగన్‌మొహన్‌రెడ్డి మంత్రివర్గంలో ఉన్న ఒక మంత్రి,ఎమ్మెల్య్,రాష్ట్రాస్థాయి అధికారి హస్తం ఉందని ఆరోపించారు.మే 2023 నుండి మార్చి 2024 వరకు జరిగిన కల్తి నెయ్యిపై విచారణ జరపాలని కొరారు.వైసిపి హాయంలో జరిగిన కల్తి నెయ్యి వ్యవహారంపై రాష్ట్ర స్థాయిలో ఒక సిట్‌లాంటి కమిటి ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ని డిమాండు చేయడం జరుగుతుందని చెప్పారు.వైస్ జగన్‌మొహన్‌రెడ్డి ఎన్నడు కూడా హిందూ ధర్మంను పాటించలేదని,తిరుమలకు పట్టు వస్త్రాల సమర్పణకు ఎనాడు కూడా సతీసమేతం >>2

20 లక్షల ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు

# 200 యూనిట్లు ఉచిత విద్యుత్



100 శాతం సబ్సిడీతో పిఎం సూర్యఘర్

ఆక్వా రైతులకు రూ.1.50కే విద్యుత్ సరఫరా

ఏప్రిల్ 1నుంచి చేనేత, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్: మంత్రి గొట్టిపాటి

**విజయవాడ,ఫిబ్రవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభంగా ఇంధన రంగం ఉందని ఆ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఇంధనశాఖమంత్రి మాట్లాడుతూ దేశంలో విద్యుత్ సంస్కరణలకు నాంది పలికిన వ్యక్తి సీఎం చంద్రబాబు అని, విద్యుత్ సంస్కరణలతోనే హైదరాబాద్ లో ఐటీ రంగం అభివృద్ధి చెందిందన్నారు. 2014-19లో అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా నిలిపామని తెలిపారు. 2014-19లోనే రెన్యుబుల్ ఎనర్జీని 7 గిగావాట్లకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుదేన్నారు.2019- 24 మధ్య కాలంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థను సర్వనాశనం చేసిందని, 9సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.30 వేల కోట్లు భారం వేశారన్నారు. రెన్యుబుల్ ఎనర్జీ పెట్టుబడిదారులను రాష్ట్రం నుంచి వైసీపీ ప్రభుత్వం తరిమి కొట్టిందన్నారు.అప్పుల్లో కూరుకుపోయిన విద్యుత్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోంది అన్నారు.దేశంలో తొలిసారి 13 పైసలు ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది అన్నారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్‌ఎనర్జీ పాలసీ ద్వారా 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పని చేస్తున్నామని,.వ్యవసాయ, అనుబంధ రంగాలకు రోజుకు 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. అన్నీ వర్గాల వినియోగదారులకు 24 గంటల నిరంతరాయ విద్యుత్ అందిస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఈ బడ్జెట్‌లో 13 వేల కోట్లు సబ్సిడీకి కేటాయించామన్నారు. విద్యుత్ సబ్సిడీ ద్వారా 22 లక్షల మంది >>2




## లా సెట్ నోటిఫికేషన్ విడుదల

మార్చి 12లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

**తిరుపతి,పిబ్రవరి 20ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం- 2026 లాసెట్, పిజిలాసెట్ ప్రవేశపరీక్షలను నిర్వహిస్తుంది. ఇందుకు మూడు సంవత్సరాల ,ఐదు సంవత్సరాల ఎల్.ఎల్.బి. ఎల్.ఎల్.ఎం. కోర్సుల్లో ప్రవేశాల పరీక్ష ఆన్లైన్ దరఖాస్తుల వివరాలు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభమైందని, ఆలస్య రుసుము లేకుండా మార్చి 12వతేదీ లోపు >>2



# బిడ్డకు తల్లే సర్వస్వం..

## తండ్రి పేరు అక్కర్లేదు: బాంబే హైకోర్టు చరిత్రాత్మక తీర్పు

**ముంబై, ఫిబ్రవరి 20:** సమాజంలో పాతుకుపోయిన పితృస్వామ్య విధానాలకు చరమగీతం పాడుతూ బాంబే హైకోర్టుకు చెందిన ఔరంగాబాద్ బెంచ్ ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. బిడ్డ గుర్తింపునకు తండ్రి పేరు తప్పనిసరి కాదని, తల్లి పేరు, కులంతోనే అన్ని హక్కులు వర్తిస్తాయని స్పష్టం చేసింది. అత్యాచారం వల్ల జన్మించిన 12 ఏళ్ల బాలిక స్కూల్ రికార్డుల నుంచి ఆమె తండ్రి పేరును పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన ఒక మహిళ తన 12 ఏళ్ల కుమార్తె తరఫున హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై జరిగిన అత్యాచారం వల్లే పాప జన్మించిందని,ఆ తర్వాత నిందితుడు 2022లో జరిగిన ఒక సెటిల్మెంట్‌లో బిడ్డతో తనకు ఎలాంటి సంబంధం లేదని రాసిచ్చాడని ఆమె పేర్కొన్నారు.

అయినప్పటికీ, స్కూల్ రికార్డుల్లో తండ్రి పేరు, ఆయన కులం (మరాఠా) ఉండటం వల్ల తన కుమార్తె సామాజికంగా ఇబ్బందులు పడుతోం దని తెలిపారు. తన కుమార్తెకు తన కులమైన 'మహర్' (ఎస్సీ)ని వర్తింపజేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఒంటరి తల్లిని బిడ్డకు పూర్తిస్థాయి సంరక్షకురాలిగా గుర్తించడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అది దయతో చేసే పని కాదని స్పష్టం చేసింది. బాధ్యతలేని తండ్రి కులాన్ని బిడ్డ మోయాల్సిన అవసరం లేదని, తల్లి సామాజిక హోదానే బిడ్డకు వర్తిస్తుందని తేల్చిచెప్పింది. స్కూల్ నిబంధనల పేరుతో ఈ మార్పులు చేయలేమని విద్యాశాఖ అధికారులు చెప్పడాన్ని కోర్టు తోసి పుచ్చింది. గతంలో సుప్రీంకోర్టు కూడా పాస్ పోర్ట్, జనన ధ్రువీకరణ పత్రాల విషయంలో తండ్రి పేరు లేకుండా తల్లి అనుమతితోనే జారీ చేయవచ్చని తీర్పు ఇచ్చింది. ఇప్పుడు బాంబే హైకోర్టు కులం విషయంలోనూ స్పష్టతనివ్వడం దేశవ్యాప్తంగా ఉన్న ఒంటరి తల్లులకు గొప్ప ఊరటనిచ్చింది.



శుక్రవారం హిందూపురంలో ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న బాలయ్య దంపతులు

# భవిష్యత్తు అమరావతి క్వాంటందే

>> పాల్గొన్నారు. డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకు వెళ్లడంపై ఏపీ దృష్టి సారిస్తోందని ఈ సందర్భంగా చంద్రబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ పార్క్ లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని వివరించారు. ఈ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించేలా క్వాంటం ఎకోసిస్టంను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో క్వాంటం ఏఐ నైపుణ్యాభివృద్ధి, మౌలిక వసతుల అభివృద్ధి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంస్థలతో 7 ఒప్పందాలు చేసుకుంది. క్వాంటం, ఏఐలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు యుఎన్ఐసీసీతో ఒక ఎమ్ఓయు కుదుర్చుకుంది. క్వాంటం, ఏఐ, సైబర్ సెక్యూరిటీలో లక్ష మంది యువతకు శిక్షణ ఇచ్చేలా ఐబిఎంతో మరో ఎమ్ఓయు చేసుకుంది. ఏపీలో క్వాంటం ఏఐ వర్సిటీ ఏర్పాటుపై ఎన్ఐఇఎల్ఐటీ తో ఒకటి, రాష్ట్ర స్థాయి ఏఐ టెక్ హబ్ 5 లేయర్డ్ స్వదేశీ ఏఐ స్టాక్ నిర్మించేలా మరొక ఒప్పందం చేసుకుంది. ఏపీలోని 50 ఉన్నత విద్యా సంస్థల్లో ఏఐ, క్వాంటం టెక్నాలజీని బలోపేతం చేసేలా భారత్ జెన్‌నెక్స్ జెన్ఐబీఎంలతో మరో ఒప్పందం కుదుర్చుకుంది. ఏఐ అకాడమీ, ఏఐ శాండ్ బాక్స్ ఏర్పాటుకు కాలిబో ఏఐ సంస్థ కూడా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అమరావతి క్వాంటం వ్యాలీలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు వైజర్ సంస్థ మరో ఎంవోయు చేసుకుంది. ఏపీలో ఏఐ ట్యూటర్ ఏర్పాటుకు ఐఐటీ మద్రాస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఇంకో ఎవోయుకుదుర్చుకుంది.

ఏపీలోని 50 ఉన్నత విద్యా సంస్థల్లో ఏఐ, క్వాంటం టెక్నాలజీని బలోపేతం చేసేలా భారత్ జెన్‌నెక్స్ జెన్ఐబీఎంలతో మరో ఒప్పందం కుదుర్చుకుంది. ఏఐ అకాడమీ, ఏఐ శాండ్ బాక్స్ ఏర్పాటుకు కాలిబో ఏఐ సంస్థ కూడా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అమరావతి క్వాంటం వ్యాలీలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు వైజర్ సంస్థ మరో ఎంవోయు చేసుకుంది. ఏపీలో ఏఐ ట్యూటర్ ఏర్పాటుకు ఐఐటీ మద్రాస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఇంకో ఎంవోయూ కుదుర్చుకుంది.


# నా కేర్ ఆఫ్ హిందూపురమే..

## బాలయ్య సొంతింటి నిర్మాణానికి భూమి పూజ

**హిందూపురం ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** పుట్టింది చెన్నైలో.. పెరిగింది హైదరాబాదులో.. నేను సొంతంగా ఇల్లు కట్టుకుంటున్నది హిందూపురంలోనే.. నా కేర్ ఆఫ్ అడ్రస్ ఇక్కడే అని స్థానిక శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో శుక్రవారం ఉదయం 10:42 నిమిషాలకు బాలయ్య, వసుంధర దేవి దంపతులు సొంత ఇంటి నిర్మాణానికి వేద మంత్రోచ్చారణల మధ్య భూమి పూజ చేశారు. హిందూపురం శివారు ప్రాంతంలో పెనుకొండకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన కొట్నూరు చెరువు కట్ట ఎదురుగా ఆహ్లాదకరమైన వాతావరణంలో సర్వే నంబర్ 445లో 81 సెంట్ల జాగా నందు ఇంటి నిర్మాణం ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తన తండ్రి నందమూరి తారక రామారావును ఇక్కడి నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రిగా గెలిపించిన ప్రజలు తనను కూడా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించాలని కృతజ్ఞతలు చెప్పారు. ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శరవేగంగా పనులు చేపడుతున్నామన్నారు. అభివృద్ధికి సహకరించిన టీడీపీ నాయకులు, మీడియాకు ప్రత్యేకంగా చెప్పారు. ఇందు గలడు అందు గలడు ఎందెందు వెతికినా అందందే గలడు అన్నట్టుగా.. తాను ఇక్కడ ఎమ్మెల్యేగా.. హైదరాబాద్ క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ గా.. సినీ హీరోగా ఉన్నానని చెప్పారు. విశాలమైన ఇల్లు తన కోసమే కాకుండా ఇక్కడికి వచ్చే కార్యకర్తలకు కూడా ఉపయోగపడేలా నిర్మాణం ఉంటుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో తానుంటున్న ఇల్లు నాన్న ఎన్టీఆర్ కట్టించింది అని చెప్పారు. తాను సొంతంగా ఇల్లు కట్టుకుంటున్నది హిందూపురంలోనే అని సంతోషంగా ఉందన్నారు. కాగా ధర్మవరం ఆర్ అండ్ బిడివిజన్ నుంచి హిందూపురం కేంద్రంగా ఆ శాఖ డివిజన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవోజారీ చేసిందని వెల్లడించారు. డివిజన్ కేంద్రం ఇక్కడ రావడానికి తనతోపాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కృషి చేశారని చెప్పారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీ పర్యవేక్షించారు. అనంతరం నాయకులు, ప్రజాప్రతి నిధులు, అధికారులు బాలయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుం డుమల తిప్పేస్వామి, ఎంపీ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున దంపతులు, డీఎస్పీ మహేష్ దంపతులు, నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# ప్రేమిస్తే..చంపేస్తారా!

>> నిర్ణయించింది. అయితే అక్కడి విద్యార్థులకు కావలసిన కట్టుదిట్టమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో అమ్మాయి అబ్బాయి తిరిగి కలిసినట్లు తెలుస్తోందన్నారు. దీంతో విషయం వివాదంగా మారింది. గత వారంలో అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులు కళాశాల వద్దకు వచ్చి అబ్బాయిని మాధవి నగర్ శకుంతల కళ్యాణమండపం ప్రాంతంలోని ఒక కార్యాలయానికి తీసుకెళ్లి దారుణంగా హింసించారు. అంతేగాక గాయపడిన అబ్బాయితో అతని తండ్రికి ఫోన్ చేయించి కర్నూలుకు పిలిపించారు. తన ముందే ఆ అబ్బాయిని మరింత దారుణంగా హింసించారని బాధిత తండ్రి కన్నీరు మున్నీరవుతూ చెబుతున్నారు. అంతటితో ఆగక ఇకపై కర్నూలులో కనిపిస్తే చంపేస్తామంటూ హెచ్చరించారు. దీంతో హుస్సేన్ ను తీసుకొని ఆయన తండ్రి స్వగ్రామమైన మంచాలకట్టకు వెళ్లిపోయారు. అయినప్పటికీ అమ్మాయి తల్లిదండ్రులు అతనిపై నిఘా పెట్టారు. హుస్సేన్ మిత్రుల ద్వారా అతన్ని కర్నూలుకు వచ్చేలాగా చేశారు. తమ కుమారుడి స్నేహితుల పాత్ర ఇందులో ఉందని బాధితులు చెప్తున్నారు. దాంతో బుధవారం తల్లిదండ్రులకు చెప్పకుండా హుస్సేన్ కర్నూలుకు వచ్చాడు. గురువారం ఉదయం కర్నూలు నగర శివారులో రైల్వే ట్రాక్ పై అతని మృతదేహం కనిపించింది. రైల్వే పోలీసుల సమాచారంతో బాధిత కుటుంబ సభ్యులు కర్నూలుకు చేరుకున్నారు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసి.. ఫలానా ఫలానా వ్యక్తులు తమ కుమారుని తన ముందే కొట్టారని... మరియు చంపేస్తామని హెచ్చరించారని.. ప్రస్తుతం వారే తమ కుమారుని చంపేశారంటూ ఫిర్యాదులో వివరించారు. అంతేకాక కళాశాలపై నమ్మకంతో తమ కుమారుని కళాశాలలో చేర్పితే... సరైన క్రమశిక్షణ చర్యలు తీసుకోకపోవడమే కాక.. తమ కుమారుడిని అమ్మాయి తల్లిదండ్రులు తీసుకెళ్లి హింసించినప్పటికీ వారికి తెలియనట్లు ఉండి పోయారన్నారు. విషయం తెలిసిన తర్వాత తమ విద్యార్థి పై దాడి చేశారంటూ పోలీసులకు సమాచారం ఇవ్వలేదన్నారు. అప్పుడే వారు పోలీసులకు ఫిర్యాదు చేసి ఉంటే...పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదంటున్నారు. కావున తమ కుమారుడు మృతిలో కళాశాల పాత్రను కూడా విచారించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఆ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



రైల్వే ట్రాక్‌పై హుస్సేన్ పీరా మృతదేహం

## టీవి సౌండ్ తగ్గించమంటే.. భర్తను చంపిన భార్య

**గుంటూరు ఫిబ్రవరి 20, ప్రభాతవార్త ప్రతినిధి :** ఓ భార్య క్షణికావేశానికి కట్టుకున్న భర్త బలైపోయాడు. టీవీ సౌండ్ తగ్గించు అన్నందుకు భర్తను ఏకంగా పొడిచి చంపేసింది. ఈ ఘటన గుంటూరు జిల్లా మంగళగిరిలో కలకలం రేపింది. మంగళగిరికి చెందిన క్రాంతికి ఏసీ మెకానిక్‌గా పనిచేసే అహ్మద్‌తో కొంత కాలంగా పరిచయం ఉంది. ఈ పరిచయం కాస్తా ప్రేమగా మారి ఎనిమిది నెలల క్రితమే పెళ్లి చేసుకున్నారు. మంగళగిరి టిడ్కో అపార్ట్‌మెంట్స్‌లో అద్దెకు ఉంటూ జీవనం సాగిస్తున్నారు. రంజాన్ మాసం కావడంతో అహ్మద్ ఉపవాసం ఉంటున్నాడు. ఇంటికి వచ్చిన అహ్మద్‌కు, ఇంట్లో టీవీ సౌండ్ భారీగా వినిపించింది. ఉపవాసంలో ఉన్న తనకు ఆ శబ్దం ఇబ్బందిగా అనిపించడంతో టీవీ వాల్యూమ్ తగ్గించాలని క్రాంతిని కోరాడు. కానీ ఈ చిన్న విషయంపై క్రాంతి అహ్మద్‌తో గొడవకు దిగింది. ఆగ్రహంతో ఊగిపోయిన క్రాంతి కత్తి తీసుకువచ్చి అహ్మద్ ను పొడిచింది. తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిన అహ్మద్‌ను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ మృత్యువుతో పోరాడుతూ అహ్మద్ కన్నుమూశాడు. కన్నకొడుకును కోల్పోయిన అహ్మద్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితురాలు క్రాంతిని పోలీసులుఅదుపులోకితీసుకుని విచారిస్తున్నారు.

# కల్తీ నెయ్యిపై రగడ..రగడ

>> ఛైర్మన్ పోడియం వద్దకు వెళ్లి.. దేవుడిని అవమానించిన వైసీపీ సభ్యులు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేవదేవుడిని వైసీపీ సభ్యులు అవమానించారంటూ కూటమి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. దేవుడిని తాము అవమానించలేదంటూ వైసీపీ ఎమ్మెల్సీలు పోడియం వద్దకు వచ్చారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. వెంటనే మండలి సమావేశాన్ని ఛైర్మన్ సోమవారానికి వాయిదా వేశారు. మండలి సమావేశాలు వాయిదా వేసిన తరువాత కూటమి సభ్యులు మండలి ఛైర్మన్‌కు కలిసి దేవుడిని అవమానించిన అంశంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ సభ్యులను పిలిచి మాట్లాడతానని ఛైర్మన్ తెలిపారు. అయితే బహిరంగంగా క్షమాపణలు చెప్పించి, లెంపలేసుకునేలా చర్యలు తీసుకోవాలని కూటమి సభ్యులు డిమాండ్ చేశారు. నిరసనలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, సవిత, గొట్టిపాటి రవి, స్వామి, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర తదతరులు పాల్గొన్నారు. ఈసారి మండలి సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి గందరగోళ వాతావరణం కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా గత మూడు రోజులుగా పరిస్థితి మరింతగా దిగజారింది. కూటమి, ప్రతిపక్ష సభ్యుల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. పదేపదే సభను వాయిదా వేసినప్పటికీ పరిస్థితి అదుపులోకి రావడం లేదు. ఇరువర్గాలు పోడియంను చుట్టుముట్టి ఆరోపణలు చేయడంతోనే సరిపోతోంది. గతంలో హుందాగా జరిగిన మండలి సమావేశాలు గందరగోళవాతావరణంలో కొనసాగడం సరికాదని చంద్రాబాబునాయుడు. లోకేష్‌లు వ్యాఖ్యానించారు.

## మన చరిత్ర, సంస్కృతికి చిహ్నంగా అమరావతి స్టేట్ సెంట్రల్ లైబ్రరీ

### ప్రపంచస్థాయి ప్రమాణాలతో జ్ఞాన కేంద్రంగా సెంట్రల్ లైబ్రరీని తీర్చిదిద్దాలి

### విద్యాశాఖపై సమీక్షలో మంత్రి నారా లోకేష్ ఆదేశం



శుక్రవారం సెంట్రల్ లైబ్రరీ నమూనాను పరిశీలిస్తున్న మంత్రి లోకేష్

**విజయవాడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజా రాజధాని అమరావతిలో నిర్మించబోయే స్టేట్ సెంట్రల్ లైబ్రరీ ఆంధప్రదేశ్ చరిత్ర, సంస్కృతికి చిహ్నంగా ఉండాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అమరావతిలో త్వరలో నిర్మించబోయే స్టేట్ సెంట్రల్ లైబ్రరీ భవన నమూనాను మంత్రి పరిశీలించారు. సెంట్రల్ లైబ్రరీకి సంబంధించి నిపుణులు రూపొందించిన వీడియోను వీక్షి ంచారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి ప్రమాణాలతో, ఆధునిక సాంకేతిక వసతులతో జ్ఞాన కేంద్రంగా సెంట్రల్ లైబ్రరీని తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మన ఘన చరిత్ర, వారసత్వానికి చిహ్నంగా నిలవాలి. ప్రజల ఆశయాలు, ఆకాంక్షలను ప్రతిబింబించేలా సెంట్రల్ లైబ్రరీ ఉండాలి. ఆర్కైవ్స్, ఆడిటోరియం వసతులతో పాటు 15 లక్షలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలి. జ్ఞానకేంద్రంగానే కాకుండా విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదపడాలి. అన్నివర్గాల ప్రజలు సెంట్రల్ లైబ్రరీతో అనుసంధానం కావాలి. ఇందుకు సంబంధించి మొత్తం ఎకోసిస్టమ్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పదో తరగతి పరీక్షలు, అభ్యసన సామర్థ్యాల పెంపుపై చర్చ ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ అమలుతీరు, క్లిక్కర్ వీడియోలు, పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికపైనా సమావేశంలో చర్చించారు. విద్యార్థుల హాజరు, మార్కులు వంటివి తెలుసుకునేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన లీప్ (ఎల్ఇఎపి) యాప్ ను ఎంత మంది తల్లిదండ్రులు డౌన్ లోడ్ చేసుకున్నారో మంత్రి ఆరా తీశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ టూటర్ వినియోగం, నిడమర్రు పాఠశాల అభివృద్ధి పనులతో పాటు పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం, డీఎస్సీ వంటి అంశాలపైనా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ వి.విజయరామరాజు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపిఎస్ ఆర్టీసీ ఎండిగా బాల సుబ్రహ్మణ్యం బాధ్యతలు

**సచివాలయం,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** సంస్థ వైస్ ఛైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎన్.బాల సుబ్రహ్మణ్యం ఐపిఎస్ శుక్రవారం ఆర్టీసీ ప్రధాన కార్యాలయం,ఆర్టీసీ హౌస్‌లోని ఆయన చాంబర్‌లో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రయాణీకుల భద్రత,సమయపాలన, పరిశుభ్రత,సేవల మెరుగుదలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామన్నారు.

ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధికి అధికారులు, ఉద్యోగులందరూ క్రమశిక్షణతో అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు.

# శ్రీశైలంలోను కల్తీ నెయ్యి!

>> గా రాలేదని అన్నారు.ఒంటరిగానే వచ్చి తిరుమల పట్టు వస్త్రాలను సమర్పిచారని అన్నారు. శ్రీశైలంకు ఎనాడు రాలేదని,మీ ప్రభుత్వ హయంలో విగ్రహాలను ధ్వంసం చేయడం,రథాలను తగలబెట్టడం వంటి కార్యక్రమాలు చేసారని అన్నారు.ఈ కల్తి నెయ్యి ఇతర పుణ్యక్షేత్రాలకు కూడా సరఫరా చేసిఉంటారని అనుమానం వ్యక్తం చేసారని అన్నారు.శ్రీశైలంలో 9వ తేది నాడు జరిగిన సంఘటనపై అవాస్తవాలను ఊదరగొట్టారని తెలిపారు.హిందూ దేవాలయాల గురించి,హిందు ధర్మం గురించి పాటించని వ్యక్తివి మీరు కూడా దేవాలయాల గురించి మాట్లాడటం హాస్యస్పదంగా ఉందని అన్నారు.శ్రీశైలంలోశివస్వాములందరికి మంచి దర్శనం కల్పించామని తెలిపారు.శ్రీశైలంలో కుట్రకోణంగా జరిగినా సంఘటనపై కూడా ఒకహైలేవెల్ కమిటిని ఏర్పాటు చేసి విచారణ జరపాలని కోరారు.

## రిటైర్డ్ ఐఎఎస్ అధికారి దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీ

>> మరింత సమగ్రంగా 45రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా జరిగిన కేసులో ఇప్పుడు ఏం వెలుగుచూడనుందనేది మాత్రం సంచలనమే. 2019-24 మధ్యకాలంలో తిరుమలకు లడ్డూలకు కల్తీనెయ్యిసరఫరా జరిగిన కేసులో ఇదివరకే సుప్రీంకోర్టు కలుగజేసుకుని నిపుణులతో సిట్ పేరుతో కమిటీని నియమించింది. ఈ కమిటీ అధికారులు క్షేత్రస్థాయిలో అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేపట్టి కీలక విషయాలను నివేదికగా ప్రభుత్వానికి అందజేశారు. పాత్రధారులను తేల్చిన సిట్ అసలు సూత్రధారుల జోలికెళ్ళకపోవడంతో దీనిపై లోతుగా అధ్యయనం చేసి ఎవరి పాత్ర ఎంత అనేది తేల్చాలనేది ప్రభుత్వం నిర్ణయం. కల్తీనెయ్యి బాగోతంలో టెండర్ నిబంధనలు మార్చి వారికి అనుకూలంగా తయారుచేసుకోవడం, ఆపై కల్తీనెయ్యిగా గుర్తించినా రద్దుచేయకపోవడం వంటివి ఇప్పుడు కీలకంగా ఏకసభ్యకమిటీ దర్యాప్తు సాగనుంది. కల్తీ వ్యవహారంలో కర్త,కర్మ,క్రియ ఎవరున్నారనేది తేల్చాలనే దృఢనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. ఈ ఏకపక్ష కమిటీ దర్యాప్తు చేపడితే ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయనేది కూడా అందరిలోనూ ఆందోళనకలిగిస్తోంది. విశ్రాంత ఐఎఎస్ అదికారి దినేశ్‌కుమార్ సమర్ధవంతమైన పాలన అదికారిగా పేరుంది. ఆయన నాయకత్వంలో కల్తీనెయ్యి వ్యవహారంలో లడ్డూల తయారీకి 60లక్షల కిలోల కెమికల్స్ వాడారని సిట్ వెలుగులోకి తెచ్చిన నివేదికపై కీలకంగా విచారణ చేయన్నారు.

# గ్లోబల్ హెల్త్‌కేర్ డెస్టినేషన్‌గా ఇండియా

## అపోలో యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి

**చిత్తూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవల కేంద్రంగా ఇండియాను తీర్చిదిద్దడమే లక్ష్యంగా అపోలో సంస్థ ముందడుగు వేస్తున్నదని అపోలో గ్రూప్ సంస్థల ఛైర్మన్, అపోలో యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి అన్నారు. అపోలో నాలెడ్జ్ సిటీ క్యాంపస్‌లో శుక్రవారం అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే-2026 వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి బాధ్యతతో కూడుకున్నదని, రోగుల పట్ల కరుణ, నిబద్ధతతో సేవలందించాలంటూ యువ వైద్యులకు సూచించారు. అపోలో నుండి ప్రతి ఏడాది పెద్ద సంఖ్యలో నైపుణ్యవంతులైన వైద్యులు బయటకు రావడం గర్వకారణమన్నారు. అపోలో హాస్పిటల్స్‌ను ప్రపంచ స్థాయి వైద్య సంస్థగా తీర్చిదిద్దడానికి నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. దేశంలో మొదటి సిటీ స్కానర్‌ను అపోలోలోనే ఏర్పాటు చేశామని, ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 2 వేలకు పైగా సిటీ స్కానర్లు అపోలో హాస్పిటల్స్‌లో పని చేస్తున్నాయన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానంను దేశంలో ప్రవేశపెట్టడంలో అపోలో ముందంజలో వుందన్నారు. హీల్ ఇన్ ఇండియా, హీల్ ద వరల్డ్, హీల్ బై ఇండియా అనే నినాదాలతో ఇండియాను గ్లోబల్ హెల్త్‌కేర్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తున్నామన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పులాల చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజారోగ్య సవాళ్ళను ఎదుర్కోవడంలో యువవైద్యులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఈ వేడుకల్లో 16 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు, 166 మంది ఇంటర్న్లు పట్టాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్ట్ గ్రాడ్యుయేట్‌లకు పట్టాలు అందజేస్తున్న ప్రతాప్ సి.రెడ్డి.

## లా సెట్ నోటిఫికేషన్ విడుదల

>> దరఖాస్తుచేసుకోవాలని వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ,కన్వీనర్ ఆచార్య సీతాకుమారి తెలిపారు. వెయ్యి రూపాయలు ఆలస్య రుసుముతో మార్చి 16వరకు, 2వేల రూపాయలు రుసుంతో మార్చి 20వరకు, 4వేల రూపాయలు అపరాద రుసుంతో మార్చి 24వరకు, 10వేల అపరాదరుసుంతో మార్చి 28వతేదీ లోపు దరఖాస్తుచేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు సవరణకు మార్చి 30 వరకు అవకాశం ఉంది. దరఖాస్తులు అనంతరం హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌ను ఏప్రిల్ 20వతేదీ నుండి పొందవచ్చన్నారు. మే 4వతేదీ సోమవారం ప్రవేశపరీక్ష ఉంటుంది.ప్రాథమిక కీ మే 7న విడుదల చేస్తారు. లాసెట్ కోసం ఓసి అభ్యర్థులు 900రూపాయలు, బిసి 850, ఎస్సీ,ఎస్టీ 800 రూపాయలు, ఫీజుగా నిర్ణయించారు. పిజిలాసెట్‌కు ఓసి అభ్యర్థులు వెయ్యిరూపాయలు, బిసి 950, ఎస్సీ,ఎస్టీ 900 రూపాయలు చెల్లించాలి. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సెట్ కన్వీనర్ తెలిపారు. అర్హత ప్రమాణాలు, సిలబస్, పరీక్ష విధానం ,ఇతర వివరాలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని అధికారిక నోటిఫికేషన్‌లో పరిశీలించాలి. పూర్తివివరాలకు హెల్ప్‌డెస్క్ ఎపిలాసెట్అట్‌దిరేట్ ఎపిఎస్‌హెచ్ఇ.ఒఆర్‌జి మెయిల్ సందర్శించాలి.

# డిజిపి, డిఎస్పీలు ఏం చేస్తున్నారు?

>> విచారిస్తూ నాటి దర్యాప్తులో పోలీసుల వైఖరిని ఎండగట్టింది. 'నిందితుడితో పోలీసులు ఇప్పటికీ చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఇంత దారుణంగా వ్యవస్థలు నిర్వీర్యం అవుతుంటే డీజీపీ, ఎస్పీలు ఏం చేస్తున్నారు?' అని ధర్మాసనం నిలదీసింది. వైసీపీ ఎమ్మెల్సీకి బెయిల్ వచ్చేలా ఉద్దేశపూర్వకంగానే ఛార్జిషీట్ దాఖలు చేయడంలో జాప్యం చేశారని, నిందితుడితో పోలీసులు కుమ్మక్కు అయ్యారని ఇది స్పష్టం చేస్తోందని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీకు దర్యాప్తు చేయడం చేతకాకపోతే చెప్పండి.. కేసును సీబీఐకి అప్పగిస్తాం' అని ఘాటుగా హెచ్చరించింది.

**ప్రస్తుత ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం:** గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వంపైనా కోర్టు ప్రశ్నలు సంధించింది. తప్పు చేసిన పోలీసు అధికారులపై ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదు? బాధ్యులైన వారిని ఎందుకు వదిలేశారు? అని నిలదీసింది.నవంబర్ 18లోపు ట్రయల్ కోర్టు విచారణను పూర్తి చేయాలని, కేసు విచారణ కోసం మార్చి 31 లోగా హైకోర్టు ఒక సీనియర్ జ్యుడిషియల్ అధికారిని ప్రత్యేకంగా నియమించాలని, జాప్యానికి తావులేకుండా రోజువారీ ప్రాతిపదికన విచారణ సాగాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసులో హైకోర్టు జోక్యం చేసుకుని అడ్డంకులు సృష్టించవద్దని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

# ట్రంప్‌కు షాక్!

>> వినియోగదారులు, వ్యాపారాలకు ఖర్చులను పెంచిందని వ్యాఖ్యానించింది. ట్రంప్ వివాదాస్పద నిర్ణయానికి వ్యతిరేకంగా ఆ దేశ సుప్రీంకోర్టు ఇచ్చిన మొదటి తీర్పు ఇదే. గతేడాది ఏప్రిల్ 1న లిబరేషన్ డే పేరుతో ట్రంప్ పరస్పర సుంకాలను ప్రకటించి వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. ధర్మాసనంలో మొత్తం 9 మంది న్యాయమూర్తుల్లో ఆరుగురు ట్రంప్ సుంకాలను వ్యతిరేకించగా ముగ్గురు మాత్రమే సమర్థించారు. ఈ తీర్పును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ రాశారు. ఆయనతో పాటు ముగ్గురు లిబరల్ న్యాయమూర్తులు, సంప్రదాయవాదులైన నీల్ గోర్సుచ్,అమీ కోనీ బారెట్ కూడా ట్రంప్ సుంకాలను వ్యతిరేకించారు. ఏకపక్షంగా సుంకాలను విధించే అసాధారణ అధికారాన్ని అధ్యక్షుడు నొక్కి చెబుతున్నారు అని జస్టిస్ రాబర్ట్స్ పేర్కొన్నారు. ట్రంప్ యంత్రాంగం ఏ చట్టాన్ని సూచించలేదని, కాంగ్రెస్ గతంలో ఐఈఈపిఎ చట్టం సుంకాలకు వర్తింపజేయవచ్చని చెప్పిందని ఆయన అన్నారు. ఇంత వరకూ వివిధ దేశాల నుంచి వసూలు చేసిన సుంకాలను తిరిగి చెల్లించాలని తేల్చిచెప్పింది. భారత్‌పై కూడా ట్రంప్ 18 శాతం సుంకాలను విధించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అనుమతి లేకుండానే ట్రంప్ ప్రధాన విధానపరమైన చర్యలు తీసుకోవడానికి అనుమతించిందని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేసింది.

**నాదగ్గర ప్లాన్ బి ఉంది...ఇది ఎంతో అవమానకరం...ట్రంప్..!**

సుంకాల ఉత్తర్వులను రద్దుచేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసిన తన వద్ద ప్లాన్ బి ఉందని వ్యాఖ్యానించారు. గవర్నర్లతో జరిగిన ప్రైవేట్ సమావేశంలో సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయం అవమానకరం అని అభివర్ణించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సుంకాలపై సుప్రీంకోర్టు నిర్ణయం వెలువడిన సమయంలో ట్రంప్ రెండు పార్టీలకు చెందిన దాదాపు 24 రాష్ట్రాల గవర్నర్లతో ప్రైవేట్‌గా సమావేశమయ్యారు. తీర్పుపై తక్షణమే వైట్‌హౌస్ స్పందించలేదు.

# 200 యూనిట్లు ఉచిత విద్యుత్

>> రైతులు ఉచిత విద్యుత్, ఆక్వా రైతుల సంక్షేమం కోసం కేవలం రూ. 1.50 కే యూనిట్ విద్యుత్ అందిస్తున్నాని పేర్కొన్నారు. 20 లక్షల ఎస్సీ,ఎస్టీ వినియోగదా రులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నాం అన్నారు. చేనేత, దోభీ, సెలూన్లకు కూటమి ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీని అందిస్తోంది అన్నారు. ఏప్రిల్ 1 నుంచి హ్యాండ్లూమ్ 200 యూనిట్లు, పవర్ లూమ్ కి 500 యూనిట్లు ఉచితంగా అందిస్తున్నాం అన్నారు విద్యుత్ ఉత్పత్తిలో కూడా రాష్ట్రం 21,457 మెగావాట్ల ఇన్స్టాల్డ్ కెపాసిటీతో ముందంజలో ఉంది అన్నారు ఇటీవల ఏపీజెన్కో రికార్డు స్థాయిలో 6 వేల మెగావాట్ల ఉత్పత్తితో రికార్డు సాధించింది అన్నారు. యూనిట్ కొనుగోలు ధరను రూ.7.71 నుంచి రూ.6.35కు తగ్గించి రూ. 340 కోట్లు ఆదా చేశామని తెలిపారు. ఎస్సీ,ఎస్టీలకు 100 శాతం సబ్సిడీతో పీఎం సూర్యఘర్ అమలు చేస్తున్నామన్నారు.

## వారం - వర్జ్యం

21-02-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
చవితి ప.12.59
రేవతి రా.7.05
వర్జ్యం : మ.2.05-3.36
దు.ఉ.6.31-8.06
శుభసమయం : సా.6.00-7.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ఆత్మీయుల సహకారంతో సమస్యలు కొంతవరకు తీరతాయి. గృహనిర్మాణ యత్నాలలో తొందరపాటు వద్దు.

**వృషభం:** ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. సంఘంలో గౌరవప్రతిష్ఠలు పెరుగుతాయి. ఋణాలు తీరుస్తారు.

**మిథునం:** మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. స్వంత నిర్ణయాలను తీసుకుంటారు. విదేశీయాన ప్రయత్నాలు.

**కర్కాటకం:** విలువైన వస్తువులు తనఖాలు విడిపిస్తారు. ఉద్యోగస్థుల ఉన్నతాధికారుల మెప్పును సాధించగలుగుతారు.

**సింహం:** ప్రజా సంబంధాలు అధికంగా కలిగినటువంటి వ్యాపారస్థులకు ఈ రోజు అనుకూలంగా ఉంది. వస్త్రలాభం.

**కన్య :** అస్తి తగాదాలకు సంబంధించిన వ్యవహారాలలో మధ్యవర్తిత్వం చేయవలసిన బాధ్యత నెత్తిన పడుతుంది.

**తుల :** డాక్యుమెంట్స్ పరంగా జాగ్రత్తలు వహించండి. తల్లి వైపు బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృశ్చికం:** ఒక సందర్భంలో వృత్తి, ఉద్యోగ బాధ్యతల వల్ల ఇతరులకు మీరు ఇచ్చిన వాగ్దానం నిలుపుకోలేరు. వాహనసౌఖ్యం.

**ధనుస్సు:** పెద్దగా కృషి చేయకపోయినా ఓవ్యక్తికి మీ లాభాలలో భాగం ఇస్తారు. స్వజనుల వలన కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటారు.

**మకరం :** ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరానికి డబ్బు ఏదో విధంగా అందుతుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి.

**కుంభం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. అనుకున్న పనులలో విజయం సాధిస్తారు.

**మీనం:** తనఖాలు విడిపిస్తారు. వినూత్న రీతిలో రాజకీయాలు చేసి కొన్ని అంశాలు అనుకూలంగా మార్చుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తిరుమల సమాచారం



## తెప్పోత్సవాలకు పుష్కరిణి సిద్ధం

### - 26 నుండి మలయప్పకు ఉత్సవాలు

### - 23న ప్రయోగాత్మక నిర్వహణ

తిరుమల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల తెప్పోత్సవాలకు స్వామివారి పుష్కరిణిలో తెప్ప సర్వాంగసుందరంగా తయారైంది. ఆలయానికి పక్కనే ఉన్న పవిత్రమైన స్వామివారి పుష్కరిణిలో ఐదురోజులు జరిగే ఈ తెప్పోత్సవాలకు టిటిడి ఏర్పాట్లుచేసింది. 26వ తేదీ నుండి మార్చి 2వరకు ఐదురోజులపాటు ఈ తెప్పోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు 23వ తేదీ సోమవారం సాయంత్రం తెప్ప ట్రయల్‌రన్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం నుండి మార్చి 2వరకు పుష్కరిణిలో స్నానాలు కూడా రద్దుచేశారు. ఈనెల 26 గురువారం నుండి ఈ తెప్పోత్సవాలు ప్రతిరోజూ రాత్రి 7గంటల నుండి 8గంటల వరకు ఆలయ పుష్కరిణిలో వేడుకగా నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో తొలిరోజు 26వతేదీ గురువారం సాయంత్రం సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తిగా తెప్పలపై పుష్కరిణిలో మూడుచుట్లు తిరిగి భక్తులకు అభయమిస్తారు. రెండవరోజు 27వ తేదీ సాయంత్రం రుక్మిణీసమేత శ్రీకృష్ణస్వామి తెప్పపై మూడు ప్రదక్షణలు విహరిస్తారు. మూడవరోజు 28వతేదీ, మార్చి 1, 2, తేదీల్లో స్వామివారు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి పుష్కరిణిలో భక్తులకు అనుగ్రహిస్తారు. చివరిరోజు మార్చి 2వతేదీ ఏడు ప్రదక్షణలు తెప్పపై పుష్కరిణిలో విహరిస్తారు. ఈ సందర్భంగా తొలి రెండురోజులు సహస్ర దీపాలంకారసేవ, ఆ తరువాత మూడురోజులు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దయ్యాయి.



## అంతా మంచి జరగాలని వేడుకున్నాం

తిరుమల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: ఇష్టదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం శుభకరమని, అంతా మంచి జరగాలని ఆకాంక్షించినట్లు పలువురు తెలిపారు. శుక్రవారం ఉదయం స్వామివారి నైవేద్య విరామసమయంలో కర్ణాటక హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఎఎన్ వేణుగోపాలగౌడ, అపోలో ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సిరెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్‌ఠాగూర్, ప్రభుత్వ సలహాదారుడు ఆర్‌పి ఠాగూర్ కుటుంబాలతో వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలోపల వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## టిటిడి పథకాలకు రూ.50 లక్షలు విరాళం



తిరుమల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలకు దాత శుక్రవారం రూ.50 లక్షలు విరాళమిచ్చారు. హైదరాబాద కు చెందిన శివకోటి సిద్ధార్థ ఎస్వీ విద్యాదాన ట్రస్ట్‌కు రూ.50లక్షలు చెక్కును టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

## నకిలీ ఆధార్ కార్డులతో గదుల మోసం...

## ముగ్గురు దళారుల అరెస్ట్



తిరుమల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులకు భక్తులకు తిరుమలలో గదులు దొరకకపోవడాన్ని ఆసరాగా చేసుకొని నకిలీ ఆధార్ కార్డులు ఉపయోగించి గదులు పొందుతున్న ముగ్గురు దళారులను తిరుమల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ గదులను నిర్ణయించిన ధరకంటే అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమంగా డబ్బు ఆర్జిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తిరుమల టు టౌన్ సిఐ రాముడు తెలిపారు. టిటిడి విజిలెన్స్ సిబ్బంది ఫిర్యాదు మేరకు తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాలతో తిరుమల టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. గదులు అధిక ధరకు విక్రయిస్తున్న మహారాష్ట్ర హింగోలి జిల్లాకు చెందిన ప్రసాద్ కేశవరావ్ ఖరోడే (34), కడప జిల్లా బద్వేలుకు చెందిన వందవాసి దినేష్ (27), తెలంగాణ ఖమ్మంకు చెందిన పత్తిపాటి కిశోర్‌కుమార్ (33) పట్టుబడ్డారు. ముద్దాయిలు చెడు వ్యసనాలకు బానిసలై సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆధార్ కార్డులలో ఫోటోలు, నంబర్లను మొబైల్ ఫోన్ ద్వారా మార్ఫింగ్ చేసి నకిలీ ఆధార్ కార్డులు తయారు చేసేవారని సిఐ తెలిపారు. ఆ నకిలీ ఆధార్ కార్డులతో సిఆర్‌ఒ కార్యాలయంలో 50, 100 రూపాయలు గదులు పొంది, ఆ గదులను ఒక్కో గదిని వెయ్యి రూపాయలకు విక్రయించేవారని తెలిపారు. ఇలా ఒకే గదిని రెండు, మూడు సార్లు వేర్వేరు భక్తులకు ఇచ్చి మోసం చేసిన ఘటనలు కూడా వెలుగులోకి వచ్చాయన్నారు. ఇటీవల వీరి మోసపూరిత కార్యకలాపాలపై పక్కా సమాచారంతో పోలీసులు నిఘా ఉంచి, మరిన్ని నకిలీ ఆధార్ కార్డులతో గదులు పొందేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకొని అరెస్టు చేశామన్నారు. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు గదులు పొందుటకు అధికారిక మార్గాలను మాత్రమే అనుసరించాలని, దళారుల మాయలో పడకూడదని తిరుమల పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# బౌద్ధ సర్క్యూట్ అభివృద్ధికి పెద్దపీట

- రాష్ట్ర విభజనకు ముందు ఎపిలో 65 ప్రాంతాల్లో, విభజనానంతరం 3 చోట్ల పురావస్తు శాఖ తవ్వకాలు
- శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో బదులిచ్చిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- తెలంగాణలో ఉన్న ఎపి పురావస్తు సంపద రప్పించేందుకు చర్యలు చేపట్టామని వెల్లడి



విజయవాడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని చారిత్రక వారసత్వాన్ని కాపాడేందుకు, పురావస్తు తవ్వకాలను ముమ్మరం చేయడంతో పాటు బౌద్ధ సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శుక్రవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయం లో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అడిగిన ప్రశ్నలకు మంత్రి కందుల దుర్గేష్ క్లుప్తంగా సమాధాన మిచ్చారు. రాష్ట్ర విభజనకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో 65 ప్రాంతాల్లో, విభజన తర్వాత పురావస్తు శాఖ 3 ప్రధాన ప్రాంతాల్లో ఫీల్డ్ సీజన్ లో పురావస్తు శాఖ తవ్వకాలు జరిపిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. 2014-15, 2015-16లో జరిపిన తవ్వకాల్లో కాకినాడ జిల్లా ఎ.కొత్తపల్లి (పెద్దమెట్ట) బౌద్ధ క్షేత్రంలో మహాస్థూపాలు,8 ఓటివ్ స్థూపాలు (చిన్న స్థూపాలు), విహారాలు(నివాస ప్రాంతాలు), ఎర్రమట్టి పాత్రలు బయటపడ్డాయని.. అలాగే పోలవరం ప్రాజెక్టు పూర్తయితే తవ్వకాలు జరపడం కష్టమని భావించి పోలవరం ముంపు ప్రాంతాలైన రుద్రమకోట, రాయనపేటలలో 2017-18లో తవ్వకాలు జరపగా క్రీ.పూ. 1000-300 నాటి ప్రాచీన మానవుడి సమాధులు (మెగా లిథిక్స్), ఇనుప వస్తువులు, మట్టి పాత్రలు లభ్యమయ్యాయని వివరించారు. తద్వారా ప్రాచీన మానవుడి కాలంనాటి సంస్కృతి, అనుసరించిన విధానాలు గుర్తించామన్నారు. ఈ తవ్వకాలకు ప్రత్యేక బడ్జెట్ అంటూ ఏమీ లేదని పోలవరం ప్రాజెక్టులో భాగంగా పురావస్తు శాఖ ఎక్స్ కవేషన్ బడ్జెట్‌లో నుండి వినియోగించి తవ్వకాలు జరిపామని స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లుగా ఉన్న ఎపి పురావస్తు సంపదను తీసుకురావాలని, రాష్ట్ర విభజనకు ముందు జరిపిన తవ్వకాల నివేదికను రాష్ట్ర ప్రజల ముందుంచాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మంత్రి దుర్గేష్‌ను కోరారు. తెలంగాణలో ఉండిపోయిన ఎపి పురావస్తు సంపదను తిరిగి రప్పించే విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఇప్పటికే ప్రాథమిక చర్చలు జరిగాయని, హైదరాబాద్‌లో ఒకసారి సమావేశం కూడా జరిగినట్లు వివరణనిచ్చారు. త్వరలోనే ఇరు రాష్ట్రాల అధికారుల సమన్వయంతో దీనిని పూర్తి చేస్తామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. కళింగుల రాజధానిగా కీర్తిపొందిన శ్రీకాకుళం జిల్లా దంతపురం, విజయనగరం జిల్లా గుడివాడకొండలలో రాబోయే రోజుల్లో తవ్వకాలు చేపడతామని మంత్రి దుర్గేష్ ప్రకటించారు. పురావస్తు శాఖలో సిబ్బంది కొరతను తీర్చడం, తవ్వకాల్లో దొరికిన అవశేషాలను భద్రపరిచి మ్యూజియాల్లో ప్రదర్శనకు ఉంచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే రంగారావు(బేబీ నాయన) అడిగినట్లుగా చిత్రకోట బౌద్ధక్షేత్రం అంశం తమ పరిగణలో ఉందన్నారు. ఎపిలో బౌద్ధమత వ్యాప్తికి నిలయాలైన అమరావతి, నాగార్జునకొండ, ఘంటసాల, ఆదుర్రు, తొట్లకొండ, బావికొండ, చిత్రకోట వంటి ప్రాంతాలను కలిపి 'బౌద్ధ సర్క్యూట్'గా అభివృద్ధి చేస్తామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు మాట్లాడుతూ తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక అంశాలపై మండలి బుద్ధప్రసాద్‌కు ఉన్న శ్రద్ధను, మంత్రి కందుల దుర్గేష్ ఆసక్తిని అభినందించారు. కేంద్రం నుండి నిధుల సాధన కోసం తామంతా కలిసి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.



## టిటిడిలో మార్చి 9న అంతర్జాతీయ మహిళా దినోత్సవం

తిరుమల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలో మార్చి 9వన నిర్వహించనున్న అంతర్జా తీయ మహిళా దినోత్సవం ఏర్పాట్లపై తిరుపతిలో శుక్రవారం టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఇందుకోసం టిటిడి మహిళా అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీ, స్పీకర్స్ కమిటీ, పర్చేజ్ కమిటీ, కల్చరల్ కమిటీ, ఇన్విటేషన్ కమిటీ, ఫుడ్ కమిటీల విధులు, బాధ్యతలను తెలియజేశారు. వివిధ రంగాల్లో నిపుణులైన వారిని ఉపన్యాసకులుగా ఆహ్వానించాలని సూచించారు. టిటిడి మహిళా ఉద్యోగులకు అందించే పద్మావతి అవార్డులు ఈ ఏడాది మరిన్ని పెంచాలని, ఇందుకోసం నైపుణ్యం, ప్రతిభ ఆధారంగా అర్హులైన అన్ని తరగతుల ఉద్యోగులను ఎంపిక చేయాలని అన్నారు. పద్మావతి అమ్మవారి వేద ఆశీర్వచనంతో మహిళా దినోత్సవాన్ని ప్రారంభించాలని, పద్మావతి వైభవం నృత్య కార్యక్రమంతో ముగించాలని చెప్పారు. ఈ సమీక్షలో సంక్షేమ విభాగం డెప్యూటీ ఇఒ ఆనంద రాజు, మహిళా అధికారులు, మహిళా ఉద్యోగుల సంఘం నాయకులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## వేసవి రద్దీలో డేటా ఆధారిత ప్రణాళికతో భక్తులకు మరింత సౌకర్యాలు

### - టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి



తిరుమల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: రానున్న వేసవి సెలవుల్లో విపరీతంగా ఉండే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కా ప్రణాళికతో సమర్థవంతంగా చేపడుతున్నట్లు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి తెలిపారు. గత రెండు, మూడు సంవత్సరాల వేసవి రద్దీ డేటాను విశ్లేషించి, దర్శనాల సంఖ్య, వేచి ఉండే సమయం, తర్వాత రోజు దర్శనాలకు క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సంఖ్య వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అన్నప్రసాదం, తాగునీటి పంపిణీ, నడక దారి భక్తులకు మార్గమధ్యంలో షెడ్ల ఏర్పాటు, మాడ వీధులు తదితర ప్రాంతాల్లో కూల్ పెయింటింగ్, అవసరమైన చోట్ల షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలోపల సుధర్మ సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు ఇఒ వెంకయ్యచౌదరి అధికారులతో కలసి రానున్న వేసవి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవిసెలవుల్లో తిరుమలలో మజ్జిగ పంపిణీ పాయింట్ల సంఖ్యను పెంచి, వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. వేసవి సెలవుల్లో కుటుంబాలతో కలిసి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే నేపథ్యంలో వసతి సదుపాయాలు, అన్నప్రసాదం నిర్వహణను మరింత సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించారు. నడకదారి భక్తులు, అధిక రద్దీ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను బలోపేతం చేసి మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈసారి ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా టెక్నాలజీ వినియోగాన్ని మరింత వినియోగించుకుని, గంటల వారీగా ఇన్-అవుట్ ఫ్లో, వేచి ఉండే సమయాన్ని ప్రతి నిమిషం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట తక్షణ నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. వివిధ కేటగిరీల దర్శనాలను డేటా ఆధారంగా హేతుబద్ధంగా కంపార్ట్మెంట్లు, క్యూ లైన్లలో భక్తులు వేగంగా దర్శనం పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత వేసవిలో జూన్ నెలలో సగటున రోజుకు 80 వేల నుంచి 82 వేల మందికి దర్శనం కల్పించామని, అలాగే 2026 జనవరిలో రోజుకు సగటున 74 వేల మందికి పైగా దర్శనం కల్పించినట్లు గుర్తు చేశారు. ఇది సమర్థవంతమైన టైమ్ మేనేజ్‌మెంట్, అన్ని విభాగాల సమన్వయంతో సాధ్యమైందని అదనపు ఇఒ వివరించారు.

## ప్రజాస్వామ్య విలువలపై, దైవభక్తిపై ఏమాత్రం గౌరవంలేని పార్టీ వైసిపి

సచివాలయం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: శాసనమండలిలో బలం ఉందని వైసిపి సభ్యులు చేసిన అపచారం, అపవిత్రత హిందూవుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రంగా ఖండించారు. జనసేన పార్టీ తరుపున మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవంగా కొలిచే వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని కాళ్ళకు చెప్పులు వేసుకొని ప్లకార్డులా వాడుతూ సభలోకి తీసుకురావడం చాలా పెద్ద అపచారమని అన్నారు. ఇది వైఎస్ జగన్మోహనరెడ్డి డైరెక్షన్‌తో నడిచిందని స్పష్టంగా కనిపిస్తుందని మంత్రి అన్నారు. హిందువుల మనో భావాలను దెబ్బతీసినందుకు హిందూ జాతికి జగన్మోహనరెడ్డి క్షమాపణ చెప్పాలని జనసేన పార్టీ తరుపున స్పష్టంగా డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకపోతే తగిన బుద్ధి చెబుతారని, దీనిపై ఖచ్చితంగా చర్య తీసుకోవాలని చైర్మన్‌ను కోరుతున్నామని తెలిపారు.



తిరుమల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మార్చి 20వ తేదీ

## మార్చి 20న ఉగాది ఆస్థానం

### - విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

శుక్రవారం తెలుగు నూతన "పరాభవ నామ సంవత్సర" ఉగాది పర్వదిన ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 20వ తేదీ ఆలయంలో విఐపి బ్రేక్ దర్శనాలు టిటిడి రద్దు చేసింది. అలాగే మార్చి 19న విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి సిఫార్సు లేఖలు స్వీకరించబడవు.

### బంగారు వాకిలిలో ఆస్థానం

శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన ఆనంద నిలయానికి ముందు బంగారువాకిలిలో 20వ తేదీ శుక్రవారం తెల్లవారుజామున 3గంటలకు సుప్రభాతం అనంతరం ఆలయ శుద్ధి చేస్తారు. స్వామివారి అభిషేకం సేవ నిర్వహించాక ఆ రోజు ఉదయం 6గంటలకు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి వారికి, విశ్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరుగుతుంది. ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు విమానప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశిస్తారు. ఆ తరువాత వెంకన్న మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు.

ఆ తరువాత పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలివద్ద ఆగమపండితులు, అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి జరిగే ఆర్జితసేవలు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం టిటిడి రద్దు చేసింది.

## మండలిలో వైసిపి సభ్యుల ప్రవర్తన బాధాకరం

### - ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

సచివాలయం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: శాసనమండలిలో జరిగిన సంఘటనలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించేవిగా, హిందూ సమాజాన్ని గాయపరిచేవిగా ఉన్నాయని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలియుగ దైవంగా, ప్రత్యక్ష దైవంగా భావించే వెంకటేశ్వరస్వామి ఫోటోలను ప్లకార్డులా పట్టుకొని, చెప్పులు వేసుకొని సభలోకి వచ్చి అవమానపరిచే రీతిలో ప్రవర్తించిన వైసీపి సభ్యులు తీరు క్షమంచరానిదన్నారు. రాజకీయ ప్రతినిధిగానో, మంత్రిగానో కాకుండా ముందుగా భారత పౌరుడిగా, హిందూ సమాజం నేర్పిన సంస్కృతి సాంప్రదాయాల్లో పుట్టి పెరిగిన వ్యక్తిగా తాను స్పందించానని పయ్యావుల కేశవ్ స్పష్టంచేశారు. కళ్ళముందు వేంకటేశ్వరస్వామి ప్రతిమను లేదా ప్రతి రూపాన్ని అపహాస్యం చేస్తున్న తీరు క్షమించరాని స్పందన, భావన వచ్చిందని, స్పాంటేనియస్‌గా రియాక్టు అయ్యానని వివరించారు. 30సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎన్నో తీవ్రమైన సమస్యలు, రాజకీయ వైరుద్యాలు, ఎత్తుగడలు చూశానని, కానీ ఎక్కడా మతం, దేవుడు రాజకీయాల్లోకి రాలేదని గుర్తు చేశారు.

Ref B1/14/2026 dt. 20.02.2026

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్స్.
రాజమహేంద్రవరం

### ఫారం నెం: VI (ఎ)

(2013, భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ (19) సబ్ రూల్ (1) ననుసరించి)

### ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్ లో చూపబడిన ఏలూరుజిల్లా,బుట్టాయిగూడెం మండలం, మర్లగూడెం గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద వి.ఆర్.పురం మండలం,కన్నాయిగూడెం గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునస్థాపనల క్రింద, వారికి భూమిని కేటాయించు నిమిత్తము భూమి అవసరమైనట్లు ప్రాజెక్ట్ ఆఫీసర్,ఐ.టి.డి.ఎ,చింతూరు మరియు ఆర్అండ్ఆర్ అధికారి,చింతూరు యూనిట్,పోలవరం జిల్లావారు భావించినందున 2013, భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు,పారదర్శకత చట్టం నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందు మూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఏ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం. జె-12011/74/2005-1ఎ1, తేది.25.10.2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43 (1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పునస్థాపన కొరకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది.10.05.2020వ తేదీన జారీ చేసిన జి. ఓ.యం.యస్. నెం.42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వరరామచంద్రపురం యూనిట్-2,చింతూరువారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వరరామచంద్రపురం యూనిట్-2,చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు /ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి-వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలెక్టరు/ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

### షెడ్యూలు

| జిల్లా: ఏలూరు | | | | మండలం: బుట్టాయిగూడెం | | గ్రామం :మర్లగూడెం | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| క్రమ సంఖ్య | LP నెంబరు | భూసేకరణ క్రింది విస్తీర్ణం(య.సెం ట్లు) | భూమి తరగతి | పాత సర్వే నెంబరు | సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా | పరిహద్దులు: తూర్పు | పడమర | ఉత్తరము | దక్షిణం | చెట్లు కట్టడములు ఇతరముల వివరములు |
| 1 | 235 | 1.18 | మెరక | 38, 39 | పోల్నాటి సత్యనారాయణ (తండ్రి)వీరన్న | L.P. NO236 | L.P. NO 234 | L.P. NO237, 238 | జంగారెడ్డి గూడెం గ్రామం | - |
| 2 | 247 | 11.22 | Dry | 41, 43 | 1. పోల్నాటి సత్యనారాయణ (తండ్రి) వీరన్న 2. తన్నీరు వెంకటాచార్యులు (తండ్రి) తాతయ్య 3. పోల్నాటి దుర్గారావు (తండ్రి)నాగన్న 4. పోల్నాటి పెద్రాజు (తండ్రి) వీరన్న 5. పోల్నాటి వెంకటసుబ్బారావు (తండ్రి) నాగన్న 6. పోల్నాటి సత్యనారాయణ (తండ్రి) నాగన్న 7. పోల్నాటి వీర వెంకమ్మ (భర్త) వీరన్న | L.P.NO 248,25 1, 249 | L.P.NO 245,246 | L.P.NO 254,269, 270 | జంగారెడ్డి గూడెం గ్రామం | - |
| 3 | 249 | 3.63 | Dry | 42 | 1. తన్నీరు సుబ్బారావు (తండ్రి)తాతయ్య 2. పోల్నాటి పెద్రాజు (తండ్రి) వీరన్న 3. పోల్నాటి రామకృష్ణ (తండ్రి) నాగన్న 4. పోల్నాటి సత్యనారాయణ (తండ్రి) వీరన్న | L.P.NO 250 | L.P.NO 247,248 | L.P.NO 251 | జంగారెడ్డి గూడెం గ్రామం | |
| 4 | 236 | 1.19 | Dry | 39 | పోల్నాటి సత్యనారాయణ (తండ్రి)నాగన్న | L.P.NO 238 | L.P.NO 235 | L.P.NO 237,238 | జంగారెడ్డి గూడెం గ్రామం | - |
| 5 | 241 | 2.15 | Dry | 40, 43 | 1.తన్నీరు వెంకటాచార్యులు (తండ్రి) తాతయ్య 2. పోల్నాటి దుర్గారావు (తండ్రి) నాగన్న 3. పోల్నాటి పెద్రాజు (తండ్రి) వీరన్న 4. పోల్నాటి వెంకట సుబ్బారావు (తండ్రి) నాగన్న 5. పోల్నాటి సత్యనారాయణ (తండ్రి) నాగన్న | L.P.NO 242 | L.P.NO 239 | L.P.NO 272 | L.P.NO 240 | - |
| 6 | 240 | 2.86 | Dry | 39 | 1. తన్నీరు వెంకటాచార్యులు (తండ్రి) తాతయ్య 2. పోల్నాటి వెంకట సుబ్బారావు (తండ్రి) నాగన్న | L.P.NO 243,24 4 | L.P.NO 239 | L.P.NO 241 | జంగారెడ్డి గూడెం గ్రామం | - |
| 7 | 238 | 5.80 | Dry | 39 | 1. తన్నీరు సుబ్బారావు (తండ్రి)తాతయ్య 2. పోల్నాటి దుర్గారావు (తండ్రి) నాగన్న 3. పల్నాటి పెద్రాజు (తండ్రి) వీరన్న | L.P.NO 237,23 9 | L.P.NO 233 | L.P.NO 232 | L.P.NO 235,236 | - |
| 8 | 233 | 5.31 | Dry | 37-2 | 1. పోల్నాటి ముక్కయ్య తండ్రివెంకన్న 2. బందారు మునేశ్వరరావు తండ్రి అప్పారావు 3. బందారు వెంకటేశ్వరరావు తండ్రి అప్పారావు | L.P.NO 232 | L.P.NO 238 | అక్కంపే ట గ్రామం | L.P.NO 234 | |
| 9 | 232 | 9.75 | Dry | 35-2 | 1.బందారు వెంకటేశ్వరరావు (తండ్రి)అప్పారావు. 2.బందారు మునేశ్వరరావు (తండ్రి)అప్పారావు | L.P.NO 273,23 9 | L.P.NO 228,229 ,230,23 1 | L.P.NO 223,224 | L.P.NO 238 | - |
| మొత్తము | | 43.09 | | | | | | | | |

ప్రదేశం : వి.ఆర్ పురం యూనిట్ -II

తేది: 17-02-2026.

కె.ఆంజనేయులు
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే)
వి.ఆర్.పురం యూనిట్ - 2,చింతూరు

వి.అభిషేక్ ఐ.ఎ.ఎస్
స్పెషల్ కలెక్టర్ (భూ.సే) (ఎఫ్.ఎ.సి),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్స్,
రాజమహేంద్రవరం

వార్త

మేం భారతీయుల ముందు మోకరిల్లుతాం! వారు మాకు గణితాన్ని నేర్పారు. గణితమే లేకపోతే, ఎలాంటి శాస్త్ర పరిశోధనా జరిగేది కాదు.

- ఐన్‌స్టెయిన్

# ఇదేమి సంస్కృతి?


అనర్హులకు ఉచితాలు అందకుండా అదుపు చేసే వరకు సుప్రీం కోర్టు మరోవైపునకు దృష్టి మరల్చేటట్లు లేదు. సుప్రీం ధర్మాసనంలో ఏ న్యాయమూర్తులున్నా ఉచితంపై దృష్టి సారించినట్లే ఉంది. సాధారణ పరిభాషలో యుద్ధం ప్రకటించినట్లే నన్న మాట. అసలు ఉచితాలు వద్దని ఎందరో మేధావులు ప్రస్తావిస్తున్న మాటలు ఎవరికీ చెవికెక్కడం లేదు. అదలా ఉంచి కనీసం అర్హులైనవారికి మాత్రమే ఉచితాలు అందించగలగడం మేలు అనే భావన అందరిలోనూ ఉంది. ఆఖరికి ఉచితాలు కోసం అర్రులు చాచే అనర్హులు సైతం అదేదో తప్పుకాదని వాదిస్తారు. రెవెన్యూలోటు అధికంగా ఉన్న రాష్ట్రాలు ఎన్నికలనగానే ఉచితాల తాయిలాలను ఎరవేస్తున్నారు. లోగు పూడ్చడం లోగుట్టు పెరుమాళ్లకెరుక. లోటు లేని బడ్జెట్ ఉన్న రాష్ట్రాలు తమ నిధులను రహదారుల అభివృద్ధి, విద్య, వైద్య అవసరాలకు మళ్లించుకోవాలని సుప్రీం బెంచ్ సూచించింది. అందరికీ ఉచితంగా ఆహారం, సైకిళ్లు ఇవ్వడం కన్నా ఉపాధి మార్గాలను అన్వేషించి మెరుగుపరచడానికి సదరు నిధులను వెచ్చించడం మంచిదని హితవు పలికింది. నిరుపేదలైన అర్హులతోపాటు బడా భూస్వాములకు ఉచిత విద్యుత్ ఇవ్వడం హాస్యాస్పదమేనంది. ఏదో ఆశించి ఇలాంటివి చేయడం సరికాదని, పునరాలోచించుకోవాలని కోరింది. విచక్షణారహితంగా ప్రభుత్వ నిధులను పంచిపెట్టడం బుజ్జగింపులకేనని స్పష్టమౌతోందని విశ్లేషించింది. సంక్షేమ నిధులను పక్కదారికి మళ్లించడం సమంజసం కాదని హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనైనా ప్రభుత్వాల తీరు మారాలి. ఉచితాలపై సుప్రీంకోర్టు మరోసారి ఆందోళన వెలిబుచ్చింది. ఎన్నికల ముందు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గుప్పిస్తున్న ఉచితాలు అర్హులతోపాటు అనర్హులను కూడా జత చేసే ప్రక్రియను ఎంత మాత్రం ఆమోదించేది లేదని నిర్ద్వంద్వంగా వివరించింది. ఉచిత ఆహారం, ఉచిత విద్యుత్తును ఇదే స్థాయిలో కొనసాగిస్తే ఆయా రాష్ట్రాలకు నిధులు సమస్య తలెత్తుతుంది. ఆ సందర్భంలో రాష్ట్రాల అభివృద్ధికి నిధులు సరిపోవు. దేశ ఆర్థికాభివృద్ధికి నిధుల కొరత ఏర్పడ్తుంది. ఇలా ఉచితాలపై ఖర్చు చేసే వ్యయాన్ని ఎక్కడి నుంచి తెస్తాం, అభివృద్ధికి నిధులెలా? అనే ఆలోచన చేయడం లేదని కోర్టు ఆవేదన చెందింది. ఉచితాలపై చర్చ జరగని సందర్భం ఉండదని తెలిసిందే. అదే ధర్మాసనం ముందుకుఇలాంటి అంశాలపై చర్చ రేగితే జనంలో కూడా ఆలోచన మొదలౌతుంది. ఏక మొత్తంగా ఉచితాలపై వెగటు పుట్టే పరిస్థితి రాదు. కానీ అవసరమైన వారికి అందించగలిగితే అందరూ గర్విస్తారు. తమిళనాడులో త్వరలో ఎన్నికలు రానున్న సందర్భంగా ఇటీవల అధికార డిఎంకె పార్టీ ప్రజల ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా అందరికీ 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రతిపాదనపై సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణసందర్భంగా సుప్రీం కోర్టు ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయా మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం అంశంపై పలు వ్యాఖ్యలు చేసింది. కరెంటు బిల్లులు చెల్లించలేని నిస్సహాయస్థితిలో ఉన్న పేదలకు సహాయం చేయడం మంచిదేనని కానీ ఆర్థిక స్థోమత ఉన్న వారికీ లేని వారనే తేడా లేకుంటే సహాయమందించడం మంచి పద్ధతికాదని వ్యాఖ్యానించింది. ఉచితాలను విచక్షణా రహితంగా పంపిణీ చేసి పని చేయకుండా కాలక్షేపం చేసే వారి సంఖ్యను పెంచినట్లే ఉంటుందని అది పని సంస్కృతికి చెల్లుచీటి ఇచ్చినట్లేనని సిజెఐ బెంచ్ హెచ్చరికలు చేసింది. ప్రధానంగాయుటిలిటీలు సేవలకు చెల్లించగలిగితే ఆర్థిక స్థితి ఉన్నవారికి కూడా ఉచిత రాయితీలు ఇచ్చే సంస్కృతి ఎక్కడికి దారితీస్తుందో బేరీజు వేసుకోవాలని సూచించింది. ఎన్నికల సందర్భాల్లో భారీ కానుకలు పంచిపెట్టడం వంటి ఉచితాల ద్వారా లబ్ధిపొందగలమనే ఆలోచన కలుగ చేయనీయరాదని ఎన్నికల ముందు ప్రభుత్వాలు ప్రకటించే నజరానాలు, ఉచిత లబ్ధిపథకాలు ఎంతో బాధ్యతారహితంగా ఉన్నాయన్నది సర్వోన్నత న్యాయస్థానం విశ్లేషిస్తోంది. అలాంటి నిర్ణయాలు ప్రకటించే సమయం, సందర్భం అనుచితంగా ఉన్నాయన్నది న్యాయస్థానం అభిప్రాయం. ఇన్నాళ్లూ లేనిది ఇంత ఆకస్మికంగా ఉచిత విద్యుత్తును ఎందుకు ప్రకటించారని తమిళనాడు ప్రభుత్వాన్ని ప్రకటించింది. ఎన్నికల ముందు మాత్రమే ఇలాంటి పథకాలను ప్రకటించడంలో ఔచిత్యాన్ని ఆపై ఇలాంటి అంశాలపై రాజకీయ పార్టీలు సామాజిక వేత్తలు, మేధావులు పునరాలోచించాల్సిన అవశ్యకత ఉందని సుప్రీం కోర్టు వివరించింది. ఈ విధానాలు ఇంకా ఎంతకాలం ఏవిధంగా కొనసాగాలన్నది నిర్దేశించుకోవాల్సిన అవసరం ఉందని తీవ్రస్థాయిలో ఆర్థికలోటు ఉన్నా ఉచితాలు ప్రకటించడం అందు కోసం పన్నులను విధించడం వంటి భారాలన్నీ తుదకు పన్ను చెల్లింపుదారుల మీద పడుతున్నాయని ధర్మాసనంఆందోళన వ్యక్తంచేసింది. సరైన ముందస్తు ఆర్థిక ప్రణాళికలు లేకుండా రాష్ట్రాలు సబ్సిడీలిచ్చే వాగ్దానాలను ఎలా నెరవేర్చగలవో ఆలోచించాల్సిందేనని సుప్రీంబెంచ్ సూచించేది. విద్యుత్ సవరణ చట్టాలు 2024లోని నిబంధన 23ను సవాల్‌చేస్తూ తమిళనాడు పవర్‌డిస్ట్రిబ్యూషన్ కంపెనీ దాఖలు చేసుకున్న పిటిషన్‌ను ఎంత లోతుగా చర్చిస్తూ విద్యుత్ సరఫరా సంస్థలు (డిస్కమ్‌లు) సుంకాలు, బడ్జెట్ లెక్కలు సర్దుబాటు చేయలేక సతమతమవు తున్న విషయం అందరూ అర్థంచేసుకోవాలని కోరింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఎంతో నిర్దిష్టంగా రూపొందించే బాధ్యత సుప్రీంకోర్టు తీసుకోవడమే ధర్మం.

మీరు గౌరవాన్ని కోరుకుంటే ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మలెన్నవరూ చిన్నచూపు చూడరు.



శామ్యూల్ జాన్సన్

పనిని ఎందుకు తప్పుగా చేశారో తెలియచేయడానికి పట్టే కాలం కంటే ఆ పనిని తిరిగి సరిగ్గా చేయడానికి తక్కువ సమయం పడుతుంది.



లాంగ్‌ఫెలో

# ప్రజావాక్కు



### భాషల పట్ల గౌరవభావం

**ఇటీవల** కేరళ రాష్ట్ర గవర్నర్ హిందీ భాషలో ఉర్దూ, పార్శీక పదాలు ఎక్కువగా ఉన్నందున దక్షిణాది ప్రజలు హిందీనిసరిగ్గా అర్థంచేసుకోలేకపోతున్నారని, అదే హిందీ భాషలో సంస్కృత భాషా పదాలు చేర్చితే దక్షిణాది వారికి హిందీని దగ్గరికి చేర్చవచ్చనే భావన ఆయనకు భారతీయ భాషలపట్ల బొత్తిగా అవగాహనలేనట్లు తెలుస్తోంది. ఉదాహరణకు తెలుగుభాషలో అనేక ఉర్దూ, పార్శీక పదాలు వాడుకలోఉన్నాయి. తెలుగు, కన్నడ, మరాఠీ భాషలలో ఎక్కువగా ప్రాకృత భాషా పదాలు ఉన్నాయి. అలాగే తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలలో ద్రవిడ పదాలతో పాటు ఆయా భాషల సహజ స్థానిక పదాలున్నాయి. ఇంకా, తెలుగు, మలయాళ భాషలలో లెక్కకు మించి సంస్కృత పదాలు వాడుకలో ఉన్నాయి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### సంఘీభావం అంటే ఇది

**పాకిస్థాన్** మాజీ ప్రధాని, ఆ దేశానికి క్రికెట్ కెప్టెన్‌గా అనేక విజయాలను సాధించి,దేశానికి అనంత కీర్తినార్జించి పెట్టిన, వయసుపైబడ్డ ఇమ్రాన్‌ఖాన్‌జైలు జీవితం గడుపుతున్నాడు. ప్రస్తుతం కంటిచూపు మందగించి అనారోగ్యంతో కాలం గడపడంకాలమహిమ,ఆయనకు సకలసౌకర్యాలు కల్పించామని ఆ దేశ కీలుబొమ్మ ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లను కాచి వడపోస్తోంది. ఇది పచ్చి అబద్ధమని ఆయన కుమారులు, కుమార్తె ఖండించారు. ఖాన్‌గారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ఆయనతో క్రికెట్ ఆటను ఆడిన మన మాజీ కెప్టెన్లు సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్ వారు ఆందోళన చెంది పాక్ పాలకులకు ఓ సుదీర్ఘ లేఖను ఆయన ఆరోగ్య పరిరక్షణకు తక్షణచర్యలుతీసుకోవాలని రాసారు.ఇదీసంఘీభావం అంటే.

- ఎన్.రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఉద్యమకారులను గుర్తించాలి

ప్రభుత్వం ఉద్యమకారులకు ఇందిరమ్మఇండ్లు మంజూరు చేయాలి. ఇటీవల కాలంలో తెలంగాణ ఉద్యమకారులు ప్రభు త్వంనిర్వహించిన ఉద్యోగపరీక్షలలో ఉత్తీర్ణత సాధించడం జరిగింది. చాలామందికి వయోపరిమితి అతి సమీపంలో ఉండి తక్కువ కాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగాలలో చేరిన తెలంగాణ ఉద్యమకారులను కూడా గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

### కృత్రిమ మేధో యుగం

**దక్షిణార్ధగోళంలోని** ప్రపంచ దేశాల్లోనే తొలిసారి నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి ఏఐ సదస్సు ఢిల్లీలో జరగడం భారత్‌కి తలమానికం. 100దేశాల ప్రతినిధులు, వందలాది మంది పారిశ్రామిక దిగ్గజాలు,దేశాధినేతలు పాల్గొంటున్న ఈసదస్సు కృత్రి మ మేధపై కూలంకషంగా చర్చలు జరుపుతుంది. ఐదురోజుల చర్చల అనంతరం ముగింపు రోజు వివిధ దేశాల అంగీకారంతో భవిష్యత్ దారుల్ని స్పష్టపరిచే అధికారిక ప్రకటన వెలువరిస్తుం ది. ప్రపంచ వ్యాప్తంగా, అన్ని రంగాల్ని ప్రభావితం చేసే శక్తి కృత్రిమ మేధకు ఉంది. అదీ జెట్‌స్పీడ్‌లో .ఆ ప్రభావానికి తగినట్టువ్యక్తులూ,సమాజమూ తయారుకావాలి.రానున్న మార్పుల్ని పసిగట్టి అవకాశాల్ని ఒడిసిపట్టాలి. లేదంటే ఇంతవరకూ బలమైనవిగా భావించబడుతున్న దేశాలు బలహీనమౌతాయి. సరిగ్గావినియోగించుకోగలవి బలంపుంజుకుంటాయి. ఈ మార్పుల్ని ముందే ఊహిస్తూ అమెరికా,చైనా దేశాలు కృత్రిమ మేధ పరిశోధనలపై అధికంగా ఖర్చు పెడుతున్నాయి.

-డా.డి.వి.జి శంకరరావు, విజయనగరం

### బంగ్లాదేశ్ జాగరూకతతో మెలగాలి

**బంగ్లాదేశ్‌లో** కొత్త ప్రభుత్వ ఏర్పాటు అది వేస్తున్న అడుగులు దక్షిణాసియాకు కొంతశాంతిని కలిగిస్తుంది. ముఖ్యంగా భారత్ వంటి దేశానికి అదిశాంతి కాముకంగా ఉంటుంది. ఖుషియ్యారా నది నుండి 153 క్యూసెక్కులు తీసుకోవడం నుండి మొదలు పెడితే భారతప్రభుత్వం ఇలా ఆలోచన చేయొచ్చేమో బెంగాల్, అస్సాంనుండి జనపనరా కారిడార్‌ను రూపొందించాలి. ఉపాధి హామీలోజనపనారా పంటలకు తగినవెసులుబాటు కల్పించాలి.

-భారత అవినాష్, జనగాం

### కుక్కలు లేని గ్రామాలు

**తెలంగాణలోని** పలు జిల్లాల్లో ఇటీవల సుమారు 500 వీధి కుక్కలను సామూహికంగా హతమార్చడం దేశవ్యాప్తంగా పెను సంచలనంసృష్టించింది.పోలీసు రికార్డులుసామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియో ఆధారాల ప్రకారం, విషపు ఇంజక్షన్లు ఆహారంలో విషంకలిపి ఈ మూగజీవాలను అత్యంత క్రూరంగా అంతం చేసినట్లు తెలుస్తోంది. కొత్తగా ఎన్నికైన కొందరు సర్పంచులు తమ గ్రామాలనుకుక్కలు లేనిగ్రామాలుగా మారుస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చుకోవడంలో భాగంగానే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పనిలేని, 'పనికి'రాని 'రోడ్ సేఫ్టీ'!

**ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య పదవీబాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ విషయంపై కొంత దృష్టిసారించారు. సచివాలయంలో ఇందుకు సంబంధించిన అన్ని శాఖలతో సమావేశం ఏర్పాటు చేశారు. సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రతిపాదనలు కూడా రూపొందించారు. కానీ ఎవరికి వారు తమ అధికారాలకు, ముఖ్యంగా ఆదాయాలకు గండిపడుతుందన్నట్లు వ్యవహరించి ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా సమావేశాలను, వాయిదా వేయించగలిగారు. ఇప్పటికీ రెండు రాష్ట్రాల్లో రోడ్డు సేఫ్టీ ఆథారిటీ కొనసాగుతున్నా అదొకటి ఉందనే విషయం సామాన్యులకు ఎవ్వరికి తెలియదు. గత నాలుగు దశాబ్దాలుగా పని కల్పించకుండా యేటా లక్షలాది రూపాయల జీతభత్యాల రూపేణా ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నారు. పని కల్పించని, పనిలేని ఈ విభాగాన్ని కనీసం రద్దుచేయడానికి కూడా పాలకులకు చేతులు రావడంలేదు.ఏటా లక్షలాది రూపాయలు ప్రజాధనం నిరుపయోగం అవుతున్నా పట్టించుకోక పోవడం దురదృష్టకరం.**

దామెర్ల సాయిబాబ

దేశంలో రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనిషి క్షేమంగా ఇంటికి వచ్చే గ్యారంటీ లేని అభద్రతాభావం రోజురోజుకు పెరిగిపోతున్నది. ఏ నిమిషానికి ఏమి జరుగునో అన్నట్లు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకువచ్చి ప్రాణాలు పోతాయోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అన్నెం పున్నెం ఎరుగని వేలాది మంది అమాయకులు యేటా రోడ్డు ప్రమాదాల్లో బలైపోతున్నారు. లక్షలాది మంది అంగవికలురుగా మారి కుటుంబానికి భారమై జీవితాంతం నరకం అనుభవిస్తున్నారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు, ఒకరోజు కాదు రెండు రోజులు కాదు యేడాది యేడాదికి ఈ మృత్యుఘోష పెరిగిపోతున్నది. దేశవ్యాప్తంగా పరిశీలిస్తే గత దశాబ్దకాలంలో దాదాపు తొంభై లక్షలకుపైగా ప్రమాదాలు చోటు చేసుకుంటే సుమారు ఇరవైఐదు లక్షల మందికిపైగా మృత్యువాతపడి నట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. క్షతగాత్రులైన వారి సంఖ్య కోట్లల్లో ఉండొచ్చు. రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగానే గత నాలుగేళ్లల్లో ముప్పై వేలకుపైగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అంతేకాదు ప్రమాదాలకు గురై ప్రాణాపాయ స్థితిలో సకాలంలో ప్రాథమిక చికిత్స అందక మృత్యువుతో పోరాడి రోడ్లపైనే ప్రాణాలు వదలినవారెందరో ఉన్నారు.మరికొందరు విదేశాల్లో రోడ్డు ప్రమాదాలకు గురైన ప్రతి రెండువందల మందిలో ఒకరు మరణిస్తుంటే భారత్‌లో ప్రతి ఆరుగురిలో ఒకరు మరణిస్తున్నట్లు అధికార గణాంకాలే చెబుతున్నాయి. ఈ ప్రమాదాల వల్ల ఆర్థికంగా కూడా పెద్దఎత్తునే నష్టం జరుగుతున్నది. ఇక దేశంలోనే రెండు తెలుగు రాష్ట్రాలు కూడా ఈ ప్రమాదాల్లో అగ్రభాగంలోనే ఉన్నాయని చెప్పొచ్చు. అన్నింటికంటే ముఖ్యంగా మితిమీరిన వేగంతోపాటు మద్యం మత్తులో కూడా ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని ప్రమాదాల్లో కుటుంబాలకు, కుటుంబాలే తుడిచిపెట్టుకుపోతున్నాయి. కొన్నిసార్లు వాహన వేగం 120 కిలో మీటర్లకుపైగా ఉండ డంతో బెలూన్లు తెరుచుకున్నా ఫలితం లేకుండాపోతున్నది. ఇలా నిత్యం రోడ్లు రక్తసిక్తమవుతున్నాయి. అసలు పోలీసులు రికార్డుల్లోకి రాని ప్రమాదాలు కూడా ఎన్నో ఉన్నాయి. చనిపోయిన వారిలో అధికశాతం ఇరవైఐదు ఏళ్ల నుంచి నలభై ఐదు యేళ్లవయసులో ఉన్నవారే. సంపాదన చేస్తున్న భర్తో, కుమారుడినో కోల్పోతే ఆ కుటుంబం పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి మనసుపెట్టి పెద్దలు ఆలోచించాలి. దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు పడుతున్న వేదన వర్ణనాతీతం. ఆ కుటుంబాల విషాద గాథలు వింటుంటే ద్రవించని హృదయం ఉండదు. ప్రకృతి బీభత్సంతోనో, లేక ఇతర కారణాలతో వందో, రెండువందల మందో అసువులు బాస్తే భూమి ఆకాశం దద్దరిల్లేటట్లు కేకలు వేసే నాయకులు ఈ ప్రమాదాల్లో ఇంతపెద్ద ఎత్తున మరణించినా, మరణిస్తున్నా వారి గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ప్రకృతి బీభత్సానికి గురవుతున్న వారిని ఆదుకోవద్దని చెప్పడం లేదు. ఆపన్నహస్తం అందివ్వద్దని అనడం లేదు. యేటా వేలాది మంది రోడ్డు ప్రమాదంలో అసువులు బాస్తుంటే పట్టించుకోకపోవడం క్షంతవ్యం కాదు. నివారణకు చర్యలు చేపట్టాల్సిన తరుణమిది. చట్టాలు చేసి, నిబంధనలు విధించి, జరిమానాలు వసూల్ చేసుకొని చేతులు దులుపు కొంటె సరిపోదు. అలాఅని ప్రమాదాల నియంత్రణకు ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు. ఎన్నో చేశారు, చేస్తున్నారు. కొన్ని చట్టాలు అమలుకు నోచుకోకపోతే మరికొన్నింటిని పాలకులు నిర్వీర్యం చేశారు, చేస్తున్నారు. అందుకు ఎన్నో సమీక్షలు, చర్చోపచర్చల అనంతరం ప్రమాదాల నివారణకు ఏర్పరిచిన రోడ్


## ఒక్క మాట

సేఫ్టీ అథారిటీని ఉదహరించవచ్చు. గతంలో విజయవాడలో రోడ్డు ప్రమాదంలో ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ముఖ్య కార్యదర్శి రాఘవేంద్రరావు మరణించినప్పుడు దాదాపు రాష్ట్ర యంత్రాంగం అంతా విజయవాడకు తరలివెళ్లింది. అక్కడే సమీక్షలు, సమావేశాలు చేశారు. ప్రమాదాల నివారణకు నిర్ణయాలు తీసుకునేందుకు అంకురార్పణ జరిగింది. రోడ్డుభద్రతా సంస్థను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొన్ని మార్పులు, చేర్పులతో మరింత పటిష్టంగా పర్యవేక్షించేందుకు పోలీసు డైరెక్టర్ జనరల్ హోదా కలిగిన అధికారిని ఆ విభాగానికి అధిపతిగా నియమించారు. రాష్ట్ర విభజన తర్వాత రెండు విభాగాలు ఏర్పడ్డాయి.ఇద్దరు డిజి స్థాయి అధికారులను నియమించారు. అయినా పని లేకుండా చేయడంతో సంతకం పెట్టివెళ్లే పరిస్థితులు ఏర్పడ్డాయి. కొన్నిసార్లు అయితే కనీసం క్యాంప్ క్లర్క్ కూడా ఇవ్వకుండా మూలన కూర్చోబెట్టారు. వ్యక్తుల మీద కోపంతో వ్యవస్థను కూలదోశారనేందుకు ఇదొక ప్రత్యక్ష ఉదాహరణ. తమ మాట వినని, నచ్చని అధికారులకు పనిష్మెంట్‌గా ఈ పోస్టుల్లో కూర్చోబెడుతున్నారు. సమర్థులుగా పేరు తెచ్చుకున్న ఎందరో అధికారులు రాష్ట్రంలో అధికార మార్పు జరగగానే ఇలాంటి పోస్టులకు బదలీ చేస్తున్నారు. అధికారాలు ఉండవు. వాహనాలు ఉండవు, సిబ్బంది ఉండరు. అలాంటి విభాగం ఒకటి ఉందనికూడా తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయి. రోడ్ సేఫ్టీ ఆథారిటీ ప్రమాదాల నివారణకు ఇప్పటి వరకు ఒక్కచర్య తీసుకున్న దాఖలాలు లేవు. చేసేందుకు పనేమీ ఉండదు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న అధికారితో మాట్లాడితూ వర్క్‌ఫ్రం హోమ్ అని పెట్టుకుంటే ఆఫీసుకు రావాల్సిన పని ఉండదు కదా అని ప్రశ్నిస్తే ఆఫీసుకు వచ్చినా పనిలేకుంటే వర్క్‌ఫ్రం హోమ్‌లో వర్క్ ఎక్కడుంటుంది, 'హోం వర్క్' తప్ప అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈవిషయంపైకొంత దృష్టిసారించారు. సచివాలయంలో ఇందుకు సంబంధించిన అన్ని శాఖలతో సమావేశం ఏర్పాటు చేశారు. సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రతిపాదనలు కూడా రూపొందించారు. కానీ ఎవరికి వారు తమ అధికారాలకు, ముఖ్యంగా ఆదాయాలకు గండిపడుతుందన్నట్లు వ్యవహరించి ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా సమావేశాలను, వాయిదా వేయించగలిగారు.ఇప్పటికీ రెండు రాష్ట్రాల్లో రోడ్డు సేఫ్టీ ఆథారిటీ కొనసాగుతున్నా అదొకటి ఉందనే విషయం సామాన్యులకు ఎవ్వరికి తెలియదు. గత నాలుగు దశాబ్దాలుగా పని కల్పించకుండా యేటా లక్షలాది రూపాయల జీతభత్యాల రూపేణా ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నారు. పని కల్పించని, పనిలేని ఈ విభాగాన్ని కనీసం రద్దు చేయడానికి కూడాపాలకులకు చేతులు రావడం లేదు. ఏటా లక్షలాది రూపాయలు ప్రజాధనం నిరుపయోగం అవుతున్నా పట్టించుకోకపోవడం దురదృష్ట కరం. ఇక కేంద్ర ప్రభుత్వం కూడా ఎన్నోసార్లు ప్రయత్నాలు చేసింది. 2005లో కేంద్ర కేబినెట్ సూచనమేరకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిర్వహణ అంశంపై ఎస్. సుందరం నేతృత్వంలోని కమిటీని నియమించింది. దేశ వ్యాప్తంగా ప్రమాదాలను సమగ్రంగా అధ్యయనం చేసిన కమిటీ 2007లో ఒక నివేదికను సమర్పించింది. ఎనభై శాతం ప్రమాదాలు డ్రైవర్ల నిర్లక్ష్యం, మద్యం సేవించడం ద్వారా జరుగుతుందని నివేదికలో పేర్కొంది. చాలామంది డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు తెలియడం లేదని, కొన్ని రాష్ట్రాల్లో డ్రైవింగ్ లైసెన్సు జారీ ఒక ప్రహసనంగా మారిందని, కనీసం సంతకం చేయలేనివారు లైసెన్సు పొందుతున్నారని ఆ నివేదికలో వెల్లడి అయింది. ఆ తర్వాత ఎన్నో కమిటీలు వచ్చాయి. చట్టాల్లో కొన్ని మార్పులు చేశారు. నిబంధనలను రూపొందించారు. భారీగా జరిమానాలు వేస్తున్నారు. నిఘా పెంచారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. కానీ అవేమీ ఈ ప్రమాదాలను ఆపలేకపోతున్నాయి. చట్టాల్లో ఉన్న లొసుగులను ఉపయోగించుకుంటున్నారు. వీటన్నింటికంటే మించి మద్యం వాడకం ఈ ప్రమాదాలను బాగా పెంచుతున్నది. మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచుకునేందుకు ఎక్కడపడితే అక్కడ షాపులను అనుమతిస్తున్నారు. రహదారుల వెంట ఉన్న మద్యం షాపులు వాహన డ్రైవర్లను మత్తులో ముంచుతున్నాయి. మద్యం ద్వారా జరుగుతున్న ఈ అనర్థాలను పాలకులు గుర్తించడం లేదు. గుర్తించినా మహాప్రసాదంగా మారిన మద్యాదాయం ముందు ఈ ప్రాణాలను లెక్కల్లోకి తీసుకోవడం లేదు. ఫలితంగా లక్షలాది కుటుంబాలు ఆత్మీయులను కోల్పోయి తలడిల్లిపోతున్నాయి. లక్షల సంఖ్యలో అంగవైకల్యంతో జీవనాధారం కోల్పోయి జీవచ్ఛవాలుగా బతుకులీడిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. ఈ మారణహోమాన్ని ఆపాలి. ప్రధానంగా మద్యం సేవించో, లేక అలక్ష్యంతోనో వాహనాలు నడిపి ఎంత మందిని చంపినా జరిమానా చెల్లించో, మరో విధంగానో తప్పించుకోవచ్చుననే భావన పోగొట్టాలి. కొన్ని పాశ్చాత్యదేశాల్లోలాగా మరణాలకు కారణమైన వాహన చోదకులకు జీవితంలో స్టీరింగ్ పట్టకుండా పటిష్టమైన చట్టానికి రూపకల్పన చేయాలి. ●

# జనజీవనంపై ధ్వని కాలుష్య ప్రభావం

డాక్టర్. వై. సంజీవ కుమార్

ధ్వని కాలుష్య నియంత్రణ చట్టాలు, పర్యావరణ పరిరక్షణ చట్టాలు ఎన్నో ఉన్నప్పటికీ, నేటి సమాజంలో ధ్వని కాలుష్యాన్ని సమర్థవంతంగా నియంత్రించలేకపోతున్నాం. ఎటు చూసినా, ఎటు విన్నా శబ్దాల మోతే. మనిషి కర్ణభేరిలకు తూట్లు పడుతున్నట్టుగా పరిస్థితి తయారైంది. రోడ్లపై అనవసరమైన హారన్‌లు, మోడిఫై చేసిన సైలెన్సర్లతో ద్విచక్ర వాహనాల ధ్వని, పల్లె నుంచి పట్నం వరకు తేడా లేకుండా వ్యాపిస్తున్న శబ్దకాలుష్యం ఇవన్నీ మన ప్రశాంతతను దోచుకుంటున్నాయి. ఒకప్పుడు ప్రశాంతతకు మారు పేరైన పల్లెలు, పట్టణాల్లోని కాలనీలు నేడు శబ్ద రణరంగాలుగా మారిపోయాయి. పల్లెల్లో, కాలనీల్లో మైకుల మోత, చెత్త బండ్ల శబ్దాలు, తోపుడు బండ్లు, ఆటోలలో నిత్యావసర సరుకులు అమ్మే వారు పెట్టే మైకుల గోల ఇవన్నీ కలిసి మనసు ప్రశాంతతను, శరీర ఆరోగ్యాన్ని రెండింటినీ దెబ్బతీస్తున్నాయి. చిన్నపిల్లల చెవులు అత్యంత సున్నితమైనవి. నిరంతరం అధిక శబ్దాలకు లోనవడం వల్ల చిన్న వయస్సులోనే వినికిడి లోపాలు, దృష్టి లోపం, నిద్రలేమి,మానసిక ఒత్తిడి వంటి సమస్యలు పెరుగుతున్నాయి. పెద్దలకు అలవాటైపోయిన హారన్ శబ్దాలు, చిన్నారుల వినికిడిని శాశ్వతంగా దెబ్బతీయగలవు. ఇది కేవలం ప్రభుత్వ నియంత్రణతో మాత్రమే పరిష్కారమయ్యే సమస్య కాదు. ప్రతి పౌరుడిలో బాధ్యతా భావం పెరగాలి. అవసరం ఉన్నప్పుడే హారన్ వినియోగించడం, వాహనాల



ను నిబంధనల ప్రకారం నిర్వహించడం, పల్లెల్లో, పట్టణ కాలనీల్లో మైక్ వినియోగాన్ని పరిమితం చేయడం, పిల్లలకు-పెద్దలకు ధ్వని కాలుష్యంపై అవగాహన కల్పించడం, కాలనీ, గ్రామ కమిటీల ద్వారా నియంత్రణ చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలి. ఈ రోజు శబ్దాన్ని నియంత్రించకపోతే, రేపు చెవులే శబ్దాన్ని కోల్పోయి నిశ్శబ్దంగా మారే ప్రమాదం ఉంది. ధ్వని కాలుష్యం ప్రభావం కేవలం మనుషులకే పరిమితం కాదు. మాట్లాడలేని, తమ బాధను వ్యక్తపరచలేని మూగ జీవాలు కూడా తీవ్రమైన శబ్ద కాలుష్యానికిగురై వినికిడి శక్తిని కోల్పోతున్నాయి. పటాకులు, భారీ వాహనాల హారన్‌లు, మైకుల మోత, యంత్రాల శబ్దాలు ఇవన్నీ పక్షులు,పశువులు, కుక్కలు, పిల్లులు వంటి జీవుల చెవులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. అధిక శబ్దాల వల్ల మూగ జీవుల్లో భయం, అయోమయం, ఆందోళన పెరుగుతాయి. దాంతో అవి దారి తప్పడం, ప్రమాదాలకు గురికావడం, ఆహారం వెతుక్కోవడంలో ఇబ్బంది పడటం, పరస్పర సంకేతాలు అర్థం కాకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటాయి. పక్షుల్లో గూళ్లు వదిలేసి పారిపోవడం, గుడ్లు పెట్టకపోవడం, దారితప్పడం, మరణించడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. మనుషుల్లా ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందే అవకాశం లేకుండా, మూగ జీవాలు మౌనంగా బాధను భరిస్తున్నాయి. ధ్వని కాలుష్య నియంత్రణ అనేది మానవ ఆరోగ్య రక్షణ మాత్రమే కాదు, సమస్త జీవరాశి సంరక్షణ బాధ్యత. ●

# మాతృభాషలో బోధనే ప్రగతికి దారి



ఆచార్య టి. గౌరీ శంకర్

ఒక భాష తన ఉనికిని కోల్పోకుండా మనగలిగి ఉండాలంటే ఆ భాష బోధనా భాషగా, పాలనా భాషగా,పత్రికా భాషగా కొనసాగాలి. తమ మాతృభాషను అధికార భాషగా కొనసాగించాలని ఒక ఉద్యమం నడిచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలను సైతం పణంగా పెట్టిన చరిత్ర బంగ్లాదేశ్‌ది. మొదట భాష కోసం సమరం జరిపి, ఆ భాషా ప్రాతిపదికపైన ఒక ప్రత్యేక దేశాన్నే సాధించుకొన్న ఘనత బంగ్లాదేశ్ ప్రజలది. ప్రపంచ చరిత్రలోనే ఇది అపూర్వం. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా ప్రపంచంలోని ఆయా భాషల ప్రజలు, అక్కడి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఆలోచించి, వ్యవహరించవలసిన సందర్భం ఇది. 'మాతృభాష తల్లి పాల వంటిది పరాయి భాష పోతపాల వంటిది' అని కొమర్రాజు వేంకట లక్ష్మణరావు పంతులు సెలవిచ్చారు.'మాతృభాష కళ్ల వంటిది పరాయి భాష కళ్లజోడు వంటిది' అని కరుణానిధి అన్నారంటారు. తల్లి ఒడి నుడి కంటే పరమామృతం కలదె' అని రాయప్రోలు సుబ్బారావు నుడివారు. 1835లో లార్డ్‌మెకాలే భారతదేశంలోని విద్యాలయాలలో బోధనాభాషగా ఇంగ్లీషుని ప్రవేశపెట్టినప్పుడు ఫ్రెడరిక్ జాన్‌డోర లార్డ్ డ్రెమండ్ లార్డ్ విల్సన్ వంటి ఆంగ్లేయ మేధావులు బోధనా భాషలుగా దేశీయ భాషలు మాతృభాషలే ఉండాలని ఆనాటి పార్లమెంటులో వాదించారు. లార్డ్ కర్జన్ భారతదేశం వైస్రా యిగా ఉన్నప్పుడు మాతృభాషల ఔన్నత్యాన్ని చాటి చెప్పాడు. 1920 నుండి 1947వరకు వచ్చిన చట్టాలు మాతృభాషలోనే బోధన విద్యావ్యాప్తి పరీక్షల నిర్వహణ జరగాలని స్పష్టం చేశాయి.వాస్తవానికి ఆంగ్లేయుల కాలంలో ప్రాథమిక విద్య అంటే? ఒకటి నుంచి అయిదవ తరగతివరకు మాతృభాషలలోనే విద్యాభ్యాసం కొనసాగింది. స్వాతంత్ర్యానంతరం చాలా వరకు మాతృభాషా మాధ్యమంలోకి వచ్చాం అనుకుంటున్న తరుణంలో మళ్లీ ఆంగ్ల మాధ్యమంలోకి కూరుకొని పోయాం. గాంధీజీ, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మేధావులతో కూడిన కమిటీలు కూడా మాతృభాష ల్లోనే విద్యాబోధన జరగాలని సూచించాయి. రష్యా,జర్మనీ, జపాన్ వంటి పాశ్చాత్య దేశాలు వైజ్ఞానికంగా నేడు అభివృద్ధి చెందడానికి వారివారి మాతృభాషలే బోధనా భాషలుగా ఉండడమే కారణం అన్నారు. 1854లో సర్ ఛార్లెస్ ఉడ్‌అనే ఉన్నతాధికారి ఎడ్యుకేషన్ డిస్‌పాచ్ (విద్యాపత్రం) ద్వారా భారత సమాజంలోని మధ్య తరగతి ప్రజలలో విద్యావ్యాప్తి జరగాలంటే మాతృభాషలలోనేవిద్యా బోధన జరగాలి అని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి సూచిం చారు. భారతదేశంలోని మాతృభాషలు బలమైన పునాదులపై





నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

వృద్ధిచెంది వికాసం పొందితేనే గానీ సామాజికంగాఅభివృద్ధి సాధింపజాలమని ఆనాడే తెలిపాడు.1964-66లో కొఠారి విద్యాకమిషన్ ఉన్నత పాఠశాలస్థాయి దాకా మాతృ భాషలోనే విద్యాబోధన జరగాలని సూచించింది.భారత రాజ్యాంగంలోని అధికరణం-350 ఎ ప్రకారం త్రిభాషా సూత్రం అమలులోకి వచ్చింది. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్య వరకు అంటే పది,పదకొండు వరకు తెలుగు మాధ్యమంలో బోధన ఉండేది. పదకొండేళ్లు ఉన్నత విద్యను హెచ్‌ఎస్‌సి (హైయ్యర్ సెకండరీ స్కూల్) అనేవారు. ఆ తరువాత ఒక యేడాది పియూసి (ప్రి యూనివర్సిటీ కోర్సు) ఉండేది. ఇది ఇంగ్లీషు మీడియంలో కొనసాగేది. 1967లో ఆనాటి రాష్ట్రంలోని మూడు విశ్వవిద్యాలయాలు చేసిన నిర్ణయంమేరకు ప్రభుత్వం చేత 1969లో ఇంటర్మీడియేట్ రెండేళ్ల కోర్సు ప్రవేశపెట్టబడింది. అప్పుడు ఉన్నత పాఠశాలవిద్య మునుపటి పదకొండేళ్లు కాకుండా పదేళ్లకు తగించబడింది. దానిని ఎస్.ఎస్.సి (సెకండరీ స్కూల్ సర్టిఫికేట్) అంటున్నారు. ఇంటర్మీడియేట్ స్థాయిలో బోధనాభాషగా తెలుగుమాధ్యమం ప్రవేశపెట్టబడింది.ఆ తరువాత డిగ్రీస్థాయి విద్య తెలుగు మీడియంలో కొనసాగింది. ఇంటర్మీడియేట్, డిగ్రీస్థాయి చదువుకు కావలసిన తెలుగు మీడియంలోని పాఠ్యపుస్తకాల తయారీ కోసం1969ప్రాంతంలో ప్రభుత్వం తెలుగు అకాడమీని ఏర్పాటు చేసింది. విశ్వవిద్యాలయ స్థాయిలో స్నాతకోత్తర కోర్సుల బోధన మాతృభాషలోనికి రాలేదు. యు.జి.సి (యూనివర్సిటీ గ్రాంట్స్‌కమిషన్) వారి పరిధిలోకి వచ్చే కోర్సులివి. కాబట్టి యుజిసి వారు ఈ విషయంలో అంటే బోధనా భాషా విషయంలో నిర్ణయాధికారాన్ని ఆయా విశ్వవిద్యాలయాలకే వదిలివేసినా,ఈవిషయంలో ప్రభుత్వంచొరవ చూపలేదు. పూర్వం నిజాంకాలంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం మెడిసన్, ఇంజినీరింగ్ వంటి వృత్తి విద్యాకోర్సులు సైతం ఉర్దూమీడియంలో జరిగేవి. ఇందుకు తగిన పాఠ్యపుస్తకాలు కూడా ఆమీడియం భాషలోనే ఉండేవి. ప్రాథమిక స్థాయినుంచే పిల్లలు తమమాతృభాషపై ప్రత్యేక దృష్టిసారించడంవల్ల వాళ్ల ఆలోచనాపరిధి మరింత విస్తృతమవుతుందని శాస్త్రీయంగా నిరూపించబడినట్లు నూతన విద్యావిధానం (ఎన్ఇపి-2020)నొక్కివక్కాణించింది. ఒకప్పుడు పరిమిత ప్రయోజనం కలిగిన భాష నేడు బోధనా భాషగా పాలనా భాషగా,పత్రికా భాషగా వినియోగంలోకి వచ్చింది. శాస్త్ర,సాంకేతికాది రంగాలలో భాషావినియోగం పెరిగినప్పుడు నూతన పద పరికల్పన పారిభాషిక పదసృష్టి అవసరం పెరుగుతున్నది. అప్పుడు భాష మరింతగా సుసంపన్నమవుతుంది. సమాజాభివృద్ధికి కొత్తకొత్త ప్రణాళికలు రూపొందించినట్లుగానే భాషల అభివృద్ధికి కూడా ప్రణాళికా రచన అనివార్యం.1905లో లార్డ్ కర్జన్ బెంగాల్ విభజన చేసినప్పుడు ఎదురైన ప్రతిఘటన ఆంధ్రలోభాషోద్యమంగా,జాతీయోద్యమంగా రూపుదాల్చింది. 1911వ సంవత్సరంలో బెంగాల్ మళ్లీ ఒకటి కావడానికి మూలసూత్రం ప్రజల భాషా ప్రాతిపదికే.మన తెలుగురాష్ట్రంలో 1911లో ప్రథమాంధ్ర గ్రంథాలయ మహాసభలు,1913లో బాపట్లలో ప్రథమాంధ్ర మహాసభ, 1921లో 'ఆంధ్ర జనసంఘం, స్థాపన, 1900లో శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం,1943లో 'ఆంధ్ర సారస్వత పరిషత్తు' వంటివి ఏర్పాటుకావడానికి భాషోద్యమాలే ప్రధానకారణం.మాతృభాషలను పరిరక్షించుకోవడానికిప్రజలు ఉద్యమించడమేకాదు, ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలి. ప్రజల భాషను కాపాడడానికి తగు చర్యలు చేపట్టాలి. ●

# 'సర్' విధులకు న్యాయాధికారులు



## కోల్‌కతా హైకోర్టుకు సుప్రీం సూచన

## బెంగాల్ సర్కార్ - ఇసి విభేదాలు దురదృష్టకరం

## 28న ఓటర్ల తుది జాబితా ప్రచురణకు అనుమతి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సజావుగా కొనసాగించేందుకు పర్యవేక్షిం చడానికి పదవీ విరమణ చేసిన న్యాయ అధికారులతో పాటు, సేవలందిస్తున్న వారిని నియమించాలని కోల్‌కతా హైకోర్టును సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘం (ఇసి) మధ్య "విశ్వాస లోటు" ఎస్ఐఆర్ ప్రక్రియను కీలకమైన దశలో నిలిపివేసిందని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మల్య బాగ్చి, విపిన్ పంచోలిలతో కూడిన ధర్మాసనం గమనించింది. "ఇద్దరు రాజ్యాంగ కార్యకర్తల మధ్య విశ్వాసం లోటును చూపించే ఆరోపణలు, ప్రతిఆరోపణల దురదృష్టకరం" అని సుప్రీం కోర్టు పేర్కొంది. "తార్కిక వ్యత్యాస జాబితా" కింద నోటీసులు అందుకున్న వేలాది మంది ఓటర్లు ఇప్పటికే తమను ఓటర్ల జాబితాలో చేర్చడానికి మద్దతు ఇచ్చే పత్రాలను సమర్పించారని పేర్కొంటూ, సిజెఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వాదనలకు ఇప్పుడు న్యాయమైన తీర్పు అవసరమని నొక్కి చెప్పింది. "అసాధారణ పరిస్థితుల" దృష్ట్యా, న్యాయబద్ధంగా సవరణ ప్రక్రియ పూర్తి కావడానికి న్యాయవ్యవస్థను చేర్చుకోవడం తప్ప వేరే మార్గం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. జిల్లాల అంతటా పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌ల పరిష్కారానికి, పునఃపరిశీలనకు సహాయం చేయడానికి అదనపు జిల్లా న్యాయమూర్తి లేదా జిల్లా న్యాయమూర్తి హోదాలో ఉన్న పదవీ విరమణ చేసిన అధికారులతో పాటు, పనిచేస్తున్న న్యాయ అధికారులను కూడా విడిచిపెట్టాలని కోలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరింది. "సమర్పించిన పత్రాల వాస్తవికతను నిర్ధారించడంలో, తత్ఫలితంగా ఓటరు జాబితాలో చేర్చడం లేదా తొలగించడం వంటి వాటిపై న్యాయబద్ధతను నిర్ధారించడానికి, కొంతమంది మాజీ న్యాయ అధికారులతో పాటు కొంతమంది పనిచేస్తున్న న్యాయ అధికారులను నియమించాలని సిజెఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. సుప్రీం కోర్టు ఆదేశం ప్రకారం, ప్రతి న్యాయ అధికారికి ఇసిఐ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నియమించిన అధికారులు సహాయం చేస్తారు. ఇప్పటికే పూర్తయిన వ్యాయామంలో భాగంగా ఫిబ్రవరి 28న తుది ఓటర్ల జాబితాను ప్రచురించడానికి కూడా సుప్రీంకోర్టు అనుమతించింది. ఆ తర్వాత ఇసిఐ అనుబంధ ఓటర్ల జాబితాలను ప్రచురించడానికి అనుమతించింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్న అధికారులు ఎదుర్కొంటున్న బెదిరింపులు, బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వివరిస్తూ అనుబంధ అఫిడవిట్ దాఖలు చేయాలని పశ్చిమ బెంగాల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)ని కోరింది. బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, మేనకా గురుస్వామి వాదనలు వినిపించగా, ఇసిఐ తరపున వాదించిన సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదించారు.

# భారత్‌కు వీసా సేవలు పునరుద్ధరించిన బంగ్లా

## రెండు దేశాల మధ్య రెండు నెలలుగా నిలిచిన వీసాల జారీ



**ఢాకా, ఫిబ్రవరి 20:** బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తారిఖ్ రహమాన్ ఇండియాకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నాడు. బంగ్లాదేశ్‌కు వెళ్లేందుకు భారతీయులకు జారీ చేసే వీసా సేవల్ని పునరుద్ధరించారు. ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంలో ఈ సేవలు శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. రెండు దేశాల మధ్య వీసాల జారీ రెండు నెలలక్రితం నిలిచిపోయింది. మూడు నెలల క్రితం బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరిగాయి. ఇండియాలో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని బంగ్లా డిమాండ్ చేసింది. ఈ పరిణామాల నేపథ్యలో ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. దీంతో గత ఏడాది డిసెంబర్ నుంచి రెండు దేశాల మధ్య రాయబార కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. ముఖ్యంగా రెండు దేశాల మధ్య వీసాల జారీ ఆగిపోయింది. ఇటు ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంలో, అటు ఢాకాలోని భారత రాయబార కార్యాలయంలో వీసాల జారీ నిలిచిపోయింది. అయితే, తాజాగా బంగ్లా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తారిఖ్ రహమాన్ మూడు రోజుల్లోనే ఇండియాతో సంబంధాల విషయంలో సానుకూలంగా స్పందించాడు. వీసాలు పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకున్నాడు. దీంతో ఢిల్లీలో శుక్రవారం ఉదయం నుంచి బంగ్లా రాయబార కార్యాలయంలో అన్ని రకాల వీసాల మంజూరు సేవలు ప్రారంభమయ్యాయి. త్వరలోనే ఢాకాలో కూడా బంగ్లా నుంచి ఇండియాకు వచ్చేందుకు వీసాల సేవల్ని పునరుద్ధరిస్తామని అనిరుద్ధా దాస్ అనే బంగ్లాలోని భారత రాయబార కార్యాలయ అధికారి తెలిపారు. మెడికల్, టూరిజం వంటి అన్ని రకాల వీసా సేవలు అందుబాటులోకి వస్తాయి. బంగ్లాలో తారిక్ ప్రమాణ స్వీకారానికి ఇండియా నుంచి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరయ్యారు. తాజాగా తారిక్ ఇండియాతో సంబంధాల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకున్నాడు. దీంతో త్వరలో రెండు దేశాల మధ్య సంబంధాలు తిరిగి మెరుగవుతాయని విశ్లేషకుల అంచనా.



# పరువునష్టంకేసులో కోర్టుకు హాజరైన రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ పరువు నష్టం కేసులో ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ కోర్టుకు హాజరయ్యారు. గతంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు గాను పరువు నష్టం దావా వేశారు. తన స్టేట్‌మెంట్‌ను కోర్టులో నమోదు చేయడం కోసం ఆయన హాజరయ్యారు. రాహుల్ గాంధీ ఢిల్లీ నుంచి ఉదయం వచ్చి నేరుగా విచారణ కోసం సుల్తాన్‌పూర్ వెళ్లారు. పరువు నష్టం కేసులో కోర్టు విచారణ కోసం రాహుల్ గాంధీ సుల్తానాబాద్ వచ్చారని ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజయ్ రాయ్ వెల్లడించారు. విచారణ కోసం వచ్చిన రాహుల్ గాంధీ, కోర్టు పని పూర్తి కాగానే ఢిల్లీకి తిరిగి వెళతారని తెలిపారు. కాగా, రాహుల్ గాంధీ కోర్టుకు వస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు సుల్తాన్‌పూర్‌లో సత్యమేవ జయతే అంటూ రాసిన పోస్టర్లను ఏర్పాటు చేశారు. 2018 కర్ణాటక ఎన్నికల సమయంలో అమిత్ షాపై రాహుల్ గాంధీ అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ నాయకుడు విజయ్ మిశ్రా పరువు నష్టం దావా వేశారు. 2024 జులై 26న కూడా రాహుల్ గాంధీ తన వాంగ్మూలాన్ని కోర్టులో నమోదు చేశారు. తనపై రాజకీయ కుట్రలో భాగంగా పరువు నష్టం దావా వేశారని ఆరోపించారు. ఈ క్రమంలో ఆధారాలను సమర్పించాలని ఫిర్యాదుదారు విజయ్ మిశ్రాను కోర్టు నాడు ఆదేశించింది.

# సునీత యాత్ర.. 'కల్పనా చావ్లా' తరహా

# ప్రాణాంతక వైఫల్యమే

## నాసా సంచలన నివేదిక



**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ వారం రోజుల అంతరిక్ష యాత్ర కాస్తా.. అనివార్య కారణాల వల్ల నెలల పాటు గడిచింది. యావత్ ప్రపంచం ఉత్కంఠగా చూసిన ఆ రోదసియాత్రపై అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా తాజాగా ఓ నివేదిక విడుదల చేసింది. ఆ మిషన్ 'ప్రాణాంతక వైఫల్యమేనని' అంగీకరించింది. దానిని 'టైప్-ఎ' ప్రమాదంగా అభివర్ణించింది. వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ ప్రయాణించిన బోయింగ్ స్టార్‌లైనర్ మిషన్‌పై నాసా 311 పేజీల నివేదిక విడుదల చేసింది. ఈ సందర్భంగా నాసా చీఫ్ జేర్డ్ ఐజాక్‌మ్యాన్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భద్రతాపరమైన హెచ్చరికలను విస్మరించి నాటి నాసా మేనేజ్‌మెంట్, బోయింగ్ మిషన్‌పై ముందుకెళ్లారని వెల్లడించారు. '2024 జూన్‌లో ఈ మిషన్‌ను ప్రయోగించిన వెంటనే సమస్య మొదలైంది. రాకెట్‌కు థ్రస్ట్‌ను ఉత్పత్తి చేసే స్పేస్‌క్రాఫ్ట్ ప్రొపల్షన్ వ్యవస్థ విఫలమవడం ప్రారంభించింది. స్పేస్ స్టేషన్‌కు సమీపిస్తుండగానే ఐదు థ్రస్టర్లు పనిచేయడం ఆగిపోయాయి. దీనికితోడు హీలియం లీకేజీ మరింత భయపెట్టింది. అయితే, అదృష్టవశాత్తూ డాకింగ్ సురక్షితంగా పూర్తవడంతో వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లగలిగారు' అని ఈ నివేదికలో వెల్లడించారు. భద్రతాపరమైన ప్రొటోకాల్స్‌ను పక్కనబెట్టి ప్రయోగాన్ని అనుకున్న షెడ్యూల్‌కు చేపట్టేలా నాసా మేనేజర్లపై ఒత్తిడి తెచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఈ మిషన్‌ను టైప్-ఎ వైఫల్యంగా ధ్రువీకరించడంతో వ్యోమగాముల ప్రాణాలను పణంగా పెట్టి ప్రయోగం చేపట్టామని నాసా అంగీకరించినట్లయ్యింది. ఏమిటీ టైప్-ఎ ప్రమాదం? ఈ మిషన్‌ను నాసా 'టైప్-ఎ' ప్రమాదంగా ప్రకటించడం ఎయిరోస్పేస్ ఇండస్ట్రీని షాక్‌క గురిచేసింది. సాధారంగా అత్యంత విపత్కర యాక్సిడెంట్లకు దీన్ని పేర్కొంటారు. 2003లో జరిగిన కొలంబియా షటిల్ డిజాస్టర్‌ను 'టైప్-ఎ' ప్రమాదంగా పిలుస్తారు. ఆ ప్రమాదంలోనే భారత అమెరికన్ వ్యోమగామి కల్పనాచావ్లా సహా మరో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు కూడా ఇంజినీర్ల ఆందోళనలను పట్టించుకోకుండా మిషన్‌ను ప్రయోగించడంతో ఆ విషాదం చోటుచేసుకుంది. గతేడాది జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ప్రణాళిక ప్రకారం వీరు 8 రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమికి తిరిగొచ్చింది. అనంతరం వీరిని తీసుకొచ్చేందుకు బోయింగ్ అనేక ప్రయత్నాలు చేసింది.

# గోడవెనుక రహస్య కేంద్రం

## రూ.100 కోట్ల నగదు, నగలు, డాక్యుమెంట్లు సీజ్

## కన్హా గ్రూప్‌పై ఐటి దాడుల్లో విస్తుపోయే నిజాలు




**జైపూర్, ఫిబ్రవరి 20:** ఆగంతకులనుంచి వచ్చిన సమాచారం ఆధారంతో ఆదాయపు పన్నుశాఖ అధికారులు లక్నోలో ఒక మనీలాండరింగ్‌కేసును ఛేదించారు. ఐటి ఇన్‌స్పెక్టర్ అమయ్‌పట్నాయక్ ఆ ఇంట్లోని గోడల్లో బ్లాక్ మనీ, బంగారం దాచినట్లు గుర్తించారు. ఫాల్స్‌సీలింగ్స్‌లోను, నేలమాళిగ తరహాలో ఈ రహస్య కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. బాలివుడ్ చిత్రం రైడ్ తరహాలో ఉన్న ఈ రహస్య గనినిచూసి అధికారులు విస్తుపోయారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఒక వ్యాపారి ఇంట్లోనే ఒక రహస్య గోడను గుర్తించి దాని వెనుక ఒకస్ట్రాంగ్‌రూమ్‌ను కూడా వెలుగులోకి తెచ్చారు. ఈ స్ట్రాంగ్‌రూమ్ నిండా కోట్లాదిరూపాయల విలువైన బంగారు ఆభరణాలున్నాయి. గడచిన మూడురోజులుగా రాజస్థాన్‌లోని కన్హా గ్రూప్ వాణిజ్య సంస్థలపై దాడులు కొనసాగిస్తున్నారు. ఐటి అధికారులు మరింతగా నగదు, బంగారం, ఇతర కీలక పత్రాలను కూడా స్వాధీనంచేసుకున్నారు. భారీ ఎత్తున పన్ను ఎగవేతకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఐటిశాఖ మొత్తం మూడు నగరాల్లోని 33 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులుచేసారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభించిన ఈ ఆపరేషన్ ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. జైపూర్‌లోనే 26 ప్రాంతాల్లో తనిఖీలుచేసారు. ఉదయ్‌పూర్, శ్రీగంగానగర్, కోట, కరౌలి, హిండౌన్, ముంబయిలలోకూడా దాడులుజరిగాయి. కన్హా గ్రూపును 2008లో నట్వర్‌లాల్ శార్దా స్థాపించారు. జైపూర్‌కేంద్రంగా ఆహార శీతలపానీయాలకంపెనీగా పేరుంది. మిఠాయిలు, నమ్‌కీన్‌లు, బేకరీ ఉత్పత్తులకు పేరు. కాగా తాజాగా జరిపిన దాడుల్లో 50 లక్షల నగదు లభించింది. పది బ్యాంకు లాకర్లు, బంగారం మొత్తం రూ.100 కోట్ల విలువ కలిగిన నగదు, నగలు, ముఖ్యపత్రాలు స్వాధీనంచేసుకున్నారు.

# నటుడు రణవీర్‌సింగ్‌కు బిష్ణోయ్‌గ్యాంగ్ బెదిరింపులు


## రూ.10 కోట్లు ఇవ్వకుంటే సిబ్బందిని చంపేస్తామని హెచ్చరికలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ప్రముఖ బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ రూ.10 కోట్లు ఇవ్వాలంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి మరోసారి బెదిరింపులు వచ్చాయి. అమెరికాలో రిజిస్టర్ అయిన ఫోన్ నెంబర్ నుంచి రణ్‌వీర్ సింగ్ మేనేజర్ వాట్సాప్ ఖాతాకు బెదిరింపు వాయిస్ నోట్ వచ్చింది. దీనిపై ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అమెరికా అధికారులను సంప్రదించినట్లు తెలుస్తోంది. బాలీవుడ్ ప్రముఖులకు ఇటీవల వరుస బెదిరింపులు రావడం చర్చనీయాంశంగా మారింది. తనను తాను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన హ్యారీ బాక్సర్‌గా పరిచయం చేసుకున్న వ్యక్తి బాలీవుడ్ ప్రముఖులకు ఈ బెదిరింపు సందేశం పంపించాడు. తాను కోరినంత డబ్బులు ఇవ్వాలని లేదంటే సిబ్బందిని హత్య చేస్తానని బెదిరించాడు. మీ మేనేజర్ నుంచి మీ వద్ద పని చేసే ప్రతి ఒక్కరి వివరాలు మాకు తెలుసని, వారు తమ కుటుంబాలతో ఎక్కడ నివసిస్తున్నారో కూడా తెలుసని, వాళ్లకు ఏమీ కాకముందే మీరు డిమాండ్లకు అంగీకరించాలని ఆ వాయిస్ నోట్‌లో పేర్కొన్నాడు. ఇంతకుముందు నటుడు రోహిత్ శెట్టి ఇంటి వెలుపుల ముగ్గురు వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడు శుభమ్ లోంకర్ హస్తం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇదివరకు నటుడు సల్మాన్ ఖాన్ నివాసం వెలుపల కాల్పులకు పాల్పడిన ఘటనలోనూ లోంకర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

# సంక్షిప్తంగా..

## ఢిల్లీలో మరో 'లేడీ డాన్'..



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దేశ రాజధాని ఢిల్లీలో మరో 'లేడీ డాన్' వ్యవహారం వెలుగు చూసింది. పగలు బ్యూటీ పార్లర్ నడుపుతూ సాదాసీదాగా కనిపించే ఆమె రాత్రిపూట భారీ డ్రగ్ సిండికేట్‌ను శాసిస్తోంది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా కోసం పనిచేస్తోన్న లేడీ డాన్ ఖుస్నుమా అన్సారీ అలియాస్ నేహను ఢిల్లీ పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో నిఘా పెట్టి ఆమె ఆట కట్టించారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల ఢిల్లీలోని మహిపాల్‌పూర్ ఫ్లైఓవర్ ప్రాంతంలో పోలీసులు భారీ ఎత్తున డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసు దర్యాప్తు చేస్తుండగా పోలీసులకు 'మేడమ్ జహర్' పదం వినిపించింది. దీంతో తీగ లాగితే ఈ లేడీ డాన్ వ్యవహారం బయటపడింది. ఈశాన్య ఢిల్లీలో బ్యూటీపార్లర్ నడిపే ఖుస్నుమానే ఈ మేడమ్ జహర్ అని పోలీసులు గుర్తించారు.

## కర్ణాటక సిఎంపై పిటిషన్ వేసిన సామాజిక కార్యకర్త అరెస్ట్




**బెంగళూరు, ఫిబ్రవరి 18:** మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కేటాయింపు కేసులో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై పిటిషన్ దాఖలు చేసి వాదించిన సామాజిక కార్యకర్త చిక్కుల్లో పడ్డాడు. స్నేహమయి కృష్ణను బెంగళూరు క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆయన అరెస్ట్ కారణాలు తెలియలేదు. సిద్ధ రామయ్య, ఆయన భార్య పార్వతి, కొంతమంది సహచరులు మైసూరులోని నివాస స్థలాల కేటాయింపులో అవకతవకలకు పాల్పడినట్లు కృష్ణ ఆరోపించాడు. కేసారే గ్రామంలో వివాదాస్పద భూమికి బదులుగా పరిహార ప్లాట్లను పార్వతికి కేటాయించడం, ఆ భూమి హక్కు చట్టబద్ధతను అతడు ప్రశ్నించాడు. ఈ కేయింపుల వల్ల రాష్ట్ర ఖజానాకు ఆర్థిక నష్టం కలిగించిందని ఫిర్యాదు చేశాడు.

## ఫ్లోరిడా ఎయిర్‌పోర్టుకు డొనాల్డ్ ట్రంప్ పేరు!



**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** ఫ్లోరిడాలోని పామ్ బీచ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పేరు మారనుంది. దీనికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును పెట్టనున్నారు. ఇందుకు సంబంధించిన బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్ త్వరలోనే దీనిపై సంతకం చేయనున్నారు. తర్వాత ఈ విమానాశ్రయం పేరు మార్పునకు ఫెడరల్ ఏవియేషన్ ఆమోదం కూడా అవసరం. ట్రంప్ నివాసం 'మార్ ఎ లాగో'కు కొద్ది దూరంలోనే ఉన్న ఈ ప్రాంతం ఇసుక బీచ్‌లు, లగ్జరీ ఎస్టేట్‌లకు ప్రసిద్ధి. స్థిరాస్తి వ్యాపారంలో ఉన్న ట్రంప్‌నకు.. ఆయన పేరుతో ప్రపంచ వ్యాప్తంగా అనేక భవనాలున్నాయి. అయితే, అమెరికాలోని ప్రముఖ ప్రాంతాలకు తన పేరు ఉండాలని భావిస్తున్న ట్రంప్.. ఇందుకోసం చాలా ప్రయత్నాలు చేస్తున్నారు.

## జబల్‌పూర్ దుర్గామాత ఆలయంపై దాడి!



**జబల్‌పూర్, ఫిబ్రవరి 20:** మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఉన్న దుర్గామాత ఆలయం పై గురువారం రాత్రి దాడి జరిగింది. దుర్గాపూజ జరుగుతున్న సమయంలో ఆ గుడిపై కొందరు అటాక్ చేశారు. సిహోరా ఆజాద్ చౌక్‌లో ఉన్న ఆలయం గ్రిల్‌ను ఓ వ్యక్తి విరగొట్టాడు. ఆ తర్వాత గుడిని ధ్వంసం చేశారు. మరో వర్గానికి చెందిన వ్యక్తులు రాళ్లు రువ్వారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. గుడి గ్రిల్‌ను ధ్వంసం చేసిన వ్యక్తిని చితకబాదారు. స్థానిక పోలీసులు, సీనియర్ అధికారులు, జిల్లా పోలీసు అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు. గుంపులను చెదరగొట్టే ప్రయత్నంలో టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. గుడిలో పూజ జరుగుతున్న సమయంలోనే సమీపంలో ఉన్న మసీదు లౌడ్‌స్పీకర్ నుంచి నమాజ్ వచ్చినట్లు తెలిసింది. ఆ సమయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది.



# సిఎం స్టాలిన్‌ను కలిసిన పన్నీర్ సెల్వమ్

**చెన్నై, ఫిబ్రవరి 20:** తమిళనాడులో ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఈ క్రమంలో రోజురోజుకీ ఆ రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రం మారిపోతోంది. ఇప్పటివరకు డీఎంకే, అన్నాడీఎంకే మధ్య ద్విముఖ పోరు మాత్రమే ఉండేది. ఇప్పుడు సినీ నటుడు విజయ్ రాజకీయ ఆరంగేట్రంతో ఈ పోరు త్రిముఖ పోటీగా మారింది. తాజాగా మరో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వంను అన్నాడీఎంకే నుంచి బహిష్కరించిన సంగతి తెలిసిందే. ఈరోజు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ ను పన్నీర్ సెల్వం కలిశారు. స్టాలిన్, పన్నీర్ సెల్వం కలయిక తమిళనాట సంచలనం రేపుతోంది. డీఎంకేలోకి పన్నీర్ సెల్వం చేరికకు సర్వం సిద్ధమైందని తెలుస్తోంది. దీనికి సంబంధించే వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. ఈ చర్చల్లో డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, పన్నీర్ సెల్వం కుమారుడు కూడా పాల్గొన్నారు. ఇప్పటికే డీఎంకే నేతృత్వంలోని కూటమిలో దివంగత విజయకాంత్ పార్టీ డీఎండీకే చేరిన విషయం గమనార్హం. మరోవైపు, వీరి సమావేశం జరిగిన తర్వాత అన్నాడీఎంకే ఎమ్మెల్యే అయ్యప్పన్ అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. స్టాలిన్ మళ్లీ సీఎం కావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

# డీగోగార్షియాకోసం ట్రంప్ తహతహ


## అయితే ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంచిన బ్రిటన్

**లండన్, ఫిబ్రవరి 20:** అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్ ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. ఈ వారాంతంలో ఇరాన్ పై అమెరికా దాడి చేయనుందనే ప్రచారం జరుగుతోంది. ఇరాన్ సమీపంలోకి అమెరికా భారీ సంఖ్యలో యుద్ధ విమానాలను తరలించడం ఈ ప్రచారానికి ఊతమిస్తోంది. ఈ నేపథ్యంలో బ్రిటన్ కు చెందిన చాగోస్ దీవుల్లోని డియెగో గార్సియా సైనిక స్థావరాన్ని ఉపయోగించుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుమతి కోరారు. ఇరాన్ పై దాడి చేయాల్సి వస్తే డియెగో గార్సియా స్థావరం అత్యంత కీలకమని ట్రంప్ భావిస్తున్నారు. అంతర్జాతీయ చట్టాలు మరియు ఇతర కారణాల దృష్ట్యా ఈ స్థావరాన్ని ఉపయోగించుకోవడానికి బ్రిటన్ ఇంకా అనుమతి ఇవ్వలేదు. స్టార్మర్ తీరుతో విసిగిపోయిన ట్రంప్ చాగోస్ దీవుల విషయంలో మాటమార్చారు. వాస్తవానికి ఈ దీవిని 99 ఏళ్ల పాటు మారిషస్ కు అప్పగించాలని బ్రిటన్ ఒప్పందం కుదుర్చుకునే ప్రయత్నంలో ఉంది. రెండు వారాల క్రితం ఈ డీల్ ను ట్రంప్ మెచ్చుకున్నారు. తాజాగా ఈ డీల్ అత్యంత చెత్త ప్రయత్నమంటూ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రధాని స్టార్మర్ ఏ కారణం చేతనైనా డియెగో గార్సియాపై పట్టు కోల్పోకూడదు. ఈ భూమిని యూకే నుండి వేరు చేయకూడదని అన్నారు. అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ కూడా ఈ విషయంలో ట్రంప్ తాజా పోస్ట్ ను అమెరికా స్టాండ్ గా భావించాలని స్పష్టతనిచ్చింది. యూకే ప్రభుత్వం ఏమంటోందంటే కోర్టు తీర్పుల వల్ల దీవులపై తమ చట్టపరమైన హక్కులకు విఘాతం కలిగే అవకాశం ఉందని, అందుకే ఈ ఒప్పందం ద్వారానే సైనిక స్థావరం యొక్క భవిష్యత్తును కాపాడుకోగలమని యూకే విదేశాంగ శాఖ చెబుతోంది. ఈ ఒప్పందం ప్రకారం, 99 ఏళ్ల పాటు డియెగో గార్సియా రక్షణ మరియు భద్రతా బాధ్యతలను మారిషస్ బ్రిటన్‌కు అప్పగిస్తుంది. ప్రస్తుతం బ్రిటన్ పార్లమెంటులో ఈ ఒప్పందానికి సంబంధించిన బిల్లు ఇంకా ఆమోదం పొందాల్సి ఉంది.

# ఆరు ఈకామర్స్ సంస్థలకు సిసిపిఎ నోటీసులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దేశంలో నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్ జామర్లు, ఇతర వైర్‌లెస్ పరికరాలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న ఆరు ఈకామర్స్ సంస్థలకు కేంద్ర వినియోగదారుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ) నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వ అనుమతి లేకుండా డ్రోన్ జామర్లు, జీపీఎస్ జామర్లు, యాంటీడ్రోన్ సిస్టమ్స్ వంటి నిషేధిత పరికరాలను విక్రయించడంపై సీసీపీఏ తీవ్రంగా స్పందించింది. ఎవర్‌సే, ఇండియామార్ట్, ఎక్స్ బూమ్, జావియట్ ఏరో స్పేస్, ఎయిర్‌వన్ రోబోటిక్స్, మావెరిక్ డ్రోన్స్ టెక్నాలజీస్ ఉన్నాయి. వినియోగదారుల పరిరక్షణ చట్టం2019తో పాటు, టెలికాం, వాణిజ్య నియంత్రణ చట్టాలను ఉల్లంఘించినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

# గ్రహాంతర వాసుల సమాచారం బహిర్గతం చేస్తా : ట్రంప్



**న్యూయార్క్, ఫిబ్రవరి 20:** అమెరికా ప్రభుత్వం వద్ద ఉన్న గ్రహాంతర వాసుల సమాచారాన్ని బహిర్గతం చేస్తామని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఏలియన్ల సమాచారం ఉన్న ప్రభుత్వ ఫైళ్ల గుర్తించి, విడుదల చేయాలని ఈ మేరకు ఫెడరల్ ఏజెన్సీలకు మార్గదర్శకాలు జారీ చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో గ్రహాంతర వాసుల సమాచారం గురించి మాట్లాడిన నేపథ్యంలో ట్రంప్ సమాఖ్య సంస్థలకు తాజాగా ఈ మార్గదర్శకాలు జారీ చేశారు. దశాబ్దాలుగా అనేకమంది అమెరికన్లు తమ ప్రభుత్వం వద్ద ఉన్న గ్రహాంతర జీవుల సమాచారాన్ని తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని ట్రంప్ అన్నారు. అందుకే వాటికి సంబంధించిన ముఖ్యమైన.. ఆసక్తికరమైన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల ఎ పాడ్‌కాస్ట్‌లో ఒబామా గ్రహాంతర వాసుల ఉనికి గురించి మాట్లాడుతూ ఓ రహస్య విషయాన్ని వెల్లడించారని ట్రంప్ మండిపడ్డారు. ఆయన అలా చేసి ఉండకూడదన్నారు. అయితే ఒబామా చెప్పిన రహస్యం ఏమిటనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. గత వారం ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ఒబామా ఏదో ఒక గ్రహంపై గ్రహాంతర వాసులు ఉండే విషయాన్ని తాను బలంగా నమ్ముతున్నానని అన్నారు. కానీ.. ఏలియన్స్‌ను అమెరికాలోని నెవాడలో ఉన్న అత్యంత రహస్య ప్రాంతం 'ఏరియా 51'లో యుఎస్ ప్రభుత్వం నిర్బంధించిందనే ఊహాగానాల్లో నిజం లేదని పేర్కొన్నారు. గ్రహాంతర వాసుల ఉనికికి సంబంధించిన పలు రికార్డులు అమెరికా ప్రభుత్వం దగ్గర ఉన్నట్లు తను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా సమాచారం లేదన్నారు. తనకు తెలిసినంత వరకు ఏరియా 51లో ఎటువంటి భూగర్భ కేంద్రాలు లేవని.. ఒకవేళ ఉన్నా అవి ఎక్కడ ఉన్నాయో తెలియవని అన్నారు.

# గిరిజన సంక్షేమానికి రూ.9,190 కోట్లు

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు నరహరి వరప్రసాద్ ప్రశంస**



విజయవాడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర వార్షిక బడ్జెట్ 2026-27లో గిరిజన సంక్షేమానికి రూ.9,190 కోట్లు కేటాయించడంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు కొండారెడ్డి నరహరి వరప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. గిరిజనుల అభ్యున్నతి పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు ఇది నిదర్శనమని ఆయన కొనియాడారు. వరప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ ఈ భారీ కేటాయింపు గిరిజన సమాజం ఆర్థిక, విద్యా, సామాజిక రంగాలలో గణనీయమైన మార్పు తీసుకురావడానికి దోహదపడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ సువర్ణ పాలన గిరిజన ముఖచిత్రాన్ని మార్చివేస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. గిరిజనుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి పట్ల వారి దృఢ సంకల్పం అభినందనీయమన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా సదుపాయాల విస్తరణ, విద్యార్థులకు హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఆరోగ్య సేవలు, రహదారులు, తాగునీరు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం గిరిజనుల భవిష్యత్తును బలోపేతం చేసే కీలక నిర్ణయమని వరప్రసాద్ అభిప్రాయపడ్డారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలని, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సర్పంచ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త

**15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి అనుమతినిస్తూ ఉత్తర్వులు**

విజయవాడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి అనుమతినిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారికంగా ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపు ప్రక్రియ వేగవంతం కానుంది. జనవరి 5వ తేదీన గ్రామ పంచాయతీలు చేసిన తీర్మానాల ఆధారంగా ఈ నిధులను వినియోగించుకోవాలని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించిన వివరాలను మెజర్‌మెంట్ పుస్తకాలలో నమోదు చేసి ఉంటే, ఆ బిల్లులను చెల్లించవచ్చని తెలిపింది. గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉండటంతో సర్పంచ్‌లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో, 15వ ఆర్థిక సంఘం నిధులను వాడుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం వారికి ఊరట కలిగించే అంశం. ఈ నిర్ణయంతో పంచాయతీల్లో నిలిచిపోయిన చెల్లింపులకు మార్గం సుగమం అయినట్లయింది.

# పిఎసిఎస్ ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయండి

**- సిపిఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు**

విజయవాడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రాథమిక పరపతి సంఘాల (పిఎసిఎస్) ఉద్యోగులకు 2019, 2024 వేతన సవరణలను వెంటనే అమలు చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఆయన శుక్రవారం ఎపి సిఎంకు లేఖ రాశారు. పిఎసిఎస్ ఉద్యోగులకు వేతన సవరణ అమలు చేయడం లేదని అన్నారు. వేతన సవరణ చేయాలని, గ్రాట్యూటీ చెల్లించాలని, 2019 తర్వాత జాయిన్ అయిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలన్న వారి డిమాండ్లు న్యాయమైనవని పేర్కొన్నారు. సుదీర్ఘ కాలంగా వారికి వేతనాలను పెంచకపోవడం సరికాదని అన్నారు. పిఎసిఎస్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతంలో రైతాంగానికి సేవలందిస్తున్నారని అన్నారు. వీరి సమస్యలను గత ప్రభుత్వాలు పరిష్కరించకుండా ఏళ్ల తరబడి తాత్సారం చేశాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా సమస్యలు పరిష్కరించకపోవడంతో వీరు ఆందోళన బాట పట్టక తప్పలేదని అన్నారు. దాదాపు 3 నెలలుగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల సమ్మె నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సిఎం చొరవ తీసుకుని ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించి వెంటనే వేతన సవరణ జరిగేలా చూడాలని కోరారు. ఇతర సమస్యలు పరిష్కరించేలా సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

**నిందితులను తప్పించేందుకు లంచం...**

# కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసిన సిపి

విజయవాడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి పోలీసు స్టేషన్‌లో ఓ కేసులో నిందితులుగా పేర్లు చేర్చకుండా ఉండేందుకు డబ్బులు డిమాండ్ చేసిన వ్యవహారంలో కానిస్టేబుల్ సస్పెండ్ అయ్యాడు. ఎస్.ఐ ఉమామహేశ్వరరావుపై శాఖపరమైన విచారణకు పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు ఆదేశించారు. వత్సవాయి పోలీసు స్టేషన్ పరిధిలోని గోపినేనిపాలెంలో ఇటీవల బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు. అయితే ఈ కేసులో నిందితుడి సోదరుడు, అతని స్నేహితులను ఎస్ఐ నిత్యం స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారు. ఈ కేసు నుంచి బయటపడేందుకు ఎస్ఐకు రూ.50,000 ఇచ్చేందుకు అంగీకరించి, సమాచారాన్ని ఎసిబికి అందించారు. లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు అవినీతి నిరోధక శాఖ అధికారులు పకడ్బందీగా పథకం వేశారు. ఈ మేరకు లంచం ఇచ్చేందుకు నిందితుడి తండ్రి ఎస్ఐ వద్దకు వెళ్లాడు. ఇప్పుడే వస్తానని ఎస్ఐ బయటకు వచ్చాడు. ఆ సమయంలో స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ బయట ఉన్న తన బ్యాచ్‌కు చెందిన ఎసిబి కానిస్టేబుల్‌ని గుర్తుపట్టాడు. అనుమానంతో వెంటనే ఎస్ఐకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఎస్ఐ ఉమామహేశ్వరరావు స్టేషన్ నుంచి హుటాహుటిన బయటకు వెళ్లిపోయారని తెలిసింది. లంచం డిమాండ్ చేసి ఎసిబి ట్రాప్ నుంచి తప్పించుకున్న ఉదంతంపై సిపి రాజశేఖరబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ వ్యవహారంపై లోతుగా విచారణ చేసి, ఎస్ఐ ఉమామహేశ్వరరావు, కానిస్టేబుల్ కొండలరావుపై నివేదిక ఇవ్వాలని గ్రామీణ డిసిపి లక్ష్మీనారాయణను సిపి ఆదేశించారు. దీంతో హుటాహుటిన డిసిపి లక్ష్మీనారాయణ నందిగామ ఎసిపి కార్యాలయానికి వచ్చి విచారణను చేపట్టారు. కేసు వివరాలను పోగుచేసి పరిశీలించారు. ఆ తర్వాత బాధితుల నుంచి వివరాలను సేకరించారు. ప్రాథమికంగా కానిస్టేబుల్ పాత్ర నిర్ధరణ అయింది. అయితే ఎస్ఐకు డబ్బులు ఇస్తే పేర్లు చేర్చరని చెప్పినట్లు తెలిసింది. దీంతో డిసిపి సిఫార్సు మేరకు పోలీసు కమిషనర్ కానిస్టేబుల్ కొండలరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఎస్ఐ పాత్ర గురించి సైతం విచారణ సాగుతోంది. వత్సవాయి పోలీసు స్టేషన్‌లోని సిసి కెమెరాల్లోని దృశ్యాలను సైతం అధికారులు పరిశీలిస్తున్నారు.

# 'బాలాజీ రిజర్వాయర్'కు మోక్షమెప్పుడు?

**- టిటిడి బోర్డు నిర్ణయంపైనే అందరి ఆశలు**



తిరుపతిలో బాలాజీ రిజర్వాయర్‌కు కేటాయించిన స్థలం

తిరుమల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ వైకుంఠం తిరుమలకు తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి 'బాలాజీ రిజర్వాయర్' నిర్మాణం అవసరమనే ప్రతిపాదనలు రానున్న టిటిడి వార్షిక బడ్జెట్‌లో రూపుదాల్చుతుందా అనే ప్రశ్నలు అటు టిటిడి వర్గాల్లో ఇటు తిరుమల స్థానికుల్లో బలంగా వ్యక్తమవుతున్నాయి. పది, పదిహేనేళ్ళక్రిందట తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో తిరుమలలో తాగునీటికి సమస్య ఎదురైంది. జలాశయాల్లో నీరు దాదాపు అడుగంటింది. ఆ సమయంలో కల్యాణిడ్యామ్ ద్వారా తిరుమలకు నీటిని పంపింగ్ చేసుకుని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు నిధులు మంజూరుచేసింది. అప్పుడే తిరుమల పుణ్యక్షేత్రంకు శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారంపై 2014వ సంవత్సరంలోనే అధికారులు ఆలోచన చేశారు. అందుకు తగ్గట్లు అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ఆ దిశగా సానుకూలంగా స్పందించి, అప్పటి టిటిడి బోర్డు కూడా బాలాజీ రిజర్వాయర్ నిర్మాణం అవసరమని తీర్మానించింది. ఇందుకు అవసరమైన నిధులు విడుదల చేసి పనులు కూడా 2018లోనే 350కోట్ల రూపాయల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ పనులు అప్పట్లోనే మొదలు పెట్టింది. కొన్నినెలలు వేగంగా సాగింది. ఆ తరువాత 2019లో రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, వైసిపి ప్రభుత్వం ఏర్పాటుతో గ్రహణం పట్టింది. చివరకు 2023లో అప్పటి టిటిడి బోర్డు కూడా మళ్ళీ నీటిసమస్య పరిష్కారానికి బాలాజీ రిజర్వాయర్ పనులు పున:ప్రారంభించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. కానీ కేవలం క్షేత్రస్థాయిలో రిజర్వాయర్‌ను సందర్శించి మిన్నకుండిపోయారు. అయినా ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. తిరిగి 2024లో రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. గత రెండేళ్ళుగా తిరుమలకు శాశ్వతనీటి సమస్య పరిష్కారం దిశగా ఆలోచన మాత్రం చేయలేదు. సిఎం చంద్రబాబు అటు చిత్తూరు, ఇటు తిరుపతి జిల్లావాసులకు తాగు, సాగునీటిని తీసుకురావడానికి అపర భగీరథుడులా కృషి చేస్తున్నారు. మరీ తిరుమల పుణ్యక్షేత్రానికి శాశ్వతనీటి సమస్య పరిష్కార దిశగా ఆలోచన చేయాలని తిరుమల వాసులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మళ్ళీ ఇప్పుడు టిటిడి బోర్డు బిఆర్ నాయుడు ఆధ్వర్యంలో కొనసాగుతోంది. తిరుమలలో సౌకర్యాల మెరుగుపరచడం, ప్రధాన అవసరాలపై అధికారులతో కలసి ముందుకు కదులుతున్నారు. రానున్న 2026-27 టిటిడి వార్షిక బడ్జెట్‌లో బాలాజీ రిజర్వాయర్‌కు మోక్షం కలిగించేందుకు ప్రాధాన్యత చూపాలనేది టిటిడి వర్గాల్లో కూడా అభిప్రాయం. తిరుమలలో తాగునీటి అవసరాలకు ఐదు ప్రధాన జలాశయాలు ఉన్నాయి. 1287.51లక్షల గ్యాలన్ల నీటినిల్వ సామర్థ్యం ఉంది. రోజుకు 45నుండి 50 లక్షల గ్యాలన్ల వరకు నీటివాడకం ఉంది. ఇప్పటి పరిస్థితుల్లో ఐదు జలాశయాల్లో ఉన్న నీరు ఆరునెలల వరకు సరిపడేలా నిల్వ ఉంది. రానున్న రెండు నెలల్లో సకాలంలో వర్షాలు కురవకపోతే మళ్ళీ నీటిసమస్య ఎదురయ్యే పరిస్థితి ఉందనేది కూడా టిటిడిలో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో టిటిడి బోర్డు తిరుమలకు శాశ్వతనీటి సమస్య పరిష్కారంపై దృష్టి సారించాల్సి ఉంది. గతంలో 2015లోనూ తిరుమలలో నీటిఎద్దడి ఎదుర్కొన్నారు. 2018లో కూడా నీటి సమస్య ఎదురైనపుడు బాలాజీ రిజర్వాయర్ నిర్మాణంపై అప్పటి టిటిడి బోర్డు ఆలోచనలకే పరిమితమైంది. భవిష్యత్తులో తిరుమలకొండపై నీటి సమస్య తలెత్తకుండా, శాశ్వత పరిష్కారానికి ప్రత్యామ్నాయంగా బాలాజీరిజర్వాయర్ ప్రధానమని భావించారు. 1టిఎంసి నీటిని తిరుమల తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలనేది టిటిడి అధికారుల ఆలోచన.

**శాశ్వత నీటి సమస్య పరిష్కారానికే...**

శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం వస్తున్న భక్తుల తాగునీటి అవసరాలకు వర్షాభావ పరిస్థితుల్లోనూ నీటిసమస్య తలెత్తకుండా శాశ్వత సమస్య పరిష్కారానికి అటు రాష్ట్రప్రభుత్వ నీటిపారుదలశాఖ, ఇటు టిటిడి అధికారులు ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే తిరుపతికి సమీపంలోని రేణిగుంట మండలం కరకంబాడి గ్రామం వద్ద బాలాజీ రిజర్వాయర్‌ను చేపట్టాలని ఆలోచన చేశారు. ఆ ఆలోచనతో ఈ రిజర్వాయర్ పనులు చేపట్టేందుకు శేషాచలం అటవీప్రాంతంలో రిజర్వు ఫారెస్టు అనుమతులు అవసరమయ్యాయి. ఈ అనుమతుల కోసం చాలాకాలం కేంద్ర ప్రభుత్వం నుంచి వేచిచూడాల్సి వచ్చింది. 2014లో తెలుగుదేశం ప్రభుత్వంలోని పాలకమండలి బాలాజీరిజర్వాయర్ నిర్మాణానికి అనుమతులు తీసుకుని మొదలుపెట్టింది. అయితే పూర్తిస్థాయిలో పనులకు శ్రీకారం పడలేదు. కరకంబాడి వద్ద ఈ రిజర్వాయర్‌ను 3.082 టిఎంసిల నీటి సామర్థ్యంతో నిర్మిస్తే 1టిఎంసి తిరుమల తాగునీటి అవసరాలకు మరో 2టిఎంసిల నీటిని మల్లెమడుగు ప్రాజెక్టుకు పంపి అటు తాగునీరు ఇటు 55వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే అవకాశం ఉంటుందనేది అధికారుల ప్రతిపాదనలు.

నీటిఎద్దడి తీవ్రరూపం దాల్చినా ఈ రిజర్వాయర్ నుండిమల్లి మడుగు మీదుగా కల్యాణిడ్యామ్‌కు తరలించి 35 కిలోమీటర్లు మేర క్యాచ్‌మెంట్ ఉంటుందని, తిరుమలకు లక్షమందికిపైగా భక్తులు చేరినా, 1టిఎంసి నీరు నిల్వ ఉంటుందని, అవసరమైన సమయంలో పంపింగ్ చేసుకునేందుకు వీలుగా ఉంటుందని భావించారు. టిటిడి బోర్డు రానున్న బడ్జెట్ సమావేశంలో తీసుకునే నిర్ణయంపైనే కీలకంగా ఆధారపడి ఉంది.

# పీలేరులో చిన్నారిపై లైంగిక దాడి



పీలేరు ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: పీలేరు మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకున్న ఐదేళ్ల చిన్నారిపై లైంగికదాడి అత్యాచారయత్నం కలకలం సృష్టించింది. అంతకుముందు రెండు రోజుల కిందట మదనపల్లిలో చోటుచేసుకున్న ఏడేళ్ల చిన్నారి అత్యాచారం హత్య కేసు మరవకముందే పీలేరులో ఈ సంఘటన చూసుకో చోటు చేసుకోవడం తీవ్ర చర్చినియాసం అయింది. పీలేరు మండలం మదనపల్లె మార్గంలోని ఓ కాలనీలో మేస్త్రీ పనులు చేసుకుంటున్న వారి కుమార్తె(5)ఇంటి పరిసరాలు ఆడుకుంటుండగా మేస్త్రి వెంట కూలీ పనులకు వచ్చిన పదహారేళ్ల మైనర్ బాలుడు మాయమాటలు చెప్పి ఈ బాలికను నిర్మాణంలో ఉన్న ఒక ఇంటిలోకి తీసుకెళ్లాడు. అక్కడ ఈ బాలికపై ఉచితంగా ప్రవర్తిస్తూ ఉండడాన్ని స్థానికులు గుర్తించారు ఈ విషయాన్ని బాలిక తల్లికి చెప్పడంతో ఆమె వచ్చి గట్టిగా కేకలు వేసింది. స్థానికులు మైనర్ బాలుడిని పట్టుకుని చితకబాదారు. అటు నుంచి తప్పించుకుని పరారయ్యాడు. సమాచారం అందుకున్న పీలేరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. ఇదే విషయమై శుక్రవారం సిఐ యుగంధర్ ఆధ్వర్యంలో సంఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లి బాలికను విచారించి వివరాలు నమోదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై ఫోక్సో, అత్యాచారయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడిని పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపట్టామని సిఐ వివరించారు.

# పెట్టుబడుల పేరుతో భారీ మోసం

**● పోలీసులు దర్యాప్తులో బయటపడ్డ బెట్టింగుల కోణం ● ఇద్దరు అరెస్ట్ ● రూ. కోటిన్నరకు పైగా నగదు సీజ్**



నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: ఇన్వెస్ట్మెంట్ పేరుతో ప్రజలను మోసగిస్తున్నఇద్దరు ముద్దాయిలను బాలాజీ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో ఆ ఇద్దరు ఆన్లైన్ బెట్టింగ్ యాప్ లు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనలో భారీ మొత్తంలో నగదును స్వాధీనం చేసుకోవడం విశేషం. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల వెల్లడించారు. ఆమె తెలిపిన సమాచారం మేరకు, స్థానిక ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఓ బాధితుడు ఈనెల 19వ తేదీ తనకు బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన వేణు అను అతను పరిచయం అయి ఇన్వెస్ట్మెంట్ పేరుతో అధిక లాభాలు పొందవచ్చని మాయమాటలు చెప్పి, సుమారు రూ.53 లక్షలు ఇన్వెస్ట్ చేయించాడు. ఎన్ని సార్లు అడుగుతున్నా నగదు ఇవ్వకుండా, మభ్యపెడుతూ ముద్దాయి పలువిధాలుగా బెదిరిస్తున్నట్లు, మోసపోయానని గ్రహించి బాలాజీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిర్యాది ఇచ్చిన రిపోర్ట్ మేరకు బాలాజీ నగర్ పోలీస్ వారు కేసు నమోదు చేసారు.

**కేసు ఛేదన:** జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు, అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్. సౌజన్య సూచనల మేరకు, టౌన్ ఏఎస్పీ దీక్ష పర్యవేక్షణలో, బాలాజీ నగర్ సిఐ సాంబశివరావు తన సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, ముద్దాయి కోసం బుచ్చిరెడ్డిపాలెంకు వెళ్లి పరిశీలించగా, అక్కడ ముద్దాయిలు కూసెట్టి వేణు, బిట్ర వెంకటరమణ వెంకటరమణలు, తమ బంధువులతో కలిసి ఆర్ 777యుఎస్ అనే లింక్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ ఆడిస్తున్నట్లు గుర్తించారు. ముద్దాయిలను విచారించగా, వేణు మరికొందరు ఆర్గనైజర్లుగా ఉంటూ, వెంకటరమణ నగదును తీసుకొని వచ్చి ఆర్గనైజర్లకు ఇస్తున్నట్లు వెల్లడైంది. అంతే కాకుండా ఎవరైనా బెట్టింగ్ ఆడే వారు వారి వద్దకు వచ్చి గొడవ చేస్తే వారిని కత్తులతో భయపెట్టి, బెదిరిస్తున్నట్లు వెల్లడైంది. ముద్దాయిల వద్ద నుండి రూ. 34,65,800 నగదు, ఒక ల్యాప్టాప్, టీవీ, రెండు కత్తులు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే వారి బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 1,64,74,600 నగదును ఫ్రీజ్ చేయించారు. ఈ కేసులో మిగిలిన ఆర్గనైజర్ లను కూడా త్వరలో అరెస్ట్ చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. అధిక లాభాలు వస్తాయని చెప్పి ఇన్వెస్ట్మెంట్ పేరుతో మోసం చేసే వారి మాటలకు ప్రజలు లోనుకావద్దని ఎస్పీ హితవు పలికారు. క్రికెట్ బెట్టింగ్ ఆడినా, నిర్వహించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇన్వెస్ట్మెంట్, బెట్టింగ్, జూద కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112 కు తెలియజేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ముద్దాయిలను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనపరచిన బాలాజీ నగర్ సీఐ కె. సాంబశివ రావుని, యస్.ఐ పి. విజయ్ శ్రీనివాస్, హెచ్‌సిలు కేవీ సుధాకర్, సిహెచ్ రమేష్, జయరామయ్య, శివకుమార్, కానిస్టేబుళ్లు శ్రీహరి, పార్థసారధి, సాయి కిషోర్, లాజర్ లను ఉన్నత అధికారులు అభినందించారు.

# శాస్త్రోక్తంగా శ్రీకాళహస్తీశ్వరుని వసంతోత్సవం



శ్రీకాళహస్తీశ్వరాలయంలో వసంతోత్సవ కార్యక్రమాల్లో అభిషేకిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాల యంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆలయంలో ధ్వజావరోహణ కార్యక్రమాలు సాయంత్రం ప్రారంభించారు. ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా యాగశాలలో ఏర్పాటు చేసిన కలశాలకు ఆలయ అభిషేక ప్రధాన గురుకుల్ డాక్టర్ స్వామినాధన్ ప్రత్యేక పూజలు జరిపారు. తరువాత స్వామి గర్భగుడి ఎదురుగా శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అక్కడ ఏర్పాటు చేసిన హోమాలు, కలశాల్లోని నీటితో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు అభిషేకాలు జరిపారు. తరువాత స్వామి అమ మ్మవార్లను కేడియం వాహనంలో ఊరేగింపుకు అలంకార మండపంలో రాజేష్ గురుకుల్, సూరి గురుకుల్‌లు చక్కగా ముస్తాబు చేసారు. అక్కడ నుంచి ఆలయ సంప్రదాయం ప్రకారం పాతాళ వినాయక ఆలయం నుంచి శివయ్యగోపురం గుండా రాజగోపురం నుంచి స్వామి అమ్మవార్లను వాహనాల మండపం వద్దకు చేర్చారు. అక్కడ స్వామివారిని బోయిలు, ఆలయాధికారులు ఆర్చకులు మేళతాళాలు మంగళవాయి ద్యాలతో ఊరేగింపు తీసుకొచ్చారు. జలవినాయక ఆలయం ఎదురుగా ఉన్న వసంత మండపంలో స్వామి అమ్మవార్లను ప్రతిష్టించారు. వసంతోత్సవాన్ని సాగించారు. స్వామి అమ్మ వార్లకు సూర్యపుష్కరిణి నుంచి నీటిని తెచ్చి అభిషేకించారు. తరువాత షోడశాభిషేకాలు నిర్వహించారు. ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, పర్యవేక్షకుడు నాగభూషణం యాదవ్, దఫేదార్ రాజాలు సాగించారు.

**ధ్వజావరోహణం:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆలయంలో ఈ నెల 11 ధ ్వజారోహణకు సంబంధించి ధ్వజస్థంభంపై అధిరోహించిన భక్తులు సమర్పించిన చీరలను మళ్ళీ భక్తులకు చేర్పించుటకు ధ్వజావరోహణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకులు సారథ్యంలో నిర్వహించారు. వేదపండితులు వేద మంత్రాలను చదువుతుండగా ఆలయ సంప్రదాయం మేరకు ఉత్సవాలను నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అభిషేకం నైవేద్యం సమర్పించి ధ్వజావరోహణ కార్యక్రమాలను జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి ప్రారంభించగా, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శనం, వెంకటస్వామి, నాగభూషణం యాదవ్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, బోర్డు సభ్యులు వాకచర్ల గురప్పశెట్టి దంపతులు, మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది ఉత్సవాలు శనివారం రాత్రి పల్లకి సేవతో ముగుస్తాయి.

# గంజాయితో ఏడుగురు అరెస్ట్


బొబ్బిలి (విజయనగరం జిల్లా), ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: బొబ్బిలి మండలంలోని పలు గ్రామాల్లో గంజాయి అమ్ముతున్న పలువురు నిందితులపై ఉక్కు పాదం మోపుతున్నామని డీఎస్పీ భవ్య రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బొబ్బిలి డీఎస్పీ భవ్య రెడ్డి మాట్లాడుతూ గురువారం మండలంలో కోమటిపల్లి గ్రామంలో ఏడుగురు గంజాయి నిందితులను అదుపులోకి తీసుకున్నామని తెలియజేశారు. నాలుగు కేజీల ఏడు గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నా మన్నారు సీతానగరం చెందిన వీరికి గంజాయి సరఫరా చేస్తున్నట్టు తెలిసిందన్నారు. కోమటిపల్లి గ్రామంలో ఉన్న భాస్కర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీలకు సరఫరా చేస్తున్నట్లు తెలియజేశారన్నారు. బిఎస్సి చట్టం ప్రకారంగా వీరిని అరెస్ట్ చేసి కేసును నమోదు చేసినట్లు డీఎస్పీ తెలియజేశారు. పాపారాయి కాలేజీల్లో కోటిపల్లి గ్రామానికి చెందిన ఒక తెలుగుదేశం నాయకులు కుమారులు టీజింగ్ పాల్పడుతూ పట్టుపడ్డారని తనదైన శైలిలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని అన్నారు. వీరిపై తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ నారాయణరావు, ఎస్సై రమేష్, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

**సోలార్ వినియోగదారులకు**

# చక్కని అవకాశం

నెల్లూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త-వైద్యం: ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని సోలార్ విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబరు 1912 ను సంప్రదించవచ్చని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ శివశంకర్ లోతేటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు కాల్ సెంటర్‌కి కాల్ చేయడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కాల్ సెంటర్లో సోలార్ సంబంధిత ఫిర్యాదులను కూడా నమోదు చేసే సౌకర్యాన్ని నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. వినియోగదారులు ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్(ఐవీఆర్ఎస్) ద్వారా ఫోన్ / మొబైల్ స్క్రీన్‌పై 5 అంకెలను నొక్కి సోలార్ విద్యుత్ ఫిర్యాదులను నమోదు చేయవన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా నిర్దిష్ట సమయంలోగా సంబంధిత సోలార్ పరికరాల విక్రేత సమస్యను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమస్యను పరిష్కరించిన వెంటనే వినియోగదారునికి ఫీడ్ బ్యాక్ కాల్ చేయబడుతుందని, ఫీడ్ బ్యాక్‌కు అనుగుణంగా ఫిర్యాదును మూసివేయడం/ తెరవబడడం జరుగుతుందన్నారు.

# ఉత్సవర్లకు ముత్యాల కవచాలు వితరణ



ఆలయ ఇఓ బాపిరెడ్డికి ముత్యాల కవచాలను అందించిన హైదరాబాదు వాసులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ దేవి, వాయులింగేశ్వరుడు, పరివార దేవతలకు హైదరాబాదుకు చెందిన దాతలు ముత్యాల కవచాలను బహూకరించారు. శుక్రవారం హైదరాబాదుకు చెందిన అలంకార ట్రస్టు, శ్రీరంగ ఎంటర్‌ప్రైజెస్ సారథ్యంలో ట్రస్టు ఫౌండర్స్ రాఖీరాజేష్ గంగ పుత్ర, ప్రియాంక సుధీర్ చౌహాన్, రాధాకృష్ణన్ నంబగాళీ గాయత్రి సతీష్ అమ్లే, రేఖా తులసీ దాస్ చౌహాన్‌లు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేక గురుకుల్ సురేష్‌తో తాము స్వామి అమ్మవార్లు, పరివార దేవతలకు వితరణ చేయాలని కోరారు. వారు దాతలను ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి వద్దకు తీసుకురాగా వారు ఉత్సవర్లకు ప్రత్యేక అలంకరణగా ఉండే ముక్తాంగి (ముత్యాల కవచం)ను బహూకరించారు. వాటి అలంకారంతో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు ప్రత్యేక కళ ఉంటుందని వివరించారు. వారికి ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం, వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. దాతలతో పాటు ఆలయ అలంకార గురుకుల్స్ రాజేష్ సూరి, ఎఇఓ హేమామాలిని పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల కట్టడికి అస్త్రం 'ఎరైవ్ ఎలైవ్'




(ఫైల్ ఫోటో)

విజయవాడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: రోడ్డు ప్రమాదాల కట్టడికి విజయవాడ పోలీసు కమీషనరేట్ కొత్త అస్త్రం ఉపయోగించనున్నది. ఇందులో భాగంగా "ఎరైవ్ ఎలైవ్" కార్యక్రమాన్ని చేపట్టింది. మార్చి 1వ తేదీ నుంచి దీన్ని అమలు పరిచేందుకు ట్రాఫిక్ పోలీసు విభాగం ఏర్పాటు చేసారు. పోలీసు అధికారులు మద్యాన్ని తాగిన వాహనదారులపై కేసులను నమోదు చేసేవారు. అక్కడితో ఆగకుండా కౌన్సెలింగ్, జరిమానాలను సైతం విధించేవారు. దీంతో డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారికి ప్రతికూలత భావన ఉండేది. అందుకే ఈ విధమైన తప్పుడు భావనను పోగొట్టేందుకు నగర పోలీసులు విప్లవాత్మకమైన ప్రయోగానికి రంగాన్ని సిద్ధం చేస్తున్నారు. ప్రమాదాలను అరికట్టడమే ప్రధాన లక్ష్యంగా ఇటీవల 'ఎరైవ్ ఎలైవ్' అనే కార్యక్రమాన్ని పోలీసులు వినూత్నంగా చేపట్టారు. దీన్ని అనుసరించి ప్రతిరోజు విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై ఇబ్రహీంపట్నం, జి.కొండూరు పోలీసు స్టేషన్ల పరిధిలోని ఉన్న దాదాపు 10 నుంచి 15 ప్రాంతాల్లో తనిఖీలు, అదేవిధంగా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. దీని ప్రకారం అతి వేగంతో వాహనాలను నడపడం, మద్యం మత్తు కారణంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు ఓ ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు వాహనాలను నడిపినట్లయితే వారి ఉద్యోగాలకు స్వస్తి తప్పదనే సంకేతాలను స్పష్టంగా పంపనున్నారు. అందులో భాగంగానే విజయవాడ నగర సిపి రాజశేఖరబాబు, ట్రాఫిక్ డిసిపి షరీనా బేగం ఆదేశాలతో మార్చి 1వ తేదీ నుంచి దీనిని అమలు చేసేందుకు అధికార పోలీసు యంత్రాంగం విస్తృతంగానే ఏర్పాట్లు చేస్తోంది. అయితే తనిఖీల్లో చిక్కిన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల సమాచారాన్ని అదే విధంగా వారు విధులు నిర్వహిస్తున్న సంస్థల నుంచి చిరునామాలను క్రోడీకరించినట్లు ట్రాఫిక్ విభాగ అధికారులు వివరిస్తున్నారు. ఎక్కువ శాతం మందిలో తాము ఎంత మద్యాన్ని తాగినా సరే వాహనాన్ని సమర్థంగా నడుపుతామనే ధీమా అనేది ఉంటుందని సిఐ చంద్రశేఖర్ అన్నారు. అయితే ఆ మత్తు ప్రభావం మాత్రం మెదడుపై తీవ్రంగా ఉంటుందన్న అవగాహన మాత్రం ఉండదని ఆయన తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చిక్కితే వారి వివరాలు ఆయా సంస్థల అధిపతులకు చేర్చాలని పోలీసు ఉన్నత అధికారులు యోచిస్తున్నారని వివరించారు. దీన్ని అమలు చేసినట్లయితే మాత్రం తమ ఉద్యోగం, పరువు ప్రతిష్ఠలు పోతాయనే భయంతోనైనా మద్యం తాగి వాహనాన్ని నడపకుండా ఉంటారని ఈ సందర్భంగా సిఐ చంద్రశేఖర్ తెలిపారు.

# సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం భేటీ



- జిఎడి, హెచ్ఓడి టవర్లలో శాఖలవారీగా అవసరమైన స్థలం కేటాయింపుపై చర్చ
- తెలంగాణ, ఛత్తీస్‌గడ్ సెక్రటేరియట్‌లనూ పరిశీలించాలని నిర్ణయం
- శాఖలవారీగా కోఆర్డినేటర్లను నియమించి అభిప్రాయాలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు

విజయవాడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతిలో నిర్మించే ఐకానిక్ భవనాల్లో ఏ శాఖకు ఎంతెంత కేటాయించాలని దానిపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది.రాజధానిలో సాధారణ పరిపాలన శాఖ టవర్ తో పాటు నాలుగు బీవీడీ టవర్లను ప్రభుత్వం నిర్మిస్తుంది. ఈ టవర్లను ఐకానిక్ భవనాలుగా నిర్మించేలా ప్రభుత్వం డిజైన్లు రూపొందించింది. ఇప్పటికే పనులు కూడా ప్రారంభం అయ్యాయి. గతంలో సెక్రెటేరియట్ లో కేవలం ముఖ్య కార్యదర్శుల తో పాటు ఆయా శాఖలకు చెందిన సెక్షన్ల మాత్రమే ఉండేవి.కానీ కొత్తగా నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల్లో సెక్రటేరియట్ విభాగాలతో పాటు శాఖాధిపతుల కార్యాలయాలు, కార్పొరేషన్ కార్యాలయాలు కూడా ఒకేచోట ఉండేలా నిర్మాణం చేస్తున్నారు..అంటే రాష్ట్ర స్థాయి కార్యాలయాలు చెందిన అన్ని విభాగాలు ఒకే చోట ఉంటాయన్న మాట.. దీనికోసం ఏ శాఖకు ఎంత స్థలం అవసరం అవుతుంది అనే దానిపై నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం నియమించింది. మంత్రులు నారాయణ,పయ్యావుల కేశవ్,మనోహర్, బాల వీరాంజనేయ స్వామి, బీసీ జనార్దన్ రెడ్డి,సత్య కుమార్ సభ్యులు గా ఉన్నారు. ఈ కమిటీ మొదటి సమావేశం ఐదో సెక్రటేరియట్ లోని రెండో బ్లాక్ లో జరిగింది. సమావేశం ముగిసిన తర్వాత మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. సబ్ కమిటీ సమావేశంలో ఐకానిక్ భవనాల నిర్మాణం, పార్కింగ్ సదుపాయాలు వంటి అంశాలతో పాటు రాష్ట్ర స్థాయి ఉద్యోగులు ఎంతమంది ఉన్నారనే దానిపై చర్చించినట్లు మంత్రి చెప్పారు. శాఖల వారీగా ఉద్యోగుల వివరాలు, వారికి కావాల్సి న స్థలం, సదుపాయాలపై చర్చించాలని అధికారులకు ఆదేశించా మన్నారు. 2014-19 మధ్యలో 52.72 లక్షల చ.అ.బిల్టప్ ఏరియాతో భవనాలు డిజైన్ చేసామని, దీంట్లో 31.71 లక్షల చ.అ. విస్తీర్ణంలో కార్పెట్ ఏరియాలో ఉంటుందన్నారు...అయితే ప్రస్తుతం ఉన్న అవసరాలపై పూర్తిగా అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాలని సీఎం చంద్రబాబు కేబినెట్ సబ్ కమిటీ నియమించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం మొత్తం 39,882 శాంక్షన్ పోస్టులు ఉన్నాయన్నారు. అయితే ఖచ్చితమైన లెక్కల కోసం ప్రతి డిపార్ట్ మెంట్ నుంచి ఒకరిని నామినేట్ చేయాలని సిఎస్ ను కోరుతా మన్నారు. 2014-19లో 26,700 మంది ఉద్యోగులు ఉంటారని, దానికి తగినట్టుగా భవనాలు డిజైన్ చేసామని మంత్రి నారాయణ చెప్పారు. మరోవైపు ఇటీవల కొత్తగా నిర్మించిన నయారాయ పూర్, హైదరాబాద్‌లోని సచివాలయాలను కూడా పరిశీలించాలని అధికారులకు ఆదేశించామన్నారు. వచ్చే సోమవారం మరోసారి కేబినెట్ సబ్ కమిటీ సమావేశమై ఆయా అంశాలపై చర్చిస్తామని మంత్రి నారాయణ చెప్పారు. ఈ సమావేశంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అమరావతి గ్రోత్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కొంత శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల ఆస్తుల రక్షణే ధ్యేయంగా రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలు



- వివాదాలు ఆస్కారం లేకుండా బ్లాక్ చైన్ టెక్నాలజీ
- భూ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

విజయవాడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: శాసనసభలో శుక్రవారం రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్, విపత్తు నిర్వహణ పద్దు కింద రూ. 3,867.53 కోట్ల బడ్జెట్ కేటాయింపులను రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రతిపాదించారు. ఈ సందర్భంగా బడ్జెట్ కేటాయింపులపై జరిగిన చర్చలో మంత్రి అనగాని మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన పాపాలను ఇప్పటికీ కడుగుతూ ఉన్నామని చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో వైసీపీ నేతలు ప్రభుత్వ, ప్రజల భూములను కబళించారని అన్నారు. రీ సర్వే, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ను అడ్డం పెట్టుకొని లక్షా 75 వేల ఎకరాలను కాజేయాలని ప్రయత్నించారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ వ్యవస్థలో పూర్తి స్థాయి సంస్కరణలు తీసుకొచ్చి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. సర్వే, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే డిజిటల్ వ్యవస్థలో కలిపి..ట్యాంపర్ చేయడానికి వీలులేకుండా బ్లాక్ చైన్ టెక్నాలజీతో భూమి రికార్డులను భద్రంగా ఉంచుతున్నామన్నారు. పాత రెవెన్యూ రికార్డులను అత్యాధునిక టెక్నాలజీతో స్కాన్ చేసి, సురక్షిత శాశ్వత డిజిటల్ గుర్తింపుతో భద్రపరుస్తున్నామని, దీంతో ఫైల్ పోయింది అనే సమస్య ఉండదని, బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా లిటిగేషన్ సమస్యలను కూడా తగ్గుతాయని చెప్పారు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న పాత పొరపాట్లను సరిచేసే ప్రత్యేక కార్యక్రమం చేపట్టామని, దీని వల్ల విశ్వసనీయ, ఖచ్చితమైన, వివాదాలకు ఆస్కారం లేని భూ రికార్డులు సిద్ధమవుతాయని చెప్పారు. ప్రతి వారం జిల్లా స్థాయిలో రెవెన్యూ క్లినిక్స్ నిర్వహించి రెవెన్యూ అధికారులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి అక్కడికక్కడే ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిశీలించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. కేసుల స్థితిని ఆన్‌లైన్‌లో తెలుసుకునేందుకు మరియు పర్యవేక్షించేందుకు ఆన్‌లైన్ రెవెన్యూ కోర్టు మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రవేశపెట్టినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి తన బొమ్మల పిచ్చితో తప్పులతో కూడిన నాసిరకం పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారని విమర్శించారు. తమ ప్రభుత్వం మాత్రం పట్టాదార్ పాస్‌బుక్ ముద్రించే ముందు [illegible] ద్వారా ప్రతి వ్యక్తి తన వివరాలను చెక్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని, పొరపాట్లు ఉంటే గ్రామానికే వచ్చి సరిచేస్తారని, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని అన్నారు. రీసర్వే చేసిన గ్రామాల్లో రాజముద్రతో 15 రకాల రక్షణ అంశాలతో కూడిన పొరపాట్లు లేని పట్టాదార్ పాస్‌బుక్ అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ పాపాల కారణంగా పెరిగిపోయిన 22ఎ నిషేధిత జాబితా భూముల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు. 22ఎ జాబితా నుండి ప్రయివేట్ భూముల తొలగింపు సరళతరం చేసేలా అధికారాల బదలాయింపు చేశామన్నారు. ఈ జాబితా నుండి ప్రయివేట్ భూములు తొలగించే అధికారం ఆర్డీవోలకు అప్పగించామన్నారు. ఒక వేళ ఏదైనా భూమిని 22ఎ జాబితాలో చేర్చాలంటే ఆ పట్టాదారునికి రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా గానీ, ఆ కేవైసీ ద్వారా గానీ నోటీసులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఆ తర్వాత కచ్చితమైన విచారణ చేసి సరైన కారణాలతో ఉత్తర్వులు ఇవ్వాలని చెప్పారు. తాను అధికారులతో ప్రత్యేక సమావేశాలు పెట్టి జిల్లాల్లో ప్రత్యేక డ్రైవ్ లు పెట్టి సామాన్యులకు నష్టం లేకుండా 22ఎ భూముల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. పేదలకు పూర్వం అసైన్ చేసిన ఇంటి స్థలాలన్నింటికీ కన్వేయన్స్ డీడ్లు ఇస్తామని, ఇక వాటిపై వారికి పూర్తి హక్కులు లభిస్తాయని చెప్పారు. ఇనాం భూములపై జీవోఎం త్వరలోనే పరిష్కారాన్ని చూపుతుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

# రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ లేదు

## - వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు వీరపాండియన్

విజయవాడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ లేదని,ఎక్కడా అటువంటి కేసులు నమోదు కాలేదని వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు వీరపాండియన్ స్పష్టం చేసారు. చిత్తూరు, అన్నమయ్య, ఇతర జిల్లాల్లో మనుషులకు బర్డ్ ఫ్లూ సోకిన దాఖలాలు లేవని వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో ఓ యువకుడికి బర్డ్ ఫ్లూ సోకినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అనుమానిత వ్యక్తి నుంచి సేకరించిన నమూనాను వైరాలజీ ల్యాబ్‌లో పరీక్షించగా, నెగిటివ్ రిపోర్టు వచ్చిందని తెలిపారు. దీనిపై ఎవరూ ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో కోళ్లకు వచ్చిన బర్డ్ ఫ్లూ మనుషుల వరకు రాకుండా ఉండేందుకు వైద్యారోగ్యశాఖ అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ప్రభావిత ప్రాంతాల్లోని కోళ్ల ఫారాల్లో పనిచేసే వారికి ఓసెల్టామివర్ మాత్రలను అందచేసినట్లు తెలిపారు అంతేకాకుండా ఎన్.95 మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలోని పరిస్థితుల గురించి తెలుసుకునేందుకు సదరు ప్రభావిత గ్రామాల్లోని కుటుంబ సభ్యుల నుంచి వైద్య సిబ్బంది ఆరోగ్య వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో అనుమానిత లక్షణాలు కలిగిన వారి నుంచి సేకరించిన నమూనాలను తిరుపతిలోని స్విమ్స్ ల్యాబ్‌లో పరీక్ష చేయించగా, ఇప్పటి వరకు వచ్చిన 54 రిపోర్టులు నెగిటివ్‌గా తేలిందన్నారు. ముందు జాగ్రత్తగా చిత్తూరు, మదనపల్లె పట్టణాల్లోని ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా పడకలు సిద్ధం చేశామని తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం జిల్లాల్లో పర్యటిస్తుందని పేర్కొన్నారు.

# అజ్ఞాత మావోయిస్టులకు లొంగుబాట తప్ప మరోదారి లేదు

## గణపతి ఎక్కడున్నాడనేది తెలియదు: అగ్రనేత మల్లోజుల వ్యాఖ్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మావోయిస్టుల లొంగుబాటుకు కేంద్రం విధించిన డెడ్ లైన్ దగ్గర పడుతుండడంతో అజ్ఞాతంలో ఉన్న పార్టీ నాయకులు, ఇతర కార్యకర్తలు లొంగిపోవడం మినహా మరో మార్గం లేదని కొన్ని నెలల క్రితం పోలీసులకు లొంగిపోయిన అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి ఊరఫ్ సోను అన్నారు. మావోయిస్టు పార్టీకి నేడు ఈ దుస్థితి రావడానికి పార్టీ పూర్తిగా సాయుధ విభాగం నియం త్రణలో వెళ్లి పోవడమేనని ఆయన తెలిపారు. ఆలోచనలు ఆయుధాలను నియంత్రించాల్సి వుండగా మావోయిస్టు పార్టీలో దీనికి భిన్నంగా మిలటరీ విభాగం ఆధీనంలో యావత్ పార్టీ వెళ్లి పోయిందని, దీని పర్యవసానాలే నేడు పార్టీ చవిచూస్తోందని ఆయన తెలిపారు. శుక్రవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ గురించి, పార్టీలో మిగిలిన కొద్దిపాటి క్యాడర్ గురించి తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు. మారిన ప రిస్థితుల వల్లే తాను తన అనుచరులతో కలిసి సాయుధ పోరాటాన్ని వదిలేయాల్సి వచ్చిందని, 1980లో వున్న పరిస్థితులు ఇప్పుడు లేవని ఆయన తెలిపారు. పరిస్థితులను అర్థం చేసుకుని తాము బయటకు వచ్చామని, విప్లవ పార్టీగా మారాల్సి న మావోయిస్టు పార్టీ అందుకు తగినట్లుగా మారలేక పోవడం వల్ల విపత్కర పరిస్థితులను చవిచూడాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. మావోయిస్టు పార్టీ చేసిన అతిపెద్ద తప్పు గురించి మల్లోజుల మా ట్లాడుతూ పార్టీని సాయుధ విభాగం పూర్తిగా తన నియంత్రణలోకి తీసుకోవడమని అన్నారు. ఈ తప్పు నుంచి పార్టీ కోలుకోలేక పోయిందని ఆయ న తెలిపారు. ఇక మావో యిస్టు పార్టీకి ప్రజల మద్దతు తగ్గడానికి సరైన మార్గంలో వెళ్లక పోవడమేనని ఆయన వెల్లడించారు. సాయుధ పోరాటం తో ప్రజల్లోకి వెళ్లే పరిస్థితులు ఇప్పుడు లేవని, అందుకే తమతో పాటు చాలా మంది రాజ్యాంగాన్ని పట్టుకుని ప్రజల వద్దకు వెళ్లేందుకు అడవులను వదిలామని ఆయన తెలిపారు. ఒకప్పుడు ఆయుధాలు కలిగి వుండడం సరైనదే అయినా ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది ఆటంకంగా మారిందన్నారు. భారతదేశంలో ఆర్థిక సరళీకరణ తరువాత పరిస్థితులు వేగంగా మారాయని, వీటిని అందరు ఆమోదించారని, తాము దీనిని పాటి ంచాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. ఇక సాయుధ పోరాటం వీడాల్సి న పరిస్థితులపై 2003 నుంచే ఆలోచన లు మొదలయ్యాయని, 2024... 2024 ప్రాంతంలో తుపాకి వదలాల్సి న సమయం వచ్చిందని ఆయన తెలి పారు. ఈ విషయాన్ని గతంలోనే బసవరాజు, గణపతి వంటి నేతలతో చర్చ జరిగిందని మల్లోజుల తెలిపారు.

# కూటమి ప్రజాప్రతినిధులతో మంత్రి లోకేశ్ ఆత్మీయ విందులు

- రాజమండ్రి, నర్సాపురం నేతలకు ఉండవల్లిలో ఆతిథ్యం
- కుటుంబ సమేతంగా హాజరై సందడి చేసిన ఎమ్మెల్యేలు, ఎంపీలు
- మూడు పార్టీలు కాదు ఒకే కుటుంబమని చాటిచెప్పిన నేతలు
- మహిళలకు మంగళగిరి పట్టుచీరలను బహూకరించిన లోకేశ్



విజయవాడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: రాజకీయాల్లో కుటుంబ విలువలకు, సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కొత్త ఒరవడి సృష్టిస్తున్నారు. కూటమిలోని ప్రజాప్రతినిధుల కోసం ఆయన ఏర్పాటు చేస్తున్న ఆత్మీయ విందు సమావేశాలు అందరినీ ఆకట్టుకుంటు న్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం రాజమండ్రి, నర్సా పురం పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులకు ఘనంగా ఆతిథ్య మిచ్చారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల కోసం ఉండవల్లి లోని తన నివాసంలో కుటుంబసమేతంగా విందు ఏర్పాటు చేశారు. కృష్ణా నది ఒడ్డున ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం వనభోజనా లను తలపించింది. గోదావరి జిల్లాల నుంచి వచ్చిన అతిథులకు లోకేశ్ దంపతులు ఘన స్వాగతం పలికి, మర్చిపోలేని ఆతిథ్యం ఇచ్చారు. పెద్దల మధ్య సంభాష ణలు, పిల్లల ఆటపాటలు, మహిళల పలకరింపులతో ఆ ప్రాంగణమంతా సందడిగా మారింది. టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నేతలంతా తమ కుటుంబాలతో హాజరై.. కూటమి అంటే మూడు పార్టీలు కాదని, అదొకటేనని చాటిచెప్పారు. ఈ సందర్భంగా నేతలు మంత్రి లోకేశ్‌పై తమ అభిమానాన్ని చాటుకున్నారు. రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తనకు ఎంతో ఇష్టమైన రత్నం పెన్ను లోకేశ్ కు బహుమతిగా ఇచ్చారు. నర్సా పురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్.. లోకేశ్, బ్రాహ్మణి దంపతుల చిత్రాన్ని వస్త్రంపై ఎంతో కళాత్మకంగా ఎంబ్రాయిడరీ చేసి కానుకగా అందించారు. విందు అనంతరం మహిళలందరికీ లోకేశ్ దంపతులు మంగళగిరి పట్టుచీరలను బహూకరించారు.

ఈ ఆత్మీయ విందుకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేశ్, నిమ్మల రామానాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, పితాని సత్యనారాయణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆరిమిల్లి రాధాకృష్ణ, పులపర్తి రామాంజనేయులు, బొమ్మిడి నాయకర్, బత్తుల బలరామకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, మద్దిపాటి వెంకటరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు తమ కుటుంబసభ్యులతో కలిసి హాజరయ్యారు.




# మంగళగిరిలో జాతీయ పోలీస్ క్రికెట్ టోర్నమెంట్

గుంటూరు ఫిబ్రవరి 20, ప్రభాతవార్త ప్రతినిధి: మంగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్ గ్రౌండ్స్ లో టీ-20 క్రికెట్ టోర్నమెంట్ ను రాష్ట్ర హోంమంత్రి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా కలిసి ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఛత్తీస్‌గడ్.. కేంద్రపాలిత ప్రాంతాలు పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ ఐలాండ్స్ .. కేంద్ర సాయుధ బలగాలకు చెందిన మొత్తం 10 టీములు ఈ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ లో తలపడనున్నాయి. జాతీయ స్థాయిలో రెండోసారి జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ కు ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ ఈ దఫా ఆతిథ్యమిచ్చింది. ఈ పోలీసు టోర్నమెంట్ మూలపాడులోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ ప్రజా భద్రతకు పోలీసులు అహర్నిశలు కష్టపడతారని అటువంటి తరుణంలో క్రీడా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని హోం మంత్రి అన్నారు. మహిళా పోలీసులకు కూడా స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా డీజీపీని కోరారు. డిజిపి హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ స్నేహపూర్వక వాతావరణంలో స్పోర్ట్స్ మీట్ జరుగుతుందని అన్నారు. నిత్యం విధుల్లో బిజీగా ఉండే పోలీసులు స్పోర్ట్స్ మీట్లో పాల్గొనడం అభినందనీయమని తెలిపారు.

# అయేషా మీరా హత్య కేసు దర్యాప్తులో సిబిఐ కోర్టు కీలక ఆదేశాలు

విజయవాడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్తప్రతినిధి: విజయవాడ శివారుల్లోని ప్రస్తుత కొండపల్లి అప్పటి ఇబ్రహింపట్టణంలో 18 ఏళ్ళకితం అత్యాచారం, హత్యకు గురైన అయేషా మీరా హత్య కేసుల విజయవాడ సీబీఐ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.ఈ కేసులో సిబిఐ దర్యాప్తు నివేదికను అయేషా మీరా తల్లిదండ్రులు తప్పుపట్టారు. కేసును సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని సీబీఐ కోర్టులో న్యాయమూర్తిని కోరారు.అంతేకాకుండా సిబిఐ దర్యాప్తు అంశాలు తమకు ఇవ్వాలని కోరారు.ఈ క్రమంలో వైద్య బృందం సేకరించిన అవశేషాలను కుటుంబసభ్యులకు అప్పగించాలని సిబిఐ కోర్టు సిబిఐని ఆదేశించారింది.ఫిబ్రవరి 27న తెనాలిలో మతపరమైన ఆచారాలతో అంత్య క్రియల నిర్వహణ అంత్యక్రియలకు అవసరమైన భద్రత, వసతులు కల్పించాలని ఆదేశం మొత్తం ప్రక్రియను ప్రభుత్వ అధికారుల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేయాలని ఆదేశం విజయవాడ: సీబీఐ సమర్పించిన తుది నివేదికను కోర్టు అంగీకరించిందిదారుణ హత్యకు గురయ్యారు. ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. మొదట స్థానిక పోలీసులు విచారణ జరిపారు. అనంతరం బాధితురాలి తల్లిదండ్రుల పోరాటంతో కేసు సీబీఐ (దిల్లీ) కి బదిలీ అయ్యింది. ఈ విచారణలో భాగంగా కొన్ని సంవత్సరాల క్రితం ఆమె మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించి, కీలక ఆధారాల కోసం అవశేషాలను సేకరించారు.

# ఉగాదిన హెచ్‌డిపిటి ఆధ్వర్యంలో అక్షరాభ్యాసాలు




ఇఓతో హెచ్‌డిపిటి సంస్థ ప్రతినిథుల బృందం సమావేశం

- త్వరలో దీపం పెట్టని దేవాలయంలో దీపారాధన నిర్వహిస్తామని ఇఓ వెల్లడి

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త: రాబోయే ఉగాది పర్వదినాన రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లోని దేవాలయాల్లో పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహిస్తామని హెచ్‌డిపిటి (హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్) చైర్మన్ డా దాసరి శ్రీనివాసులు వెల్లడించారు. శుక్రవారం దుర్గమ్మ వారి ఆలయ ఇఓ వికె శీనా నాయక్‌తో దుర్గమ్మవారి ఆలయంలో సమావేశమయి వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే గోదావరి, కృష్ణా పుష్కరాల సందర్భంగా ఇప్పటినుండే పవిత్ర పుణ్య నదులయిన కృష్ణా, గోదావరి నదుల వెంట దేవతా వృక్షాలను నాటించే ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. నాందిగా కంచి పీఠాధిపతి, వారి ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకాశం బ్యారేజ్ నుండి హంసల దీవి వరకు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇఓ వికె శీనా నాయక్ మాట్లాడుతూ వారికి తమ సంపూర్ణ సహకారమందిస్తామన్నారు. దేవస్థానం తరపున హిందూ ధర్మ రథం పంపిస్తామన్నారు. స్థానాచార్య శివప్రసాద్ శర్మ, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, పారిశ్రామిక వేత్త వెలగపూడి గోపాలకృష్ణ, హిందూ సంఘం, బ్రాహ్మణ సంఘం ఐక్యంగా ఈ హిందూ ధర్మ ప్రచార కార్యక్రమంలో పాల్గొంటామన్నారు. హిందూధర్మ పరిరక్షణ ట్రస్ట్ స్టేట్ కోఆర్డినేటర్ కొండలరావు, పలువురు కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

**భక్తుల విరాళాలు:** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన అరికట్ల వెంకటేశ్వర రెడ్డి, మల్లేశ్వరి, వెంకట రోసిరెడ్డి కుటుంబసభ్యులు రు.1,01,121ల విరాళం, నిత్య ఉచిత ప్రసాద పథకానికి రు.1,01,121లు, గోసంరక్షణ పథకానికి రు.50,121 లు వెరసి మొత్తం రు.2,52,363లను అందించారు. అలాగే నిత్యాన్నదాన పథకానికి రు.5,01,116ల విరాళం గుంటూరు జిల్లా రాజేంద్ర నగర్ కు చెందిన ముప్పవరకపు రమేష్‌కుమార్, మాధవి లత దంపతులు, యుఎస్ఎ లో వుండే కుమార్దు మెగా హర్ష పేరిట విరాళంగా అందించారు. అదేవిధంగా సికింద్రాబాద్‌కు చెందిన యలమంచిలి రాధాకృష్ణ, ఝూన్సీ లక్ష్మి కుటుంబసభ్యులు రు.1లక్ష విరాళం అందించారు. ఆయా దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**దుర్గమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి:** ఏపి హైకోర్టు న్యాయమూర్తి వెనుతురుమల్లి గోపాలకృష్ణారావు దంపతులు దుర్గమ్మవారిని శుక్రవారం దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**భక్తిపారవశ్యంతో భక్తిరంజని:** దుర్గమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రముఖ గాయని లంక మీనాక్షి, శిష్యబృందం తమ భక్తిరంజనితో భక్తులను అలరించారు. వాతాపి గణపతిం, మాయాతీత స్వరూపిణి, హిమగిరి తనయే, సరసిజనాభ సోదరి, కనకశైల విహారిణి వంటి ప్రసిద్ధ కీర్తనలాలపించి ముగ్ధులను చేశారు. కార్యక్రమం అనంతరం వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి, దుర్గమ్మవారి మెమెంటో, ప్రసాదాలు అందించారు.



హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావుకి దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

# పోస్టల్ వ్యవస్థకు డాక్ సేవకులు బలమైన పునాది

## చీఫ్ పోస్ట్ మాస్టర్ శ్రీదేవి





గుంటూరు ఫిబ్రవరి 20, ప్రభాతవార్త ప్రతినిధి : గుంటూరు బొమ్మిడాల నగర్ లో ఉన్న శ్రీ సత్య సాయి స్పిరిటీయూత్ సొసైటీలో ఫిబ్రవరి 22 వ తేదీ ఆదివారం నాడు జరిగే గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం ఏర్పాట్లను చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీదేవి శుక్రవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి ఆదిత్య సింధియా పాల్గొనబోతున్న ఈ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో నిర్వహిస్తున్నారని శ్రీదేవి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 9,100 బ్రాంచ్ పోస్టాఫీసుల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలు అందిస్తున్న గ్రామీణ డాక్ సేవకులు పోస్టల్ వ్యవస్థకు బలమైన పునాది అని తెలిపారు. ఉత్తరాల బట్వాడా, సేవింగ్స్ బ్యాంక్ ఖాతాల ప్రారంభం, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి సేవలను గ్రామస్థాయిలో సమర్థవంతంగా అందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న వేలాది గ్రామీణ డాక్ సేవకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ప్రోత్సహించడం ఈ సమ్మేళనం లక్ష్యమని అన్నారు. ఉత్తమంగా పనిచేసిన 10 మంది గ్రామీణ డాక్ సేవకులను ఈ కార్యక్రమంలో ఘనంగా సత్కరిస్తామని అన్నారు.

# శ్రీవారి చిత్రపటాలను వైసిపి ఎమ్మెల్సీలు అవమానించారు

- చెప్పులతో వెంకన్న ఫొటోలు పట్టుకోవడం క్షమించరాని పాపమన్న మంత్రి లోకేశ్
- జగన్‌కు దేవుడంటే భక్తి, భయం లేవని విమర్శలు

విజయవాడ, ఫిబ్రవరి 20,ప్రభాతవార్తప్రతినిధి: వైసీపీ ఎమ్మెల్సీలు శాసనమండలిలో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి చిత్రపటాలను అవమానించారని, ఇది క్షమించరాని పాపమని ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేత జగన్‌కు దేవుడంటే భక్తి, భయం లేవని, హిందువుల మనోభావాలంటే అస్సలు లెక్కేలేదని ఆయన మండిపడ్డారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అయ్యిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ఆరోపణలకు నిరసనగా వైసీపీ సభ్యులు శుక్రవారం శాసనమండలికి శ్రీవారి చిత్రపటాలతో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు బూట్లు, చెప్పులతోనే స్వామివారి చిత్రపటాలను పట్టుకుని ప్రదర్శించారని, సభ ముగిశాక వాటిని అక్కడే వదిలేసి వెళ్లారని లోకేశ్ ఆరోపించారు. ఈ ఘటనపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. "శ్రీవారికి చేసిన మహా పాపం కప్పిపుచ్చుకోవడానికి మహాపరాధం చేశావు జగన్. మీ వైసీపీ ఎమ్మెల్సీలు బూట్లు, చెప్పులతో వెంకటేశ్వర స్వామి చిత్రపటాలు పట్టుకుని మహాపరాధం చేశారు. అంతే కాకుండా, కౌన్సిల్‌లో ప్రదర్శించిన శ్రీవారి ఫొటోలు అక్కడే విసిరేసి వెళ్ళిపోవడం క్షమించరాని పాపం. వెంకన్నతో పెట్టుకోవద్దు జగన్!" అంటూ లోకేశ్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ మేరకు తన విమర్శలకు ఆధారంగా నారా లోకేశ్ వీడియోను కూడా పంచుకున్నారు.

# మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి: సిఎస్



విజయవాడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చేపట్టిన మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లా కలక్టర్లు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. పియం కుసుం,సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఇచ్చిన రుణాల రికవరీ, మనమిత్ర వాట్సాప్ సేవలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాట్సప్ గవర్నెన్స్ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆసేవలను వినియోగించేందుకు కృషి చేయాలని చెప్పారు. ఇందుకు సంబంధించి జిల్లాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.ఎస్సి కార్పొరేషన్ ద్వారా ఎన్ఎస్ఎఫ్డిసి, ఎన్ఎస్ఎకెఎఫ్డిసి పథకాల కింద వాహనాల కొనుగోలు, స్వయం ఉపాధికై రుణాలు తీసుకున్న లబ్దిదారులు ఏప్రిల్ లోగా అసలు చెల్లిస్తే వారికి వడ్డీ మాఫీ చేసేందుకు ముఖ్యమంత్రి వర్యులు అంగీకరించారని కావున ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్దిదారులకు సిఎస్ సూచించారు. ఎన్ఎస్ఎఫ్డిసి, ఎన్ఎస్ఎకె ఎఫ్డిసి రెండు కార్పొరేషన్ల ద్వారా సుమారు రూ260 కోట్ల అసలు రూ.40 కోట్ల వడ్డీ కలిపి రూ.300 కోట్ల వసూలు కావాల్సి ఉందని చెప్పారు. రికవరీపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు.జిల్లా ఎస్సి కార్పొరేషన్ అధికారులు పూర్తిగా ఇందుకు సహకరిస్తారని చెప్పారు. అంతకు ముందుకు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై మాట్లాడుతూ ఆసర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కలక్టర్లను సిఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి యం నాయక్, డైరెక్టర్ ఐఅండ్పిఆర్ కెఎస్ విశ్వనాథన్, సిడిఎంఏ జి.సంపత్ కుమార్, అందరు జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# మేడారం జాతరకు అంతర్జాతీయ వారసత్వ గుర్తింపునకు కృషి



## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
## జాతరపై కాఫీ టేబుల్ పుస్తకం ఆవిష్కరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఆదివాసుల ఆత్మగౌరవానికి, తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిందని రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధిశాఖమంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రపంచ వరల్డ్ హెరిటేజ్ కట్టడంగా రామప్ప దేవాలయానికి గుర్తింపు దక్కడం తెలంగాణకు గర్వకారణమని, ఆ గుర్తింపు సాధనలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. అదే విధంగా లివింగ్ హెరిటేజ్ విభాగంలో ఇప్పటికే బెంగాల్‌లో దుర్గాపూజ, దీపావళి పండుగలకు హెరిటేజ్ హోదా లభించిన నేపథ్యంలో మేడారం జాతరకు కూడా అంతర్జాతీయ వారసత్వ గుర్తింపు తీసుకొచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. అ దిశగా ప్రభుత్వం తో చరిత్రకారులు, సామాజికవేత్తలు, అనుభవజ్ఞులు, అంత్రో పాలజిస్టులు కలిసి పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ మేరకు ప్రజాభవన్‌లో శుక్రవారం మేడారం జాతర కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్య క్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. సమ్మక్క-సారలమ్మల వీర గాథ ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయిందని, ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన ఆ వీర వనితలను భావి తరతరాలు స్మరించుకుంటాయన్నారు. ప్రతి పండుగ ప్రత్యేకత కలిగి ఉన్నప్పటికీ మేడారం జాతర తన ప్రత్యేక వైభవంతో ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోందని పేర్కొన్నారు. కోయ జాతి బిడ్డగా మేడారం చరిత్రలో భాగస్వామ్యం కావడం తనకు గర్వకారణమని తెలిపారు. మేడారం జాతర అరుదైన చిత్రాలను సంకలనం చేసి కాఫీ టేబుల్ బుక్ రూపంలో తీసుకువచ్చిన కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్‌ను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ పుస్తకంలోని ప్రతి చిత్రం ఒక చరిత్రను ప్రతిబింబిస్తోందని, ప్రపంచ పటంలో మేడారాన్ని నిలబెట్టిన ఫోటోగ్రాఫర్ల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. జాతర వైభవాన్ని పుస్తకంలోని ఫోటోలు సజీవంగా ఆవిష్కరించాయని ప్రశంసించారు. కాకతీయ హెరిటేజ్ సభ్యులు, ఫోటోగ్రాఫర్లను మంత్రి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమానికి ప్రముఖ సినీ దర్శకుడు కాఫీ టేబుల్ బుక్ ఎడిటర్ బి. నర్సింగ రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు బి.వి. పాపారావు, బి.పి. ఆచార్య, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎం. రతన్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్‌ట్రస్టీ ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు,జె. శ్రీధర్‌రావు తదితరులు హాజయ్యారు.

# రేషన్ బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు

## రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర
### బాగ్‌లింగంపల్లి గోదాములో ఆకస్మిక తనిఖీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** పేద ప్రజలు కూడా సంపన్నులతో సమానంగా సన్నబియ్యంతో భోజనం చేయాలన్న మహత్తర సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. బియ్యం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సివిల్ సప్లైస్ గోదామును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు రెండు గంటలపాటు గోదాములో నిల్వ ఉన్న బియ్యం నమూనాలను తెరిపించి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. బియ్యంలో నూకల శాతం, తేమ శాతం వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. గోదాముకు వచ్చిన బియ్యాన్ని స్వీకరించే దశలోనే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిల్వలను తిరస్కరించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ పడినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రజలకు చేరే ప్రతి బియ్యం గింజ నాణ్యమైనదిగా ఉండేలా పౌరసరఫరాలశాఖ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సరఫరా వ్యవస్థలో పారదర్శకత కోసం స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వర్డ్-అవుట్‌వర్డ్ వివరాలు, రవాణా రికార్డులను కమిషనర్ పరిశీలించారు. రేషన్ షాపులకు బియ్యం సరఫరాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోదాముల్లో పని చేస్తున్న హమాలీలతో మాట్లాడిన కమిషనర్ వారి పని వాతావరణం, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసమే తమ బలమని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నాణ్యతే ప్రమాణం కావాలని, రేషన్ బియ్యం నాణ్యత విషయంలో చిన్న తప్పిదాన్ని కూడా సహించమని పునరుద్ఘాటించారు. ఈ తనిఖీల్లో హైదరాబాద్ జిల్లా మేనేజర్ కె. సాయిఅరుణ్, అదనపు జిల్లా మేనేజర్ దీప్తి, గోదాం ఇన్‌చార్జిలు గోపాలకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి బకాయి బిల్లులను చెల్లించండి

## సర్పంచ్‌ల సంఘం జెఎసి వినతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** పంచాయతీలకు కేంద్రం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులతో మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులను చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ కోరారు. ఈ విషయమై శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తాజాగా తెలంగాణకు కేంద్రం నుంచి రూ.387 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయని, వాటిని గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనతోపాటు పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు వినియోగించాలని ఆదేశించిందన్నారు. మాజీ సర్పంచ్‌లకు వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించేవిధంగా ఆదేశాలు జారీ చేయాలని గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కను ఆయన కోరారు. గుంటి మధుసూదన్‌రెడ్డి, రాంపాక నాగయ్య, కేశబోయిన మల్లయ్య, సముద్రాల రమేష్, నెక్కొండ రవి పాల్గొన్నారు.



# ఐఎస్ 374:2019 ప్రమాణాలపై విజయవంతంగా రెండు రోజుల కోర్సు

## బిఐఎస్ హైదరాబాద్ విభాగం నిర్వహణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఐఎస్ 374:2019 ప్రమాణాలపై రెండు రోజుల క్యాప్సూల్ కోర్సును బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హైదరాబాద్ విభాగం విజయవంతంగా నిర్వహించింది. శిక్షణలో తయారీదారులు, లైసెన్సుదారులు, దరఖాస్తుదారులు, నాణ్యత నియంత్రణ సిబ్బందితోపాటు పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొ న్నారు. వారికి ఎలక్ట్రిక్ సీలింగ్ టైప్ ఫ్యాన్లు, రెగ్యులేటర్ల స్పెసిఫికేషన్ (నాలుగో సవరణ)పై శిక్షణ ఇచ్చారు. ఈ నెల 19 నుంచి 20 వరకు శిక్షణ విజయ వంతంగా కొనసాగింది. మొదటి రోజు శిక్షణార్థులు జీనోమ్ వ్యాలీలోని విమ్టా ల్యాబ్స్‌ను సందర్శించారు. అక్కడ ఐఎస్ 374:2019కు సంబంధించిన పరీక్షా విధానాలు, ప్రక్రియలపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రిక్ సీలింగ్ ఫ్యాన్లు, రెగ్యులేటర్లకు సంబంధించిన వివిధ పరీక్షలను ప్రత్యక్షంగా వీక్షించారు. రెండోరోజు బీఐఎస్ హైదరాబాద్‌శాఖ కార్యాల యంలో బీఐ ఎస్ అధికారులు సమగ్ర సాంకేతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఐఎస్ 374:2019 ప్రమాణాల వివరాలు, పరీక్షా విధానాలు, మార్కింగ్ అవసరాలు, సర్టిఫికేషన్ ప్రక్రియలు, నాణ్యత నియంత్రణ చర్యలపై విపులంగా వివరించారు. కార్యక్రమ ముగింపులో నిర్వహించిన ప్రశ్నోత్తర సమా వేశంలో తమ సందేహాలను శిక్షణలో పాల్గొన్న సిబ్బంది, విద్యార్థులు నివృత్తి చేసుకున్నారు. ఈ క్యాప్సూల్ కోర్స్ శిక్షణ తీసుకున్న వారిలో సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతోపాటు భారతీయ ప్రమాణాల అమలులో మరింత మెరుగైన అవగాహన కలుగుతుందని అధికారులు తెలిపారు. శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

# విద్యార్థుల సంక్షేమంపై సర్కారు ప్రత్యేక దృష్టి

## గురుకులాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు, చర్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 20:** రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం, భద్రతకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. గురుకుల విద్యార్థులకు విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే వాటిని వేగంగా పరిష్కరించడంతో పాటు మెరుగైన పర్యవేక్షణ చేయాలని జిల్లా అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయం శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా జిల్లా అధికారులకు లిఖిత పూర్వకంగా ఆదేశాలు జారీ చేసింది. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించ డానికి నోడల్ అధికారులను నియమించాలని ఆదేశాలు జారీ చేసింది. డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్‌ను ముందుగానే తయారు చేయాలని స్పష్టం చేసింది. జిల్లా షెడ్యూల్‌కు అనుగుణంగా, సంబంధిత అన్ని విభాగాలకు వాటిని అందజే యాలని స్పష్టం చేసింది.

నోడల్ అధికారులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తనిఖీలు నిర్వహించాలని, విద్యా సంస్థల సరైన పనితీరును నిర్ధారించడానికి ఆకస్మిక సందర్శనలను కూడా నిర్వహిస్తారని వెల్లడించింది. అధికారులు గురుకుల పాఠశాలలను సందర్శించిన తర్వాత అవసరమైన చర్యలు తీసుకోవడానికి తనిఖీ నివేదికలను తయారు చేసి వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. ఏ చర్యలు తీసుకున్నారో వెంటనే తెలియజేయాలని జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. తీసుకున్న చర్యల నివేదికను ప్రతి నెల అయిదో తేదీలోపు సంబంధిత విభాగాధిపతులు, కార్యదర్శులకు తప్పకుండా సమర్పించాలని ఆదేశాల్లో ప్రభుత్వం పేర్కొంది.

# ఎన్నికల హామీ ప్రకారం బిసిలకు బడ్జెట్ కేటాయించాలి

## బిసి నేతల డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఎన్నికల ముందు కా ంగ్రెస్ పార్టీ బిసిలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది బిసిలు శుక్రవారం గన్‌పార్కులో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎర్ర సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రెండేళ్లుగా కేటాయించాల్సిన బడ్జెట్ 55 వేల కోట్లు కేటాయించాలని, బిసిలకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించకుండా ప్రభుత్వం గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి మోసం చేసిందని ఆరోపించారు. సబ్‌ప్లాన్ అమలుపై బిసి ప్రజా ప్రతినిధులు నోరువిప్పకపోవడం సిగ్గుచేటని, చేతగాక పోతే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తాను కూడా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని తీన్మార్ మల్లన్న చెప్పారు. గత రెండేళ్లలో బడ్జెట్‌లో బిసిలకు తీరని అన్యాయం జరిగిందని జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు.



గన్‌పార్కులో ధర్నా చేస్తున్న బిసిలు. చిత్రంలో తీన్మార్ మల్లన్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎర్ర సత్యనారాయణ, గుజ్జ సత్యం తదితరులు

ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావే శాల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ బిసి సబ్ ప్లాన్‌పై ప్రభుత్వం తన అభిప్రాయాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ మేధావులు ఫోరం ఛైర్మన్ టి. చిరంజీవులు, టి జెఎసి వైస్-ఛైర్మన్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బిసి నేతలు, కార్యకర్తలు అసెంబ్లీని ముట్టడిం చడానికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు అడ్డు కోవడంతో రోడ్డుపైన బైఠాయించారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

# డిగ్రీ, పిజిల్లో కొత్త కోర్సులు

## 2026-27 విద్యా సంవత్సరం నుంచే అమలు.. నోటిఫికేషన్ జారీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రానున్న విద్యా సంవత్సరం 2026-27లో డిగ్రీతోపాటు పీజీలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. డిగ్రీలో కొన్ని పీజీలో కొన్ని కొత్త కోర్సులను ప్రారంభించనున్నారు. డిగ్రీలో కొత్త కోర్సులుగా బీఏ(ఒక కోర్సుగా) డిఫెన్స్, సెక్యూరిటీ, పొలిటికల్ సైన్స్‌ను ప్రారంభించ నున్నారు. బీకాంలో 4 కోర్సులను ప్రారంభించనున్నారు. ఫిన్‌టెక్- బిజినెస్ ఇంటెలిజెన్స్ అండ్ ఎనలిటిక్స్, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎకౌంట్స్, డిజిటల్ మార్కెటింగ్. బీబీఏలో 3 కోర్సులు ప్రారంభిస్తారు. ఎయిర్‌పోర్ట్, ఎయిర్‌లైన్స్, ఏరోస్పేస్ మేనేజ్‌మెంట్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ స్టార్టప్ మేనేజ్‌మెంట్, రూరల్ మేనేజ్‌మెంట్. ఇక బీఎస్సీలో మల్టీ మీడియా డిజైన్ అండ్ యానిమేషన్‌తోపాటు ఫుడ్ సెక్యూరిటీ, ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ రెండు కోర్సులను ప్రారంభించనున్నారు. ఇక పీజీలో... ఎంఏలో ఏవియేషన్ మేనేజ్‌మెంట్, డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ స్టడీస్ రెండు కోర్సులను ప్రారం భించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రైవేటు కళాశాలల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ తెలంగాణ ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తులను మార్చి 10 వరకు స్వీకరించనుంది.

# యూరియా యాప్‌ను రద్దు చేయాలి: మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 20:** యూరియా కోసం రైతులు చెప్పులు లైన్‌లో పెట్టే ఆనాటి రోజులు తేవడమేనా మీరు చెప్పిన మార్పు..? అంటూ సిఎం రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రశ్నించారు. నిరక్షరాస్యులు, స్మార్ట్ ఫోన్ లేని లక్షలాది మంది రైతులు ఏ విధంగా యాప్‌ను వినియోగిస్తారన్న కనీస సోయి కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేకపోవడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. షాపుల్లో అమ్మాల్సిన యూరియాను, యాపుల్లో ఇస్తామని ఆర్భాటం చేసిన రేవంత్ రెడ్డి.. ఈ రైతు ఆక్రందన మీకు వినిపిస్తుందా..అని ప్రశ్నిస్తూ యూరియా కోసం ఓ రైతు పడుతున్న ఆందోళనకు సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారుర. గుండెలు మండి ప్రభుత్వంపై తిరగబడుతున్న అన్నదాత రోధన అర్థమవుతుందా..? అని నిలదీశారు. ఒక్క యాదాద్రి భువనగిరి జిల్లాలోనే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరిదీ ఇదే పరిస్థితి అని పేర్కొన్నారు.దేశానికి అన్నం పెట్టే రైతుల పట్ల ఇంత కర్కశంగా, కఠినంగా వ్యవహరిస్తున్న తీరును యావత్ తెలంగాణ సమాజం గమనిస్తున్నదని అన్నారు.యూరియా యాప్‌ను రద్దు చేసి, పాత విధానంలో, ఎలాంటి షరతుల్లేకుండా రైతులకు యూరియా సరఫరా చేయాలని తెలంగాణ రైతాంగం పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. లేదంటే యూరియా కష్టాలు భరించని రైతులు రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలెస్‌ను ముట్టడించే రోజులు వస్తాయని హెచ్చరించారు.

# ఎస్‌ఐఆర్‌కు సన్నాహాలు ముమ్మరం

## ఎఇఆర్‌ఒలకు సిఇఒ సుదర్శన్‌రెడ్డి శిక్షణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 20:** ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించి సన్నాహకాలను వేగవంతం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి శిక్షణ కార్యక్రమాలను ముమ్మరం చేశారు.ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సీఈవో కార్యాలయం నుంచి మెదక్‌చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సహాయ ఎన్నికల నమోదు అధికారులకు (ఏఈఆర్ఓలు) ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు.మొత్తం 195 మంది ఏఈఆర్ఓలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఓటరు జాబితాల తయారీ, నవీకరణ, నిర్వహణ అంశాలపై విపులంగా అవగాహన కల్పించారు.

అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాల్లో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం, వివరాల సవరణ వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు.రాబోయే ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహకాలను సమయానికి పూర్తి చేయాలని సుదర్శన్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఓటరు జాబితాల స్వచ్ఛతను కాపాడటంలో ఏఈఆర్ఓల పాత్ర అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయని అధికారులు తెలిపారు.

# అప్పులు తెచ్చి సాగుచేసిన వైనం
## 23న కేబినెట్ సమావేశంలో గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశం

### యాసంగి సాగు ప్రారంభమై రెండు నెలలు గడిచిపోతున్నా..

# రైతు భరోసా కోసం తప్పని అన్నదాతల నిరీక్షణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** యాసంగి (రబి) సీజన్ రైతు భరోసా కోసం అన్నదాతలు నిరీక్షిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రమంతటా యాసంగి సిజన్ నాట్లు పూర్తయ్యాయి. విత్తనాలు, నాట్లు, పురుగుమందులు, ఎరువుల కోసం రైతులు అప్పులు తెచ్చి సాగు చేశారు. ప్రభుత్వం రైతు భరోసా విడుదల చేస్తే ఆ డబ్బుతో అప్పులు తీర్చుకోవచ్చని భావిస్తున్నారు. ఏటా రాష్ట్రంలో యాసంగి సీజన్ డిసెంబర్ మూడోవారంతో ప్రారంభవుతుంది. సీజన్ ముందు డిసెంబరు చివరి వారం లేదా జనవరి మొదటివారంలో రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ కావాల్సి ఉండగా ప్రస్తుతం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచిపోతున్నా రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.6వేల పంట పెట్టుబడిసాయం పంపిణీ జరగడంలేదు. తొలుత సంక్రాంతి పండగకు రైతు భరోసా నిధులు పంపిణీ అవుతాయని అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. అయితే వారి ఆశలు నెరవేరలేదు.

ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలు పూర్తికాగానే రైతు భరోసా నిధులు పంపిణీ చేస్తామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. ఈ రబి సీజన్‌లో వరి నాట్లు, ఇతర పంటలు సాగు చేసి దాదాపు రెండు నెలలు దాటింది. అత్యధిక విస్తీర్ణంలో సాగైన వరి పంట కొన్ని ప్రాంతాల్లో పొట్టదశకు కూడా వచ్చింది. మందులు, ఎరువుల కోసం రైతులు వ్యాపారుల వద్ద అప్పులు చేస్తూ నెట్టుకొస్తున్నారు. యేడాదిలో రెండు సీజన్లకు కలిపి ఎకరాకు మొత్తం రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రకారమే వానాకాలం పంటలకు సాయం మంజూరు చేసింది. రబీ సీజన్‌కు ముందు అంటే డిసెంబరు నెలలోనే రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ చేస్తే విత్తన, కూలీ ఖర్చులకు చాలా వెసులుబాటు కలిగేది.

కానీ ఫిబ్రవరి మూడోవారం గడుస్తున్నా నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇదే సమయంలో ప్రభుత్వం ఊహించని విధంగా కొత్త అంశాన్ని తెరపైకి తెచ్చింది. శాటిలైట్ సర్వే (సింథటిక్ ఎపర్చర్ రాడార్ టెక్నాలజీతో శాటిలైట్ మ్యాపింగ్ సర్వే) ఆధారంగా కేవలం సాగుచేసిన భూములకే సాయం అందజేయనున్నటు ్లప్రకటించింది. అయితే శాటిలైట్ సర్వే పూర్తయినప్పటికీ రైతు భరోసా నిధుల పంపిణీకి మాత్రం మోక్షం కలగలేదు. కాగా ఈ నెల 23న తెలంగాణ రాష్ట్ర కేబినెట్ భేటీ జరగనున్న నేపథ్యంలో రైతు భరోసా విడుదలపై ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంటుందని అన్నదాతలు కోటి ఆశలు పెట్టుకున్నారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత రైతుభరోసా నిధులు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో ఈ అంశంపై కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం తెలుస్తోంది. 23న జరిగే కేబినెట్ సమావేశం గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఆ తర్వాత రెండు, మూడు రోజుల్లో రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా పంపిణీ చేయడానికి దాదాపు రూ.9,000 కోట్లు అవసరమని ఆర్థిక శాఖ భావిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినప్పటి నుంచి సాగుకు రైతు భరోసా పథకం కింద పంట పెట్టుబడి సాయం అందిస్తోందని ప్రభుత్వం చెబుతోంది.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిరంజీవులు, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

# బడ్జెట్‌లో బిసిలకు అన్యాయంపై 27న నిరాహార దీక్ష

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** బడ్జెట్‌లో బిసిలకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా ఈ నెల 27న వేలాది మందితో ఇందిరా పార్కు ఎదుట నిరాహారదీక్ష నిర్వహిస్తున్నామని బిసి మేధావుల ఫోరం, బిసి పొలిటికల్ ఫ్రంట్ ప్రకటించాయి. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఫోరం ఛైర్మన్ టి.చిరంజీవులు, ఫ్రంట్ ఛైర్మన్ బాలగోని బాల్ రాజ్‌గౌడ్, పలువురు బిసి నేతలు నిరాహారదీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి, నిరాహారదీక్షను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా టి.చిరంజీవులు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయంచకుండా తీరని అన్యాయం చేశాయని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిసిలకు బడ్జెట్‌లో 50 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని, కొత్తగా నియమించబోయే 40 కార్పొరేషన్‌ల ఛైర్మన్‌లలో బిసిల జనాభా ప్రకారం ఛైర్మన్‌లను నియమించాలని, లేకపోతే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. రాబోయే రాజ్యసభ ఎన్నికల్లో బిసిలకు అవకాశం కల్పించాలని కోరుతూ ఈ మేరకు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేలకు లేఖలు రాయడం జరిగిందని చెప్పారు. బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ బిసిలను బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎదగనీయకుండా విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయరంగాల్లో అణిచి వేస్తున్నాయని ధ్వజమెత్తారు.

# కూరగాయల సాగులో నూతన పరిశోధనలు

## ఆ ఫలితాలతో అధిక దిగుబడులు
## జాతీయ సదస్సులో శాస్త్రవేత్తలు, నిపుణులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా చేపడుతున్న ముమ్మర పరి శోధనలు, ఆవిష్కరణలతో కూరగాయ పంటల్లో అధిక దిగుబడులు సాధ్యమవుతున్నాయని, నూతన పరిశోధనా ఫలితాలను అన్నదాతలకు అధికారులు ఎప్పటికప్పుడు చేరవేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు పిలుపు నిచ్చా రు. ఈ మేరకు హైదరాబాదులోని రాజేంద్రనగర్‌లో కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వేదికగా కూరగాయల పంటలపై అఖిలభారత సమ న్వయ పథకం 44వ వార్షిక సమావేశం జరుగుతోంది. తొలిరోజు శుక్రవారం జరుగుతున్న 300 మంది శాస్త్రవేత్తలు పలు పరిశోధన అంశాలు పంచుకు న్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ వ్యవసాయ కార్యదర్శి కే. సురేంద్ర మోహన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కొరతగా ఉన్న కూరగాయల సమస్యను పరిష్కరించడానికి 908కిపైగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఆధ్వర్యంలో ఎనిమిది వందలకుపైగా రైతులను ఉత్తమ కూరగాయల సాగు వలంటీర్లుగా రైతులను తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. శిక్షణ తీసుకున్న రైతులతో ఇతరులకు శిక్షణ కొనసాగిస్తామని చెప్పారు. రాష్ట్రంలో రైతుల ఆదాయం రెండింతలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు రైతులకు అందుబాటులో మార్కెటింగ్ వ్యవస్థను తీసుకొస్తామని, అలాగే ప్రత్యేకించి కూరగాయల ఉత్పాదకతను పెంచడానికి దేశవ్యాప్తంగా ఉన్న ఉత్తమ పద్ధతులను రైతులకు పరిచయం చేస్తామన్నారు.

దేశంలో ఉద్యానరంగం ప్రాముఖ్యత రోజు పెరగడం సానుకూల పరిణామమని, ఉద్యాన పంటల విలువ సాలిన 7.6 లక్షల కోట్లుగా ఉందని భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుధాకర్ పాండే అన్నారు. దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి, వినియోగం నెలకు 11 కిలోల నుండి 9 కిలోలకు తగ్గిందని, అదేసమయంలో ఉద్యాన ఉత్పత్తుల వినియోగం ఐదు కిలోల నుండి 9.7 కిలోలకి పెరిగిందని ఆయన పేర్కొన్నారు.

గతంలో మూడు లక్షల ఎకరాల్లో ఉన్న కూరగాయ సాగు లక్ష ఎకరాలకు పడిపోయిందని, వెంటనే మరో రెండింతల మేర ఈ విస్తీర్ణం పెరగాల్సిన అవసరం ఉందని ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ డి. రాజిరెడ్డి అన్నారు. రెండు నెలల్లో రాష్ట్రంలో ఉన్న 400 రైతు ఉత్పత్తి కంపెనీ సభ్యులకు కూరగాయ ఉత్పత్తిలో మేలైన శిక్షణ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఏఐసీఆర్‌పీ వార్షిక నివేదిక, ఉద్యానవర్సిటీ వార్షిక నివేదిక, బెండ, బీరలో డ్రోన్ పరిశో ధనపై రచనలను విడుదల చేశారు. కార్యక్రమంలో బెంగళూరులోని ఐహెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ టికె బెహరా, ఎన్‌బీపీజీఆర్ డైరెక్టర్ డాక్టర్ జిపిసింగ్, మాజీ వీసీ డాక్టర్ లవండి, ఎన్ఐఆర్‌సి ఏ రాజమండ్రి డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్, పరి శోధన సంచాలకులు లక్ష్మీ ్మనారాయణ, లోకల్ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ అనితకుమారి, డాక్టర్ చీనా, డాక్టర్ పి ప్రశాంత్, దేశవ్యాప్తంగా కూరగాయల్లో పరిశోధన చేస్తున్న 300 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# ఫ్లోర్ డిజైనర్ వేర్



ఈవెనింగ్ పార్టీలతో బ్రైట్‌గా వెలిగిపోతుంది. గెటు టు గెదర్ కాన్సెప్ట్లు గెట్ రెడీ అంటుంటాయి. ఇలాంటప్పుడు నలుగురు కలిసే చోట న్యూ లుక్‌తో కనిపించాలని కోరుకుంటుంది నవతరం.



ఫ్యాషన్ ఫ్యాషన్



ప్రియాంక

# ఇల్లే ఒక గ్రంథాలయం

ఒక చిన్న ఆలోచన వేలమంది విద్యా ర్థుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. దాని వెనక ఉన్న పేరు ప్రియాంక గార్గ్. 'వే ఆఫ్ లైఫ్' పేరుతో బుక్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసి, ఉచితంగా పుస్తకాలను అందిస్తారా.. పేద పిల్లల చదువుల కోసం తన ఇంటినే లైబ్రరీగా మార్చేశారు హరియాణాలోని పరీదాబాద్‌కు చెందిన ప్రియాంక గార్గ్, వృత్తి రీత్యా చార్టర్డ్ అకౌంటెంట్ మన దేశంలో చాలామంది విద్యార్థుల పాఠశాల స్థాయిలోనే చదువు మానేస్తున్నారు. పుస్తకాలు కొనుక్కునే స్థోమత లేక చదువుకి దూరం అవుతున్న వాళ్లూ చాలామందే. ప్రియాంకాకి కూడా ఇలాంటి పరిస్థితి ఎదురైంది. తన ఇంట్లో పనిచేసే మహిళ పిల్లలకు పుస్తకాలు కొనేందుకు డబ్బులు లేవు అని అడిగిందట. నా పిల్లలు పెద్దవాళ్లు, నీ పిల్లలు చిన్నవాళ్లు. ఇద్దరి తరగతులు వేరు. ఆ పుస్తకాలు నా దగ్గర లేవు. బయట కొని తెస్తా అన్నారట. అంతలోనే ప్రియాంక ఉంటున్న హౌసింగ్ సొసైటీ వాట్సాప్ గ్రూప్‌లో ఖిమా ఇంట్లో పనిచేసే మహిళ పిల్లలకు పాఠ్య పుస్తకాలు కావాలి. ఎవరి దగ్గరైనా పుస్తకాలుంటే చెప్పండి అంటూ మెసేజ్ పెట్టారట. అది మొదలు సొసైటీ సభ్యుల నుంచి అలాంటి మెసేజ్‌లు ఇచ్చారట. అది చూసి ప్రియాంక ఇలా బుక్స్ అవసరం అయిన వారందరికీ సాయం చేయాలను కున్నాడు. అందుకే 2018లో 'వే ఆఫ్ లైఫ్' పేరుతో ఉచిత బుక్ బ్యాంక్‌ను ఏర్పాటుచేశారు ఆమె.

**విద్యాదానం చేయమన్నా:** ఈ బుక్ బ్యాంక్ కోసం ప్రియాంక చాలా కష్టపడ్డారు. మొదట్లో తన హౌసింగ్ సొసైటీలో ఇంటిం టికీ తిరిగి పాత టెక్స్ట్ బుక్స్, స్టడీ మెరి యల్స్ సేకరించారు. తరవాత నుంచి పాత పుస్తకాలను సేకరించేందుకు నగరంలో ప్రచారాలు చేపట్టి, శిబిరాలను ఏర్పాటు చేశారు. సోషల్ మీడియా లోనూ వే ఆఫ్ లైఫ్ ప్రాముఖ్యతను వివరిస్తూ పెద్దఎత్తున ప్రచారాలు చేశారు. పాత టెక్స్ట్ బుక్స్, స్టడీ మెటీరియల్స్ అమ్మ కండి వాటిని మాకు అందించి విద్యా దానం చేయమని కోరాను. దాంతో ఎంతోమంది దాతలు పాత పుస్తకాల్ని వే ఆఫ్ లైఫ్ ఆఫీస్‌కి పంపిం చడం మొదలు పెట్టారు. ఢిల్లీ నుంచి ఏటా ఎంతోమంది పాత పుస్తకాలను, మెటీ రియల్స్ ని డొనెట్ చేస్తున్నారు. ఆ విధంగానే ఈ వే ఆఫ్ లైఫ్‌ని పెద్ద బుక్ బ్యాంక్‌గా మార్చగలిగారు. ఇక్కడ కేజీ నుంచి పీజీ వరకూ అన్ని తరగతుల పుస్తకాలు... రైల్వే, ఎస్సై, నీట్, యూపీఎస్సీ వంటి అన్ని పోటీపరీక్షల స్టడీ మెటీరియల్స్ ఇక్కడ ఉన్నాయి. దొరుకుతాయి. పిల్లలకు కథల పుస్తకాలనీ ఉంచాం. మొత్తంగా మా ఇంటినే పుస్తక బ్యాంక్‌గా మార్చేశా అంటున్నారు ప్రియాంక. తల్లిదండ్రులూ వస్తున్నారు.. "నేను బుక్ బ్యాంక్ను మొదలు పెట్టినప్పుడు పేదపిల్లలు మాత్రమే వస్తారనుకున్నా. కానీ ప్రైవేటు స్కూల్స్, ఇంటర్నేషనల్ పాఠశాలల తల్లిదండ్రులూ మా దగ్గరకి వస్తున్నారు. మాకు విదేశాల నుంచీ బుక్స్ కోసం కాల్స్ వస్తున్నాయి. వాళ్లకి పుస్తకాలను పంపాలంటే రవాణా ఛార్జీలను స్పాన్సర్ చేసే దాతలు మాకు కావాలి. అంతేకాదు, పుస్తకాల కొరత వల్ల ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదు. ఇదే నా లక్ష్యం. వందమందికి పైగా వాలంటీర్లు దీంట్లో పనిచేస్తున్నారు. ఉచిత పుస్తకాల పంపిణీకి కొన్ని స్వచ్ఛంద సంస్థల తోనూ పని చేస్తున్నాను. దీనికితోడు ప్రభుత్వ సాయం కూడా అందితే బాగుంటుంది అంటారు ప్రియాంక. ◻

## నైవేద్యం



ఒక విష్ణు భక్తుడు నిరంతరం నారాయణ జపంలో మునిగి తేలుతుంటాడు. ఆ తాదాత్మ్య స్థితికి ఆనందించి.. అతడి ఎదుట ప్రత్యక్షమయ్యాడు స్వామి. భగవానుడి రాకను ఊహించని భక్తుడు ఆశ్చర్యపోయి, ఆయనకు ఏం సమర్పించాలా అని చుట్టూ చూశాడు. ఒకే ఒక్క అరటిపండు కనిపించగా పరవశించాడు. చిత్రంగా పండును పడేసి, తొక్కను భగవంతుడి నోటికి అందించాడు స్వామి పరమానందంగా తిని, క్షణంలో మాయమయ్యాడు. కొంతసేపటికి తెలివిలోకి వచ్చిన భక్తుడు తన తికమక పనికి చింతిం చాడు. మరోసారి నారాయణుడు ప్రత్యక్షమైతే ఇచ్చేందుకు వందల పండ్లు తెచ్చి, స్వామి కోసం సిద్ధం చేసుకున్నాడు. అతడి భక్తి చూసి, స్వామి ఇంకోసారి దర్శనమిచ్చాడు. ఈ సారి భక్తుడు జాగ్రత్తగా తొక్కను పడేసి, అరటి పండును మాత్రమే నోటికి అందించాడు. స్వామి వెంటనే ఉమ్మేయగా, భక్తుడు విస్తుపోయాడు. ఇంతకుముందు నువ్వు పారవశ్యంలో ఉన్నావు గనుక. తొక్కే అందించినా ఎంతో రుచిగా ఉండి, తినేశాను. కానీ ఇప్పుడు పండు నుంచి తొక్కను వేరుచేసే సాధనలో ఉన్నావే గానీ భక్తి లేదు. వేగంగా తొక్క తీసి, జాగ్రత్తగా అందించగలను అనే అతిశయం వల్ల.. ఇందులో రుచి లేదు. భక్తుడు ఏది ఇస్తున్నాడని కాదు, ఏ భావనతో ఇస్తున్నాడని చూస్తుంటాను. భక్తితో నివేదించింది నీళ్లే అయినా అమృత సమానం. నేను కోరేది ఆడంబరాన్ని కాదు, అచంచల భక్తిని అనేసి అంతర్ధానమయ్యాడు. ◻

## అరటికాయ కబాబ్



కావలసినవి : అరటికాయ: ఒకటి, సెనగపప్పు: అరకప్పు, చాట్ మసాలా: చిటికెడు, ఆమ్‌చూర్: చిటికెడు, కొత్తిమీర: కొద్దిగా, ధనియాల పొడి: అర టీస్పూన్, జీలకర్ర పొడి: అర టీస్పూన్, గరం మసాలా: పావు టీస్పూన్, కారం: పావు టీస్పూన్, నూనె: వేయించడానికి సరిపడా, ఉప్పు: తగినంత

**తయారీ విధానం:** ముందుగా, అరటికాయను ఉడికించి తొక్క తీసి, ఒక గిన్నెలో వేసి చేత్తో మెదిపి ఉంచాలి. ఉడికించిన సెనగపప్పును కూడా మెత్తగా మెదిపి అందులో వేయాలి. సన్నగా తరిగిన కొత్తిమీర, చాట్ మసాలా, ఆమ్‌చూర్, గరం మసాలా, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో చిన్న చిన్న ఉండలు చేసుకుని.. పొడవుగా కానీ, వెడల్పుగా కానీ వత్తుకుని వేడి నూనెలో వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించుకుంటే అరటికాయ కబాబ్ రెడీ. వీటిని టమాటా సాస్, పుదీనా చట్నీతో సర్వ్ చేసుకోవాలి.

## కారం రుచి

ఆరోగ్య భాగ్యం

ఆయుర్వేదంలో దీన్ని 'కటురసం' అని అంటారు. ఇది గాలి, అగ్ని మూలకాలతో కూడి ఉంటుంది. ఇది శరీరానికి వేడి, పొడి, కాంతి లక్షణాల్ని అందిస్తాయి. ఇది కఫాన్ని తగ్గించి, పిత్త, వాతాన్ని పెంచుతుంది. ఇది లాటిన్ పదం నుండి వచ్చింది. కారానినప గర్తించే రుచి మొగ్గలు నాలుక మధ్య భాగంలో ఉండి రుచి మొగ్గల కన్నా సొమాటో సెన్సరీ నర్వ్స్ ద్వారానే గుర్తించబడతాయి. కారానికి దానిలోని రెసిన్స్, కొన్ని రకాల ఆయిల్స్, గ్లైకోసైడ్స్ వల్ల ఘాటైన వాసన, కారం రుచి వస్తుంది. కారానికి కడుపు, గుండె, రక్తం, ప98నరుత్పత్తి అవయవాలపై ప్రభావం ఎక్కువనే చెప్పాలి.

**ఆహార పదార్థాలు :** ఎండు మిరపకాయలు (1నన%) ఎండు కారం (75%), పచ్చిమిర్చి (50%) కారంఘాటుతో ఉంటామి.వేగాకన మిరియాలు, లవంగాలు, ఏలకలు అల్లం, వెల్లుల్లి తులసి, మెంతులు, ఆవాలు, ముల్లంగి, ఉల్లి, పచ్చిబల్లులి, స్పెల్ట్ బుక్వీల్, టర్నిఫ్, ఇంగువ, దురియన్ పండు వంటి ఆహార పదార్థాల్లో కూడా కారం ఉంటుంది.

**లక్షణాలు :** ఇది ఆహారాన్ని గ్రహించడంలో, ఆహారం, రుచిని మెరుగు పర్చడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది చెమట వంటి వ్యర్థపదార్థాల నిర్మూలనలో సహాయపడు తుంది. ఇది ఆహారం శోషణ ద్వారా ఆహారాన్ని గ్రహించడం లో సహాయం పడుతుంది. సైనస్‌ల్ని క్లియర్ చేసి, రక్తప్రసరణని, స్టిములేట్ చేస్తుంది. ఇది ముక్కు, కంటిలోని స్రావాల్ని పెంచి శుభ్రపరుస్తుంది. ఇది ఇంద్రియ అవయవాల్ని పదును పెడుతుంది. శరీరంలోని టాక్సిన్స్, వాపులు, బనరువుని తగ్గిస్తుంది. దురదలు, ఎలర్జీలు వంటి కొన్ని చర్మవ్యాధుల నుండి కాపాడుతుంది ఇది అల్సర్ల పెరుగుదలని తగ్గిస్తుంది. కడుపులోని క్రిముల్ని చంపుతుంది. శరీరంలోని ఛానెల్స్‌ని క్లియర్ చేస్తుంది. రక్తం స్రావాన్ని తగ్గిస్తుంది. కండరాల కణజాలాన్ని స్క్రాప్ చేస్తుంది. ఇది స్థూలకాయం, శరీరంలోని జిడ్డుదనాన్ని కల్గిస్తుంది ఇది మలవిసర్జనకం మంచిది, అంతే గాకుండా కఫం, కండరాల నొప్పుల్ని తగ్గిస్తుంది. కారం మితంగా తింటే గొంతు నొప్పి, 2వాపు, అజీర్ణం నేత్రరోగాల్ని తగ్గుతాయి. కారం ఎక్కువగా తింటే వేడి, శుక్లనష్టం, బలంతగ్గుతుంది. గొంతు శరీరంలో మంట, దాహం శరీరం, ముందుకు వంగడం మైకం, కష్మదం, స్పృహకోలోనపనవడం, సన్నబడ డం, నపుంసకత్వం, కాళ్ళు, చేతులు, వీపులో వాయు నొప్పులుండడం, వణుకుంచడం, బరువు తగ్గుతారు. నడుం, వెన్నునొప్పి, కుట్టునొప్పి, అలసట, మలబద్దకం ఉంటుంది. ఇది మూత్ర ప్రవాహానికి ఆటంకం కల్గించడం వల్ల ఆందోళన కోపం, చిరాకు భ్రమల వంటి లక్షణాలు కల్గుతాయి.

**జాగ్రత్తలు :** ఆహారం చివర ఘాటైరనవి తీసుకోవాలి. రక్త స్రావం అయ్యేవారు మంటలు, అధిక జ్వరంతో బాధ పడేవారు పొట్టలో పుండ్లు, అధిక దాహం, ఉన్నవారు, లైంగిక వ్యాధులున్నవారు సన్నగా ఉన్నవారు, మందులు వాడేవారు షుగర్, లివర్ డిసీజెస్ ఉన్నవారు, కాఫీ, టీలు ఎక్కువగా త్రాగేవారు కారం మితంగా తీసుకోవాలి. ◻



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

## ఆత్మీయ సన్మానం



65 సంవత్సరాలుగా వివిధ పత్రికల్లో పనిచేస్తూ, నేటికీ పాత్రికేయ రచనలో నిమగ్నులైన వాశిరాజు ప్రకాశంకు ఇటీవల అగ్ర కథానాయకుడు చిరంజీవి తమ ఇంట్లో అరుదైన ఆత్మీయ సత్కారం చేసారు. వివిధ పత్రికల్లో సేవలు అందిస్తున్న పాత్రికేయులు కన్నులపండువగా జరిగిన ఈ వేడుకకు విచ్చేశారు. శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో వాశిరాజును చిరు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "65 ఏదేళ్లుగా పత్రికలే తమ లక్ష్యంగా, ఎంతో క్రమశిక్షణగా గడుపుతున్నారు వాశిరాజు. ఇన్నేళ్లుగా ఆయనతో నాకు వున్న అనుబంధాన్ని మాటలతో వర్ణించలేను. ఇది తీరని రుణం, బంధం అని చెప్పగలను" అని అన్నారు. అంతేకాకుండా వాశిరాజుతో తనకున్న అరుదైన జ్ఞాపకాలతో మెగాస్టార్ గుర్తు చేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా "వందేళ్ల సినిమా చరిత్ర రచన తన లక్ష్యంగా" వున్నట్లు వాశిరాజు తెలిపారు. చిరంజీవి, అనిల్‌రావిపూడి కలయికలో రూపొందిన 'మన వరశంకరప్రసాద్ గారు' సినిమా అఖండ విజయం సాధించిన నేపథ్యంలో సీనియర్ పాత్రికేయులను చిరు సన్మానించారు..


## అంచనాలను పెంచిన 'టాక్సిక్' టీజర్



టాక్సిక్ టీజర్‌తో సరికొత్త సినిమాటిక్ యూనివర్స్‌ను పరిచయం చేసిన రాకింగ్ స్టార్ యష్..ఇంటెన్సిటీతో అంచనాలను పెంచేస్తోన్న టీజర్2026లో సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న సినిమాల్లో"టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్ ఒకటి. పోస్టర్స్, గ్లింప్స్ అంటూ కొన్ని నెలలుగా సినిమా ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తోందో మనం చూస్తూనే ఉన్నాం. దీంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. టాక్సిక్ టీజర్‌ను గమనిస్తే.. ఒక విస్తృతమైన, గొప్పదైన సినిమాటిక్ ప్రపంచాన్ని ఆవిష్కరిస్తోంది. ఇది ఒక వైపు చూడటానికి రంగుల ప్రపంచంలా కనిపిస్తూనే, హింసాత్మకమైన స్వరూపాన్ని కూడా ప్రదర్శిస్తుంది. ఈ టీజర్లో సినిమాటిక్ తుపాన్ కలకలానికి కేంద్రబిందువుగా రాకింగ్ స్టార్ యష్ కనిపిస్తున్నారు. ఆయనలో కనిపిస్తున్న మార్పు కేవలం లుక్ మార్చడం మాత్రమే కాదు..పూర్తిగా కొత్త అవతారంలోకి మారినట్టుగా తెలుస్తోంది. సన్నగా, వేగంగా కదిలే శరీరాకృతి నుంచి యుద్ధాలకు సిద్ధమైన బలమైన, దృఢమైన ఆకారానికి మారడం వరకు ఆయన చూపించిన శరీరాకృతి లోని మార్పు ఈ సినిమాకి పెద్ద హైలైట్‌గా నిలుస్తోంది. చిత్రబృందం టీజర్ విడుదల సందర్భంగా "ఇట్స్ గాన్ గెట్ క్రేజీ" అంటూ ఒక ఉత్కంఠభరిత హెచ్చరికను ఇచ్చింది. టీజర్లో కనిపించిన భారీ దృశ్యాలు, భయనకమైన, ఉత్కంఠభరితమైన సీన్స్ చూస్తుంటే 2026 మార్చి 19న రాబోతున్న టాక్సిక్ మూవీపై ఉన్న అంచనాలను మించేలా ఉందనేది తెలుస్తోంది.

## తెర

## CULTపవర్ ఫుల్ ఫస్ట్ లుక్ రిలీజ్,



మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ మరోసారి బౌండరీస్ ని దాటి ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌తో వస్తున్నారు. ఫలక్‌నుమా దాస్, దాస్ కా ధమ్కీ వంటి చిత్రాలతో హీరో, దర్శకుడు, నిర్మాత, రచయితగా ఆకట్టుకున్న విశ్వక్సేన్ ఇప్పుడు తన స్వీయ రచన, దర్శకత్వంలో దిగెలిగి తో రాబోతున్నారు. తారక్ సినిమాస్ బ్యానర్ పై సందీప్ కాకరాల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో విశ్వక్‌సేన్ సూట్ ధరించి, నోట్లో సిగరెట్‌తో ముందుకు నడుస్తూ కనిపిస్తున్నారు. అతని చేతిలో రక్తంతో తడిసిన గొడ్డలి ఉండగా, అతడు వేసే ప్రతి అడుగుతో రక్తం వ్యాపిస్తూ పోస్టర్‌కు డార్క్ టోన్‌ను తీసుకొచ్చింది. దిగెలిగితో విశ్వక్‌సేన్ మరో పెద్ద అడుగు వేస్తూ 40 మంది కొత్త నటీనటులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నాడు. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. తరుణ్ భాస్కర్ డైలాగ్స్ రాస్తుండగా, రవి బస్రూర్ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీకి అర్వింద్ విశ్వనాథన్, ఎడిటర్ రవితేజ గిరిజాల, ప్రొడక్షన్ డిజైన్‌కు అర్వింద్ ములే.

## 'బూకి'యూత్‌తో పాటు ఫ్యామిలీ సినిమా. నిర్మాత రామాంజనేయులు జవ్వాజీ



అజయ్ దిషన్, ధనుషా హీరో హీరోయిన్స్ గా గణేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన యూత్ ఫుల్ ఎంటర్టైనర్ 'బూకి'. విజయ్ ఆంటోనీ సమర్పణలో శరవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్స్ పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. సునీల్, లక్ష్మి మంచు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే తమిల్ లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ ని అందుకుంది.

**ఈ సినిమా ఎలా ఉండబోతుంది?**

ప్రతి లవ్ స్టోరీ లో కథ ప్రేమతోనే మొదలవుతుంది. కానీ ఈ కథ మాత్రం బ్రేకప్‌తో మొదలవుతుంది.

**తమిళ్ లో ఎలాంటి రెస్పాన్స్ వచ్చింది?**

13న ఈ సినిమా తమిళ్లో రిలీజ్ చాలా అద్భుతంగా అద్భుతంగా వెళుతుంది. నిర్మాతలుగా చాలా హ్యాపీగా ఉన్నాం.

**విజయ్ ఆంటోనీ గారితో అసోసియేషన్ గురించి?**

2012లో నేను తమిళ్ లో బ్యాక్ టు బ్యాక్ డిస్ట్రిబ్యూషన్ చేస్తుండే వాడిని. ఆయన మ్యూజిక్ డైరెక్టర్ గా ఉండే సమయం నుంచి నాకు పరిచయం. ఫస్ట్ హీరోగా చేస్తున్నప్పుడు మా ఆఫీస్ కి వచ్చి హీరోగా పరిచయం అవుతున్నానని చెప్పారు. వారి ఫస్ట్ సినిమా కూడా మేము తెలుగులో రిలీజ్ చేయడం జరిగింది.

**డైరెక్ట్ గా తెలుగులో సినిమాలు చేయాలని ఆలోచన ఉందా?**

నాకు నేరుగా పెద్ద తెలుగు సినిమాలు చేయాలని ఉంది. కానీ దానికి100 టైం కేటాయించాలి. నేను పలు బిజినెస్ లో ఉన్నాను. మా ఫ్యామిలీ చెన్నైలో సెటిల్ అయింది. ఇప్పటికిప్పుడే హైదరాబాద్ షిఫ్ట్ అవ్వడం కుదరదు.

**మీ బ్యానర్ లో వస్తున్న కొత్త ప్రాజెక్టుల గురించి?**

సత్య దేవ్ గారితో ఒక సినిమా పూర్తయింది. అది తొందరలోనే రిలీజ్ చేస్తాం. అలాగే 100 దేవుళ్ళు సినిమా మేలో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఇంకో కథ చర్చల్లో ఉంది.

## బిత్తరి సత్తి పాడిన 'మింగలేక మంగళారాం' సాంగ్ రిలీజ్



శ్రీనాథ్ మాగంటి హీరోగా బాల సతీష్ దర్శకత్వం లో తెరకెక్కిన చిత్రం మెన్షన్ హౌస్ మల్లేష్. గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల హీరోయిన్స్. కనకమేడల ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజేష్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలలై ఈ సినిమా ఫస్ట్ సింగిల్, టీజర్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ మింగలేక మంగళారాం సాంగ్ రిలీజ్ చేశారు. సురేష్ బొబ్బిలి అందరికీ కనెక్ట్ అయ్యే ట్యూన్ ని కంపోజ్ చేశారు. బిత్తిరి సత్తి పెక్యులర్ వోకల్స్ సాంగ్ లో హైలెట్‌గా నిలిచింది. మల్లేష్ క్యారెక్టర్ గురించి ఎంటర్టైనింగ్ చెప్పిన విధానం అలరించింది. తరుణ్ సైదుల్ రిలిక్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ చిత్రంలో మురళీధర్ గౌడ్, రాజ్ కుమార్ కసిరెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీవోపీ అమ్మముత్తు, ఎడిటర్ గ్యారీ తీబీ. మెన్షన్ హౌస్ మల్లేష్ మార్చి 6న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. తారాగణం: శ్రీనాథ్ మాగంటి, గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల, రాజేష్, మురళీధర్ గౌడ్, రాజ్ కుమార్ కసిరెడ్డి, సాయి ప్రసన్న, పద్మ నిమ్మనగోటి, హరి రెబెల్.

## 'యస్ ఎల్ వి' నూతన చిత్రం !!



'మా ఊరి ప్రేమకథ' చిత్రంతో హీరోగా పరిచయం అయిన మంజునాథ్.. తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ మంచి పేరు, గుర్తింపు తెచ్చు కోవాలని .. వరుసగా సినిమాలు చేస్తూ.. ఇండస్ట్రీలో దూసుకుపోతున్నారు. రౌడీ విక్రమ్ పక్కా ప్రేమికుడు, చిత్రాలు షూటింగ్ చివరి దశలో ఉండగానే మరొక చిత్రానికి శ్రీకారం చుట్టారు.. హీరో మంజునాథ్. శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి క్రియేషన్స్ (S L V) పతాకంపై నూతన దర్శకుడు అభిరామ్ గంటా దర్శకత్వంలో టాలెంటెడ్ యాక్టర్ మంజునాథ్ హీరోగా వి. లక్ష్మి దేవి నిర్మిస్తోన్న ప్రొడక్షన్ నంబర్ వన్ చిత్రం ఫిబ్రవరి 19న హైదరాబాద్ సంస్థ కార్యాలయం లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. దేవుని పటాలపై చిత్రీకరించిన ముహూ ర్తపు సన్నివేశానికి హీరో మంజునాథ్ క్లాప్ నివ్వగా డీవోపీ శేఖర్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ సన్నివేశానికి చిత్ర దర్శకుడు అభిరామ్ గంటా గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం ... హీరో మంజునాథ్ మాట్లాడుతూ.. " నేను హీరోగా నటించిన మా ఊరి ప్రేమకథ చిత్రం మంచి హిట్ అయి హీరోగా నాకు మంచి పేరు తెచ్చింది. వెంటనే "రౌడీ విక్రమ్" సినిమా అవకాశం వచ్చింది. ఆ చిత్రం షూటింగ్ చివరి దశలో వుంది. ఇదిలా ఉండగా మరొక చిత్రం "పక్కా ప్రేమికుడు" సినిమా లో కూడా హీరోగా చేస్తున్నాను. ఈ చిత్రం తొంభై శాతం కంప్లీట్ అయింది. ఈ రెండు చిత్రాలు అండర్ ప్రొడక్షన్ లో ఉండగానే మరొక సినిమా చేసే అవకాశం వచ్చింది. చిత్ర దర్శకుడు అభిరామ్ గంటా మాట్లాడుతూ.. ఫస్ట్ నేను యూట్యూబర్ ని. ఆ తర్వాత కొన్ని వెబ్ సిరీస్ చేశాను. ఈ సినిమాకి దర్శకత్వం చేసే అవకాశాన్ని ఇచ్చిన మా నిర్మాత లక్ష్మి దేవి గారికి నా థాంక్స్. చిత్ర నిర్మాత వి. లక్ష్మి దేవి మాట్లాడుతూ.. " ఈ చిత్రంలో హీరో మంజునాథ్ సరసన ప్రముఖ హీరోయిన్ కథా నాయికగా నటించనుంది.



## ఆసీస్ గెలుపు

**పల్లీకల్:** టీ20 ప్రపంచకప్ చివరి గ్రూప్ మ్యాచ్ లో ఆస్ట్రేలియాకు ఊరట విజయం లభించింది. ఓమన్‌పై 9 వికెట్లతో ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఓమన్ 16.2 ఓవర్లలోనే 104 రన్స్‌కు ఆలౌటైంది. వాసీమ్ అలీ 32 పరుగులతో ఓమన్ జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆడమ్ జంపా 4వికెట్లు.. గ్జేవియం, మాక్స్‌వెల్ రెండేసి వికెట్లతో కుల్చ కూల్చారు. 109 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా ఒక వికెట్ కోల్పోయి మరో 62 బంతులుండగానే గెలుపొందింది. తొలి వికెట్‌కు కెప్టెన్ మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్ ధాటిగా ఆడుతూ 93 పరుగుల భాగస్వామ్యం అందించారు. ఈ క్రమంలో మిచెల్ మార్ష్(33 బంతుల్లో 64 రన్స్) అర్ధ సెంచరీ సాధించాడు.ట్రావిస్ హెడ్ 19 బంతుల్లో 32 రన్స్ చేసి అవుటయ్యాడు. జోస్ ఇంగ్లీష్ అండగా మరో వికెట్ కోల్పోకుండా మిచెల్ మార్ష్ ఆసీస్‌కు విజయాన్ని అందించాడు. ఇప్పటికే టోర్నీకి దూరమైన ఆస్ట్రేలియా... 4మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో మూడో స్థానం పొందింది.

# సెమీస్ కోసం 8 జట్ల సమరం

## నేటినుంచి సూపర్8 బిగ్‌ఫైట్ * సౌతాఫ్రికాతో భారత్ తొలిపోరు

ఆహ్మదాబాద్: టీ20 ప్రపంచకప్ సమరం సూపర్-8కు చేరుకుంది. జింబాబ్వే సంచలన విజయాలతో సూపర్8కు చేరుకోగా, ఫేవరెట్ జట్లలో ఒకటైన ఆస్ట్రేలియా అనూహ్యంగా ఇంటి దారి పట్టింది. ఈ ఒక్కటి తప్పితే గ్రూప్ స్టేజ్ పెద్దగా సంచలనాలు లేకుండా ముగిసింది. హాట్ ఫేవరెట్ జట్లన్నీ అలవోకగా సూపర్8కు చేరుకున్నాయి. ఎన్నో అంచనాలతో బరిలోకి దిగిన ఆఫ్ఘనిస్తాన్, నెదర్లాండ్స్ సంచలన విజయాలు సాధించలేక చతికిలపడ్డాయి. మిగతా క్రికెట్ కూనలు కెనడా, ఇటలీ, ఓమన్, యూఏఈ, ఐర్లాండ్, నేపాల్ లాంటి జట్లన్నీ గ్రూప్ స్టేజ్‌లోనే వెనుదిరిగాయి.

గ్రూప్-ఏ నుంచి హాట్ ఫేవరెట్ టీమిండియా ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెగ్గింది. పాకిస్థాన్‌తో కలిసి సూపర్8 చేరింది. గ్రూప్-బి నుంచి జింబాబ్వే, శ్రీలంక.. గ్రూప్-సి నుంచి వెస్టిండీస్, ఇంగ్లాండ్... గ్రూప్-డి నుంచి దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు ముందంజ వేశాయి. గ్రూప్ స్టేజ్‌లో కొన్ని నామమాత్రపు మ్యాచ్‌లు టోర్నీకి హైప్ తీసుకురాలేకపోయాయి.

**నేటి నుంచి సూపర్8 మజా**

పొట్టి ప్రపంచకప్ సూపర్8కు చేరుకోవడంతో ఇక మ్యాచ్‌లన్నీ ఉత్కంఠ రేపనున్నాయి. ఈ మెగాటోర్నీలో అసలుసిసలైన టీ20 మజా నేటి నుంచి మొదలుకానుంది. సూపర్8కు చేరిన



ఎనిమది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. సూపర్8 గ్రూప్-1లో భారత్‌తో పాటు సౌతాఫ్రికా, జింబాబ్వే, వెస్టిండీస్... సూపర్8 గ్రూప్-2లో శ్రీలంకతో సహా పాకిస్థాన్, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్లు ఉన్నాయి. గ్రూప్-1 మ్యాచ్‌లు భారత్‌లో, గ్రూప్-2 మ్యాచ్‌లు శ్రీలంకలో జరుగుతాయి. గ్రూప్‌లో ఒక్కో జట్టు మూడు మ్యాచ్‌లు ఆడుతుంది. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీ ఫైనల్ చేరుతాయి.

**సౌతాఫ్రికాతో తొలి సమరం**

ఇవాళ కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో పాకిస్థాన్, న్యూజిలాండ్ మ్యాచ్‌తో సూపర్8 స్టేజ్ అసలుసిసలు పోరు మొదలుకానుంది. అతిథ్య భారత్..సూపర్8 తొలి మ్యాచ్‌లో ఆహ్మదాబాద్ వేదికగా ఆదివారం దక్షిణాఫ్రికాతో తలపడనుంది. ఫిబ్రవరి 26న చెన్నైలో జింబాబ్వేతో, మార్చి 1న కోల్‌కతాలో వెస్టిండీస్‌తో టీమిండియా తలపడనుంది.

**సెమీస్ వరకు పాక్‌తో ఫైట్ లేనట్లే**

చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ జట్లు మరోసారి తలపడితే చూడాలని ఇరుజట్ల అభిమానులు కోరుకుంటున్నారు. అయితే సూపర్8లో ఆ ఛాన్స్ లేదు. రెండు జట్లు వేర్వేరు గ్రూపుల్లో ఉండడమే దీనికి కారణం. సెమీస్‌కు భారత్, పాకిస్థాన్ చేరుకుని తమ గ్రూపుల్లో ఒకటి టాప్ ప్లేస్, మరోటి సెకండ్ ప్లేస్‌లో ఉంటేనే సాధ్యమవుతుంది.

**భారత్‌కు అసలైన సవాళ్లు**

డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన టీమిండియా గ్రూప్ స్టేజ్‌లో ఇరగదీసింది. అమెరికాతో కాస్త చెమటోడ్చడం మినహాయిస్తే మిగతా మ్యాచ్‌లన్నీ ఈజీ విక్టరీలతో ముగించింది. ప్రస్తుత టీమిండియా ఫామ్ చూస్తే సెమీస్‌లోకి చేరడం ఈజీగానే కనబడుతోంది. అయితే సూపర్8 గ్రూప్-1లో సౌతాఫ్రికా, జింబాబ్వే, వెస్టిండీస్‌ల నుంచి అసలు సిసలు పరీక్ష ఎదురు చూసింది. ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన కొనసాగించాల్సి ఉంటుంది. అయితే ఓ మ్యాచ్‌లో తడబడ్డా మరో రెండు మ్యాచ్‌ల్లో విజృంభిస్తే సెమీస్ ఛాన్స్ ఉంటుంది.

సెమీఫైనల్ చేరే జట్లపై మాజీ క్రికెటర్లు భిన్నమైన అంచనాలు వేస్తున్నారు. యుజ్వేంద్ర చాహల్, మహమ్మద్ కైఫ్ వంటి వారు భారత్, సౌతాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్లు టాప్ 4లో ఉంటాయని జోస్యం చెప్పారు.



## దుబాయ్ ఓపెన్ టెన్నిస్
## రుతుజా జోడీ ఓటమి

**దుబాయ్:** భారత మహిళల టెన్నిస్ డబుల్స్ నెంబర్‌వన్ రుతుజా భోస్లే.. దుబాయ్ ఓపెన్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. థాయ్ లాండ్ ప్లేయర్ పీంగ్‌టార్న్ జోడీగా బరిలోకి దిగిన రుతుజా... ప్రి క్వార్టర్ ఫైనల్లో కజకిస్తాన్-సెర్బియా జోడీ డానిలినా, క్రునిక్ చేతిలో పోరాడి ఓడారు. తొలి సెట్‌ను 3-6తో చేజార్చుకున్న రుతుజా జోడీ... రెండో సెట్‌లో నువ్వానేనా అన్నట్లుగా పోరాడింది. ట్రైబేకర్ వరకు జరిగిన రెండో సెట్‌లో ఒత్తిడికి లోనై 6-7తో ఓడింది. అంతకుముందు తొలి రౌండ్‌లో రుతుజా జోడీ 7-5, 6-2తో జపాన్-చైనీస్ తైపీ జోడీపై గెలుపొందింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన రుతుజా జోడీకి 15లక్షల ప్రైజ్‌మనీతో పాటు 120 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

# న్యూజిలాండ్, పాకిస్థాన్ సూపర్ ఫైట్





**కొలంబో:** టీ20 ప్రపంచకప్ సూపర్8 సమరంలో నేడు న్యూజిలాండ్‌తో పాకిస్థాన్ తలపడనుంది. కొలంబోలోని ప్రేమదాస స్టేడియం ఈ మ్యాచ్‌కు వేదికకానుంది. రెండు జట్లు కూడా తమ తమ గ్రూప్‌ల్లో రెండో స్థానంతో సూపర్8కు వచ్చాయి.గ్రూప్ దశలో తక్కువ ర్యాంక్ జట్లపై సులభంగా గెలిచినా, ఎదురైన ఏకైక బలమైన జట్ల చేతుల్లో ఘోరంగా విఫలమయ్యాయి.

పాకిస్థాన్ జట్టు తమ మ్యాచ్‌లన్నీ శ్రీలంక వేదికగా ఆడడం ఆజట్టుకు అనుకూలించే అంశం. న్యూజిలాండ్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లన్నీ భారత్‌లో ఆడింది. వేదిక మార్పు ప్రధాన సవాలుగా నిలువనుంది. స్పిన్నర్లకు అనుకూలించే ప్రేమదాస స్టేడియంలో కివీస్‌లు చెమటోడ్చాల్సి ఉంటుంది. పాకిస్తాన్ తమ మ్యాచ్‌ల్లో స్పిన్నర్లను సమర్థంగా ఉపయోగించుకుంది. సాంట్నర్ నాయకత్వంలోని న్యూజిలాండ్ జట్టు బ్యాటింగ్‌లో పెద్ద మార్పులు చేయలేదు, ఫిన్ అలెన్, టిమ్ సైఫర్ట్, రచిన్ రవీంద్ర, ఫిలిప్స్ బ్యాటింగ్‌లో రాణిస్తే న్యూజిలాండ్‌కు తిరుగుండదు.

ఇక పాకిస్తాన్ టాప్ ఆర్డర్‌లో భారీ స్కోర్లు చేసే సామర్థం ఉంది, బాబర్ ఆజమ్, సయీమ్ అయూబ్ ఫామ్‌లో లేకపోవడం సమస్యగా మారింది. మరోవైపు సాహిబ్‌జాదా ఫర్హాన్ పవర్‌ప్లేలో పరుగుల బాధ్యతను తీసుకున్నారు. మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్ వైఫల్యం పాక్‌ను వెంటాడుతోంది. అబ్రార్ అహ్మద్ సూపర్8లో తిరిగి జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. సూపర్8 కీలక దశల్లో పాకిస్తాన్‌కు అత్యుత్తమ ప్రదర్శన అవసరం.

**జట్లు(అంచనా): పాకిస్తాన్:**ఫర్హాన్, సయీమ్, సల్మాన్‌ఆఘా (కెప్టెన్),బాబర్ ఆజమ్, నఫాయ్, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్ (వికెట్ కీపర్), నవాజ్/అష్రఫ్, సల్మాన్, ఉస్మాన్ తారిక్, అబ్రార్ అహ్మద్; **న్యూజిలాండ్:** సైఫర్ట్ (వికెట్ కీపర్), ఫిన్ అలెన్, రచిన్, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ చాప్మన్, డారిల్ మిచెల్, సాంట్నర్ (కెప్టెన్),నీషమ్, మ్యాట్ హెన్రీ, ఇష్ సోదీ, జేకబ్ డఫీ.

# శివమ్ దూబే అసలైన క్లాస్

**ముంబై:** టీమిండియా ఆల్‌రౌండర్ శివమ్ దూబే జట్టు విజయాల్లో కీరోల్ పోషిస్తున్నాడు. ముఖ్యంగా జట్టు బ్యాటింగ్‌లో విఫలమైనపుడు జోరుచూపుతూ ఆదుకుంటున్నాడు.స్లాగ్ ఓవర్లలో పరుగుల వరద పారిస్తున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో మెరుపు బ్యాటింగ్‌తో అలరిస్తూ విలువైన బాట్స్‌మెన్‌గా ఎదిగాడు. ఎంతగా అంటే శివమ్ దూబే క్రీజ్‌లోకి వచ్చాడంటో మెరుపులు మెరిపిస్తాడు అన్నంతగా.

అహ్మదాబాద్ వేదికగా నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో శివమ్ దూబే 31 బంతుల్లోనే 4 ఫోర్లు, 6సిక్స్‌లతో 66 పరుగులతో చెలరేగాడు. సహచరులు రన్స్ చేయడానికి ఇబ్బంది పడిన వికెట్‌పై దూబే మాత్రం అలవోకగా పరుగులు సాధించాడు. బౌలింగ్‌లోనూ రెండు వికెట్లు పడగొట్టి ఆల్‌రౌండ్ షో చేశాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు.పాక్‌తో మ్యాచ్‌లోనూ ఈ



లెఫ్టాండ్ బ్యాట్స్‌మెన్ స్కోరు వేగం పెంచాడు. స్పిన్నర్లకు అనుకూలించిన ప్రేమదాస వికెట్‌పై చెలరేగాడు.17 బంతుల్లో 3 ఫోర్లు, ఓ సిక్స్‌తో 27 రన్స్ సాధించాడు. జట్టు స్కోరును 175కు చేర్చాడు. ఇదే పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచింది. అలాగే నమీబియాపై కూడా 16 బంతుల్లో ఓ ఫోర్, ఓ సిక్స్‌తో 23 విలువైన పరుగులు రాబట్టాడు. టీ20 ప్రపంచకప్‌కు ముందు సొంత గడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లోని వైజాగ్ మ్యాచ్‌లో సిక్సర్ల జడివాన కురిపిస్తూ 23బంతుల్లోనే వాయువేగంతో 65రన్స్ చేశాడు.

సవాలుతో కూడిన పరిస్థితుల్లో బ్యాటింగ్ చేయడానికి ఇష్టపడతానంటున్న శివమ్ దూబే... ఒత్తిడిని పటాపంచలు చేస్తున్నాడు. సిక్సర్లు కొట్టడం ఇష్ట మైనప్పటికీ, పరిస్థితులను పట్టించుకోకుండా గుడ్డిగా ఆడలేనని శివమ్ దూబే స్పష్టం చేస్తున్నాడు. బౌలర్ మంచి బంతులు వేస్తున్నప్పుడు అంతే కసిగా ఆడడం తనకిష్టమని చెబుతున్నాడు.



## ఫ్యాషన్ దిగ్గజం ఎస్‌వోఎస్ యజమాని అనుమానాస్పద మృతి

**బ్యాంకాక్, ఫిబ్రవరి 20:** ఫ్యాషన్ దిగ్గజం ఏఎస్‌ఓఎస్ సహ వ్యవస్థాపకుడు క్వెంటిన్ గ్రిఫిత్స్ థాయ్‌లాండ్‌లో ఓ అపార్టుమెంట్‌లోని 17వ అంతస్తు బాల్కనీ నుంచి కిందపడి మృతి చెందారు. ఆయన వయస్సు 58 సంవత్సరాలు. పట్టాయాలోని అపార్ట్ మెంట్ నుంచి అనుమానాస్పద స్థితిలో కిందపడి మృతి చెందారు. పోలీసులు, మెడికల్ సిబ్బంది, ఎమర్జెన్సీ సర్వీస్ అధికారులు వచ్చి చూసేసరికి ఆయన నేలపై విగతజీవుడిలా కనిపించారు. ఆయన మరణానికి ముందు అపార్ట్ మెంట్‌లో ఎలాంటి ఘర్షణ లేదా గందరగోళ వాతావరణం కనిపించలేదని అధికారులు వెల్లడించారు. అయితే కుట్ర కోణాన్ని వారు తోసిపుచ్చలేదు. పోస్టుమార్టం నివేదిక అనంతరం ఆయన మృతికి కచ్చితమైన కారణం తెలుస్తుందని వెల్లడించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని పోలీసు అధికారులు వెల్లడించారు. క్వెంటిన్ గ్రిఫిత్స్ అదే అపార్ట్ మెంట్‌లో ఉంటున్నారు. 2000 సంవత్సరంలో ప్రారంభమైన ఏఎస్‌ఓఎస్ సంస్థ వ్యవస్థాపకుల్లో క్వెంటిన్ గ్రిఫిత్స్ ఒకరు. తర్వాత అది బిలియన్ డాలర్ల కంపెనీగా ఎదిగింది. ఈ సంస్థ ఫ్యాషన్ ఉత్పత్తులను వినియోగించే వారిలో అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా భార్య మిచెల్ ఒబామా కూడా ఉన్నారు. క్వెంటిన్ తన మొదటి భార్య నుంచి విడాకులు తీసుకున్న తర్వాత 2007లో థాయ్‌లాండ్‌కు మకాం మార్చారు.

ఆ తర్వాత థాయ్ మహిళను వివాహం చేసుకున్నారు. కొద్దికాలానికి ఆమెతో విడిపోయారు. క్వెంటిన్ గ్రిఫిత్స్‌కు ముగ్గురు సంతానం ఉన్నారు.

## ఎఐ టూల్స్‌పై పట్టులేని ఉద్యోగులకు ప్రమోషన్లు కట్
### ఎంప్లాయీస్‌కి యాక్సెంచర్‌సంస్థ డేంజర్ సిగ్నల్స్




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ప్రముఖ గ్లోబల్ కన్సల్టింగ్ దిగ్గజం యాక్సెంచర్, ప్రమోషన్ల అర్హతలో కృత్రిమ మేధ (ఏఐ)ను క్రమం తప్పకుండా ఉపయోగించడం ఒక కీలకమైన అంశంగా మార్చింది. సీనియర్ ఉద్యోగులు ఏఐ టూల్స్‌ను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని యాక్సెంచర్ సూచించింది. వాటి వినియోగం ఆధారంగా కూడా లీడర్‌షిప్ రోల్స్ అందుకుంటారని, లేదంటే ప్రమోషన్లు ఉండవని సంకేతాలు ఇచ్చింది. కంపెనీలు డిజిటల్ మార్పును వేగవంతంగా అందిపుచ్చుకుంటున్నాయి. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగం ఏఐని అందిపుచ్చుకుని మెరుగైన పనితీరును కనబరచాలని టెక్నాలజీ సంస్థలు భావిస్తున్నాయి. ఈ క్రమంలో యాక్సెంచర్ ఉద్యోగుల ప్రమోషన్లకు సంబంధించి ఈ కీలక సూచన చేసింది. సీనియర్ మేనేజర్లు, అసోసియేట్ డైరెక్టర్లకు కంపెనీ మెయిల్ ద్వారా ఈ సందేశం పంపించినట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. లీడర్‌షిప్ పాత్రలో ఎదగడానికి ఏఐ సాధనాలను క్రమం తప్పకుండా ఉపయోగించాలని స్పష్టం చేసింది. క్లయింట్లకు అత్యుత్తమ, వేగవంతమైన సేవలు అందించడానికి ఇది అవసరమని యాక్సెంచర్ భావిస్తోంది. యాక్సెంచర్ కొంతకాలంగా ఏఐపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఏఐతో రీస్కిల్ చేయడం సాధ్యంకాని ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. మరోవైపు, కంపెనీ ఏఐ ప్రణాళికలకు సిద్ధంగా లేని ఉద్యోగులు స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేయాలని గూగుల్ ఇటీవల తెలిపింది. ఇందుకోసం విరమణ ప్యాకేజీని కూడా ప్రకటించింది. అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ తదితర టెక్ దిగ్గజాలు కూడా గూగుల్ బాటలోనే పయనించాయి.

## వాణిజ్యం



## ఏప్రిల్‌నుంచి అమలులోకి ఇండోఅమెరికా ట్రేడ్‌డీల్!
### కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** భారత్ అమెరికాలమధ్య జరిగిన తాత్కాలిక వాణిజ్య ఒప్పందం సంతకాలు మార్చిలో జరుగుతాయని, వచ్చే ఏప్రిల్ నుంచి అమలులోకి వస్తుందని వాణిజ్యమంత్రి పియూష్‌గోయల్ పేర్కొన్నారు. అంతేకాకుండా భారత్ స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పం దాలు ఇతర దేశాలతో కూడా చేసుకుందని, బ్రిటన్, ఒమన్ దేశాలతో జరిగిన ఒప్పందాలు కూడా ఏప్రిల్‌నుంచే అమలులోకి వస్తాయన్నారు. న్యూజిలాండ్‌తో జరిగిన ఒప్పందం మాత్రం ఈ ఏడాదిసెప్టెంబరునుంచి అమలవుతుందని కేంద్ర మంత్రి స్పష్టంచేసారు. ఈనెల 23నుంచి ఈ ఒప్పందంపరిధిలోని న్యాయపరంగా వచ్చే సమస్యలు,సవాళ్లను అధిగమించేందుకు వీలుగా ఉభయతారకంగా చర్చించేందుకు అమెరికా ప్రతినిధిబృందంతో చర్చలు జరుగుతాయన్నారు. అంతకుముందు ఈనెలలోనే భారత్ అమెరికాలు రెండు కూడా తాత్కాలిక వాణిజ్య ఒప్పందం నిర్మాణ క్రమంరూపకల్పన జరుగుతున్నదని, ఒప్పందం ఖరారయిందని ప్రకటించాయి. ఇందుకోసం అమెరికా మంత్రి మార్కో రుబియో కూడా భారత పర్యటనకు రానున్నట్లు తెలిపారు.

## ఎనిమిది కీలకరంగాల వృద్ధి 4% మాత్రమే

**ముంబయి, ఫిబ్రవరి 20:** భారత్‌లోని ఎనిమిది కీలకరంగాల సమిష్టి వృద్ధి జనవరిలో నాలుగుశాతానికి నమోదయింది. అంతకు ముందునెలలో 4.7శాతంనుంచి స్వల్పంగా తగ్గిందని వాణిజ్యమంత్రిత్వ శాఖప్రకటించింది. విద్యుత్ ఉత్పత్తి వృద్ధిలో మందగమనమే ఇందుకుకారణమని, డిసెంబరులో 6.3శాతం ఉంటే జనవరిలో 3.8శాతానికి పడిపోయిందని వాణిజ్యశాఖ తెలిపింది. సిమెంట్ ఉత్పత్తి 10.7శాతం పెరిగింది. దీనివల్ల నిర్మాణరంగ కార్యకలాపాలుపెరిగాయి. అంతకుముందునెలలో 13.5శాతంవరకూ ఉన్నప్పటికీ జనవరిలో తగ్గినా నిర్మాణరంగం ఊపందుకుంది. ఇక ఉక్కు ఉత్పత్తి 6.9శాతంనుంచి 9.9శాతానికి పెరిగింది. బొగ్గురంగం కూడా 3.6 గతనెలలోపెరిగితే జనవరిలో 3.1శాతం వరకూ ఉత్పత్తిని సాధించింది. ఇక ఎరువుల ఉత్పత్తివిభాగంలో కూడా 4.1శాతంనుంచి జనవరిలో 3.7శాతానికి పడిపోయింది. పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తులు నిలకడగా కొనసాగాయి. అంతకుముందునెలలో ఒకటిశాతం క్షీణించిన తర్వాత జనవరిలో మాత్రం బ్రేక్‌ఈవెన్ దిశగా కొనసాగడం కొంత ఊరటనిచ్చింది. అలాగే హెచ్‌ఎస్‌బిసి సేవలరంగ పిఎంఐ సూచీ 58.5పాయింట్లకుపెరిగింది. డిసెంబరు 58 పాయింట్లు మాత్రమే ఉన్న సేవలరంగ సూచీ జనవరిలో 58.5 పాయింట్లుగా నమోదయింది. కొత్త బిజినెస్‌లు, సుస్థిర దేశీయ అంతర్జాతీయడిమాండ్ పెరగడమే దీనికి కారణం. ఇక ఉద్యోగ నియామకాలు కూడా సేవలరంగ సంస్థలు పెంచాయి. బిజినెస్ విశ్వాసం కూడా మూడునెలల గరిష్టానికి పెరిగింది. ఫైనాన్స్, బీమారంగాలు వృద్ధికారకాలుగా నిలిచాయి. వీటికితోడు డిజిటల్ సేవలరంగం కూడా వృద్ధిలోకి వచ్చింది. అమెరికాలోఐఎస్ఎం సర్వీసెస్ పీఎంఐ జనవరి నెలకుగాను 53.8శాతంగా ఉంది.

## వారాంతంలో భారీ లాభాలతో సెన్సెక్స్,నిఫ్టీ



**ముంబయి, ఫిబ్రవరి 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంకులు, మెటల్ రంగ షేర్లలో బలమైన కొనుగోళ్లు జరగడంతో సూచీలు రాణించాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 316 పాయింట్లు లాభపడి 82,814 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 116 పాయింట్లు పెరిగి 25,571 వద్ద ముగిసింది. రంగాల వారీగా చూస్తే, ఐటీ, మీడియా మినహా మిగిలినవన్నీ సెక్టార్లన్నీ లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ ఐటీ సూచీ 0.98 శాతం నష్టపోగా, పీఎస్‌యూ బ్యాంకింగ్ సూచీ 1.68 శాతం, మెటల్ సూచీ 1.25 శాతం చొప్పున లాభ పడ్డాయి. పవర్, క్యాపిటల్ గూడ్స్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో కూడా కొనుగోళ్ల ఆసక్తి పెరిగింది. మార్కెట్ ధోరణి మాత్రం ప్రతికూలంగా ఉంది. బిఎస్ఇలో 1917 షేర్లు లాభపడితే 2265 షేర్లు నష్టాల్లో ముగిశాయి. రోజు ప్రారంభంలో ఒడిదొడుకులకు లోనైన ప్పటికీ, తక్కువ స్థాయిల వద్ద నాణ్యమైన షేర్లను కొనుగోలు చేసేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో మార్కెట్లు పుంజుకుయి. అమెరికా ఇరాన్ మధ్య భౌగోళిక ఉద్రిక్తతలు, మిశ్రమ అంతర్జాతీయ సంకేతాల కారణంగా సమీప భవిష్యత్తులో మార్కెట్ కొంత రేంజ్‌బౌండ్‌లోనే ఉండవచ్చని వారు అంచనా వేస్తున్నారు. ఇక డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.02 శాతం బలపడి 90.99 వద్ద ముగిసింది. హిందాల్కో ఇండస్ట్రీస్ 3.21శాతం, ఎన్టీపీసి 2.64శాతం, ఎల్‌అండ్‌టి 2.33శాతం వంటివి నిఫ్టీలో మంచి బూస్ట్ ఇచ్చాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.44శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.19శాతం క్షీణించాయి. పాక్స్ సిలికా కూటమిలో భారత్ చేరినట్లు ప్రకటన వెలువడగానే టెక్నాలజీ షేర్లు ఊపందు కున్నాయి. విదేశీ కరెన్సీ మార్పిడి మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 90.95గా నిలిచాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 1.06శాతంపెరిగి రూ.1,56,441గా కొనసాగింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు ఏప్రిల్ సెటిల్‌మెంట్లు 41సెంట్లుపెరిగి 71.25డాలర్లుగా కొనసాగింది. ఇక కంపెనీలపరంగా నోవార్టిస్ 20శాతం, ఎబిబి ఇండియా 4.72శాతం, డీ డెవలప్‌మెంట్ ఇంజినీర్స్ 13శాతం, సిఐఇ ఆటోమోటివ్ ఇండియా 1.68శాం, జైడస్ లైఫ్ సైన్సెస్ 0.08శాతం, పేస్ డిజిటెక్ 2.82శాతం, ఐఎఫ్‌జిఎల్ రిఫ్రాక్టరీస్ 0.20శాం పెరిగాయి.



## విదేశీ కరెన్సీ ఖజానా కళకళ
### 725 బిలియన్ డాలర్లకు పెరిగిన నిల్వలు

**ముంబయి, ఫిబ్రవరి 20:** భారత్ విదేశీ కరెన్సీ ఖజానాకు భారీగా విదేశీ నిధులు వచ్చిపడ్డాయి. దీనితో 14.595 బిలియన్ డాలర్లు పెరిగాయి. మొత్తంగాచూస్తే విదేశీ కరెన్సీ ఖజాని 725 బిలియన్ డాలర్లుగా ఉందని ఆర్బీఐ ప్రకటించింది. జనవరి 30వ తేదీతో ముగిసినవారానికి సంబంధించి గణాంకాలను ఆర్బీఐ విడుదలచేసింది. అంతర్జాతీయ మార్కెట్లలో ఔన్స్ బంగారం 5600 డాలర్లు చేరుతున్న దశలో బంగారం కొనుగోళ్లు కూడా ఆర్బీఐ భారీగానే జరిపింది. భారత్‌వద్దప్రస్తుతం 810 టన్నులకుపైగా బంగారం రిజర్వులున్నాయి. ఎక్కువశాతం భారతీయకుటుంబాలవద్దనే పసిడినిల్వలున్నట్లు ప్రపంచ పసిడిమండలిసైతం పేర్కొంది. భారత్ విదేశీ కరెన్సీ ఖజానాపరంగా ఐదో అతిపెద్దఫోరెక్స్ నిల్వలున్న దేశంగా నిలిచింది. ఫోరెక్స్ నిల్వలు ఆల్‌టైమ్ గరిష్టానికి అంటే 14.361 బిలియన్ డాలర్లు పెరిగి 723.774 బిలియన్ డాలర్లకు చేరాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.